

SAPTHAGIRI
SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume: 54, Issue: 10
MARCH - 2024 Price Rs. 20/-
తిరుమల తిరుపతి దేవస్థానములు
సప్తగిరి
ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక
మార్చి 2024
వెల రూ. 20/-
పుటలు-56
తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి
తెప్పోత్సవాలు
2024
మార్చి 20 నుండి
24వరకు
SIVAPRASAD

# తిరుమల తిరుపతి దేవస్థానములు







22-01-2024న అయోధ్యలో జరిగిన 'బాలరాముని విగ్రహప్రతిష్ఠ' కార్యక్రమంలో పాల్గొన్న తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షులు శ్రీభూమన కరుణాకరరెడ్డిగారు.



16-01-2024న తిరుపతి రామచంద్రపుష్కరిణిలో జరిగిన 'కోటి హనుమాన్ చాలీసా' పారాయణ మహాయజ్ఞంలో శ్రీసీతారాముల, శ్రీఆంజనేయస్వామివారికి నీరాజనం ఇస్తున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీభూమన కరుణాకరరెడ్డి గారు.



21-01-2024న తిరుమల నాదనీరాజన మండపంలో జరిగిన 6వ విడత శ్రీమద్రామాయణ అయోధ్యకాండ అఖండపారాయణ దృశ్యం.







అయోధ్యలో 22-01-2024న జరిగిన 'బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ' కార్యక్రమానికి తిరుమలలో శ్రీవారి సేవాసదన్-1 నుండి శ్రీవారి ప్రసాదంగా లడ్డూలను 19-01-2024న పంపిస్తున్న దృశ్యం. ఈ కార్యక్రమంలో తి.తి.దే. జే.ఈ.ఓ. శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., చీఫ్ పి.ఆర్.ఓ. డా॥ టి.రవి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



22-01-2024న తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో అయోధ్య బాలరాముని విగ్రహప్రతిష్ఠ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల బృందంచే నిర్వహించబడిన 'అన్నమయ్య సంకీర్తన అఖండ మహాయజ్ఞ' కార్యక్రమ దృశ్యం.




22-01-2024న తిరుమల ధర్మగిరిలో వేదవిజ్ఞానపీఠం వారిచే నిర్వహించిన 'సంపూర్ణ వాల్మీకి రామాయణ పారాయణ' కార్యక్రమ చిత్రం.



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః।**
**ఆగమాపాయినోఽ నిత్యాః తాంస్తితిక్షస్వ భారత॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-14వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** కౌంతేయ=ఓ కుంతీపుత్రా!(అర్జున!), శీతోష్ణసుఖ దుఃఖదాః= శీతోష్ణములను సుఖదుఃఖములను కల్గించునవియైన, మాత్రాస్పర్శాః, తు= విషయేంద్రియ సంయోగము లయితే, ఆగమాపాయినః= ఉత్పత్తి వినాశ శీలములు(మఱియు), అనిత్యాః= అనిత్యములు, భారత= (కావున) భారతా! (అర్జునా!), తాన్= వాటిని (ఆ ద్వంద్వములను), తితిక్షస్వ= సహింపుము.

**భావం:** ఓ కౌంతేయా! విషయేంద్రియసంయోగమువలన శీతోష్ణములు సుఖదుఃఖములు కలుగుచున్నవి. ఉత్పత్తి వినాశశీలములు అనిత్యములు. కనుక అర్జునా! వాటిని సహింపుము. (పట్టించుకొనకుము)

---

## అనంతమహిముఁడవు - అనంతశక్తివి నీవు

అనంతమహిముఁడవు - అనంతశక్తివి నీవు
ఎనలేని దైవమా! ని - న్నేమని నుతింతును?

అన్ని లోకములు నీ - యందునున్న వందురు నీ
వున్నలోకమిట్టిదని - వూహించరాదు,
ఎన్ననీవు రక్షకుఁడ - విందరిపాలిటికి
నిన్ను రక్షించేటివారి - నే నెవ్వరి నందును.

తల్లివి దండ్రివి నీవు - తగు బ్రహ్మదులకు
ఎల్లగా నీ తల్లిదండ్రు - లెవ్వరందును,
ఇల్లిదె వరములు నీ - విత్తు విందరికిని
చెల్లఁబో నీ కొకదాత - చెప్పఁగ జోటేది.

జీవుల కేలికవు - శ్రీవేంకటేశుఁడవు నీ
వేవలఁ జూచిన నీకే - యేలికె లేఁడు,
వేవేలు మునులును - వెదకేరు నిన్నును
నీ వెవ్వరి వెదకేవు - నిర్మలమూరితివి.

(ఆధ్యాత్మిక సంకీర్తన 3-81)





*లోకములెల్ల పరబ్రహ్మమూర్తియైన శ్రీమన్నారాయణునియందే లీనమైయున్నవి. సర్వవ్యాపియైన ఆ పరమాత్మను ఒకచో నున్నవానినిగా చెప్పట తగదు. ఆయన ఎల్లవారిని రక్షించువాడు గాన ఆయనకు రక్షకు డింకొకడు లేడు. జననరహితుడైన ఆ దేవునకు జననీ జనకు లెవ్వరు? అను ప్రశ్నయే తగదు. ఆయన వరప్రదాతయేగాని వరములు స్వీకరించు వాడు గాడు. సర్వలోకపరిపాలకుడైన ఆ పరమాత్మునకు మరొక పరిపాలకు డెట్లుండగలడు? మునులు మున్నగువారు రక్కసులచే ఇక్కట్టులపాలైనప్పుడు లేదా మోక్షాపేక్షతో ఆయనను వెదుకుదురు. అవాప్తసమస్తకాముడైన ఆ దేవుడు మరొకరిని వెదకి వారినుండి పొంద వలసిన దేమియు లేదు. ఇట్లు ఏ విధముగ జూచినను శ్రీవేంకటేశ్వరుని ప్రభావాతిశయము మేరమీరి యున్నదని తాత్పర్యము.*

ఉపనిషద్వాక్యం

# త్వం త్రాతా తరణః

(నీవు రక్షకుడవు, దాటించువాడవు)

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

త్వం త్రాతా తరణో చేత్యో భూః
పిత్వా మాతా సదమిన్మానుషాణామ్॥ (ఋగ్వేదం)

***ఓ పరమేశ్వరా! నీవు రక్షకుడవు, దాటించువాడవు, జ్ఞేయమవు, ఉనికివి, ఎల్లవేళలా ఈ మనుష్యులకు తండ్రివి, తల్లివి.***

పరమేశ్వరునకు మనకీ ఉన్న బంధాన్ని ఈ మంత్రం ద్వారా వేదమాత తెలియజేస్తోంది. ఈ పరమేశ్వర తత్త్వాన్ని ఎవరు ఏ సంప్రదాయంలో కొలిచినా ఈ భావనను మనసులో ప్రతిష్ఠితం చేసుకుంటే చాలు.

**1) త్రాతా-** రక్షకుడు. 'ఆర్తత్రాణ పరాయణుడు'వంటి భక్తి భావనలకు ఆధారమైన వైదిక మంత్రప్రతిపాదనలలో ఇది ఒకటి. జీవులకు ఆర్తిలో స్ఫురించవలసిన మహిమాన్విత తత్త్వం భగవానుడే.

**2) తరణ-** దాటించువాడు. దీనికి భౌతికస్థాయిలో 'కష్టాల నుండి గట్టెక్కించుట' అని చెప్పుకోవచ్చు. కానీ అసలైన పారమార్థిక ప్రయోజనం 'అవిద్యారూప సంసారసముద్రము నుండి దాటించువాడు' అనే అర్థాన్ని స్వీకరించాలి. 'మోక్షయిష్యామి మా శుచః' వంటి గీతావాక్యాలు ఇక్కడ స్ఫురణకు వస్తాయి.

**3) చేత్య-** తెలుసుకోవలసినవాడు. విచారణ ద్వారా, ఉపాసన ద్వారా తెలియబడేవాడు. ఈయనను తెలుసుకొనుటే జీవితానికి పరమార్థం. భగవదనుభవమే 'తెలుసుకొనుట'. భక్తి దృష్టితో 'ఈశ్వర సాక్షాత్కారం', వేదాంత పరిభాషలో 'బ్రహ్మజ్ఞానం'. ఈశ్వర స్పృహ, అనుభవం ప్రధానమని తాత్పర్యం. 'మధువైరి దవిలిన మనము మనము పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి' అనే భాగవత ధర్మం ఇందులో ధ్వనిస్తోంది.

**4) భూః -** సదా ఉండువాడు. అందరికీ ఆధారమై, అన్నిటినీ కలిగించు అధిష్ఠాన రూప పరమాత్ముడితడు. 'సత్' అనే మాటకి ఇదే అర్థం.

**5) పితా, 6)మాతా-** తల్లి, తండ్రి. ఈ శబ్దాలు కారణత్వాన్ని సూచిస్తున్నాయి. సర్వకారణుడైన సర్వేశ్వరుడు తలిదండ్రుల వలె కారణమై, పోషకమై, రక్షకమై ఉన్నవాడు.


ఈ రెండు మాటలతో పరమాత్మకు మనమెంతటి దగ్గరి వారమో, ఆయనతో మనకుండవలసిన చనువు ఎంతటిదో అర్థమౌతుంది.

'మానుషాణామ్' అనే మాటకి 'ఆలోచన (జ్ఞానం) కలిగిన వారికి' అనే అర్థాన్ని స్వీకరించవచ్చు (మన అవబోధనే- అనే ధాతు అర్థాన్ని అనుసరించి). భారతీయ సంస్కృతిలోని భక్తి భావనకు వైదికమైన ఇటువంటి మంత్రాలే ఆలంబన. 'నీవే తల్లివి తండ్రివి', 'త్వమేవ మాతా చ – పితా త్వమేవ'- వంటి భాగవతుల వచనాలకు ఆలంబనమైన వైదిక సంప్రదాయమిది.

ఈ ఆరు బంధాలను భావన చేస్తుంటే- క్రమంగా 'ఆ పరమాత్మయే సమస్తము' అనే సిద్ధి లభిస్తుంది.

మనకు శాశ్వతబంధం భగవంతునితోనే ఉంది. మిగిలినవన్నీ కర్మబంధాలు, పరిమితాలు.

ఈ నిత్యబంధువుని విస్మరించని వాడే ధన్యుడు.





వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877-2264360
కార్యాలయం -0877-2264543
0877-2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన
సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.


24 గంటలూ పనిచేసే ఈ క్రింది
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి
తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని
మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333


తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 54    మార్చి, 2024    సంచిక : 10


## ఈ నెలలో....


**ప్రత్యేకవ్యాసాలు**

శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు- స్వామీజీల అనుగ్రహభాషణం - తీర్మానాలు — 27 పుట నుండి 39 పుట వరకు

| | | |
|---|---|---|
| మహాశివరాత్రి | శ్రీ భూమన కరుణాకరరెడ్డి, అధ్యక్షులు, తి.తి.దే పాలకమండలి | 07 |
| 'శ్రీమహాలక్ష్మి' మహోదయం | శ్రీమతి పసుపులేటి స్వరూప | 15 |
| తపోధ్యానస్థలి - 'తుంబురు తీర్థం' | ట్రెక్కింగ్ బాలు | 17 |
| కృష్ణం వందే జగద్గురుమ్ | డా॥ యస్.ఏ.టి.రాజ్యలక్ష్మీ | 20 |
| వైరాగ్యం | ఆచార్య ఎ. సచ్చిదానందమూర్తి | 40 |
| వైభవంగా శ్రీవారి తెప్పోత్సవాలు | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 41 |
| **ధారావాహికం** | | |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| సందేహాలు-సమాధానాలు | డా॥రేవూరు అనంతపద్మనాభరావు | 14 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 19 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 21 |
| 108 దివ్యదేశాలు- 'తేరకున్దూర్ (తిరువళున్దూర్)' | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 45 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ | 47 |
| **వేదవాఙ్మయం** | | |
| ఉపనిషద్వాక్యం- త్వం త్రాతా తరణః | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 04 |
| వేదంలో ఆహారవ్యవస్థ | డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు | 09 |
| **యోగ** | | |
| పతంజలి యోగసూత్రాలు | అనువాదకులు: డా॥ ఈశ్వర వరాహనరసింహము | 24 |
| **మనదేవాలయాలు** | | |
| 'తరిగొండ' లక్ష్మీనరసింహ నమో! నమో!! | డా॥ సంగీతం కేశవులు | 22 |
| **శ్రీవేంకటేశ్వరలీలలు** | | |
| కరుణాంతరంగుడు శ్రీవేంకటేశ్వరుడు | శ్రీమతి మాద్దుల మాధురి | 42 |
| **ఆయుర్వేదం** | | |
| ఆరోగ్య పరిరక్షణకు 'మునగ' | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |
| **బాలవికాసం** | | |
| జీవుడే దేవుడు (వేమనశతకం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 46 |
| రామ! జేరి చిరపట్టము గట్టుకొనందె (భాస్కరశతకం) | డా॥తిరుమల శ్రీనివాసాచార్య | 46 |
| కుబేరుని గర్వభంగం (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| బాలవినోదం | | 50 |
| వివేకమార్గంలో నడవాలి (నీతికథ) | ఉషశ్రీ | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : తిరుమల శ్రీవారి తెప్పోత్సవం
వెనుకచిత్రం : శ్రీగోవిందరాజస్వామివారి పట్టమహిషి శ్రీపుండరీకవల్లి



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# సమస్త జగత్తుకు ఆధారం శక్తియే!

**'న స్త్రీ రత్నం సమం రత్నం'**– అంటే స్త్రీతో సమానమైన ఆభరణం లేదు అని అర్థం. సమస్త జగత్తుకు ఆధారం శక్తి. ఆ శక్తే ఆదిపరాశక్తిగా వెలసింది. పరమేశ్వరుడు సైతం తన శరీరంలో సగభాగం ఇచ్చి అర్ధనారీశ్వరుడుగా అవతరించాడు. ఆడవారు 'అబల' కాదు 'సబల' అని ఎందరో మహిళా మూర్తులు నిరూపించారు. స్త్రీ అవనిలో సగం. స్త్రీ దేవుని యొక్క అత్యంత శక్తివంతమైన మరియు అందమైన సృష్టి. మన ఉనికి వెనుక స్త్రీ ఉంది. స్త్రీత్వం అనేది ప్రేమ, ఆప్యాయత, శ్రద్ధ, శక్తి మొదలైనవాటిని కలిగి ఉంటుంది. మన జీవితంలో కూడా ప్రతి స్త్రీ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. వాటిలో అంతిమమైంది 'తల్లి'.

ఆదిమ కాలం నుంచి ఆధునిక కాలం వరకు సామాజిక అభివృద్ధిలో మహిళలపాత్ర ఎంతో ఉంది. ***లోపాముద్ర, యమి, ఘోష, అవపాత*** మొదలగు ఋషీకలుగా పిలవబడ్డవారు వేదాలలో ఋక్కులకు భాష్యం వ్రాశారు. ***మైత్రేయి, గార్గి, వాచక్నవి*** మొదలగువారు వేదపండితులై చర్చలలో పాల్గొన్నారు. రామాయణంలో కైకేయి దశరథునికి యుద్ధంలో సహాయం చేసిందని తెలుస్తోంది. నరకాసురుని వధలో సత్యభామ పాత్ర కీలకం. ఆంధ్ర ప్రాంతాన్ని ఏలిన శాతవాహనుల కాలంలో గౌతమీపుత్ర శాతకర్ణి, వాసిష్టీపుత్ర పులోమావి వారి తల్లులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. కాకతీయ చరిత్రను ఇనుమడింపజేసిన రుద్రమదేవి శౌర్యానికి ప్రతీకగా నిలిచింది. సాహిత్యంలో పేరుగాంచిన రామాయాణాన్ని తెలుగులో వ్రాసిన మొల్ల, మధురావిజయం వ్రాసిన గంగాదేవి, సుభద్రా కల్యాణం వ్రాసిన తాళ్లపాక తిమ్మక్క, వేంకటాచలమాహాత్మ్యము వ్రాసిన తరిగొండ వెంగమాంబ మొదలగు మహిళా మణులు ఎందరో సాహిత్య జగత్తులో విరాజిల్లారు.

విద్య, స్వావలంబనలే మహిళా సాధికారతకు ఆధారాలు. ప్రతి మహిళా చదువుకుని విద్యావంతురాలైనప్పుడే ఇతరుల మీద ఆధారపడకుండా బ్రతుకగలుగుతుంది. అందుకే ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీ నాడు **అంతర్జాతీయ మహిళా దినోత్సవం** జరుపుకొంటున్నాం.

ఇక సకలసంపదలకు అధిదేవత అయిన శ్రీమహాలక్ష్మీదేవిని పూజిస్తే అష్టైశ్వర్యాలు కలుగుతాయి. నిత్యసత్యస్వరూపిణి అయిన ఆ తల్లి అనుగ్రహం వల్లనే మనం శాశ్వతమైన ఆనందాన్ని పొందగలం. ఆ జగన్మాత పుట్టినరోజు **'ఫాల్గుణ పూర్ణిమ'**. సర్వసాక్షియైన ఈ భగవద్దర్శనశక్తిని లక్ష్మిగా ఉపాసించటం లక్ష్మీ ఆరాధనలోని ప్రత్యేకత. అందరూ ఆనందాన్నీ, ఐశ్వర్యాన్నీ, జ్ఞానాన్ని, లక్ష్యంగా పెట్టుకొనే జీవిస్తారు.ఇలా అందరికీ లక్ష్యమైన జ్ఞాన, ఆనంద, ఐశ్వర్యాల సాకారరూపమే లక్ష్మి. ఆ మహాలక్ష్మిని కొలవడం మన అందరి కర్తవ్యం.

అదే విధంగా జ్ఞానమనేది బ్రహ్మస్వరూపం, ఏకరూపం, అఖండ జ్యోతిర్మయం, ఆద్యంత రహితం, త్రికాలాతీతం, అది స్థాణువువలె నిశ్చలం, నిరంజనం. కాలానికే సరైన కొలమానం లేదంటే కాలాతీత జ్ఞానపు ఆద్యంతాలు తెలుసుకోవాలనుకోవటం అర్థరహితం. లింగారూపాన్ని కొలవాలను కొన్న బ్రహ్మ, విష్ణువుల కథ ఈ విషయాన్నే తెలుపుతోంది. శివతత్త్వం కూడా మనకు తెలిపేది – మహాచైతన్యంలో భాగమే ఈ స్థూలసాంసారిక రూపం అని. పూర్ణకాముడైన మానవుడే పరమేశ్వరునకు ప్రీతిపాత్రుడు. ఇలా ఎన్నో అర్థాలు, ఎందరో దేవతల గురించి ఆలోచించేకొద్దీ చెప్పుకోవచ్చు. అసలు మహర్షుల హృదయం ఒక అగాథ క్షీరసముద్రం. అందులో భక్తికుసుమాలను వేసి, మథనం చేస్తే, చివరకు అమృతం పుట్టక తప్పదు. ఈ మాసంలో వచ్చే **'మహాశివరాత్రి'** పర్వదినాన ఆ ఆదిదంపతులను స్మరించుకొని తరిద్దాం!

**లోకాః సమస్తాస్సుఖినో భవంతు.**

**మార్చి 08**
**మహాశివరాత్రి**
**సందర్భంగా ప్రత్యేకరచన**



# మహా శివరాత్రి




- శ్రీ భూమన కరుణాకర రెడ్డి
అధ్యక్షులు,
తి.తి.దే. పాలకమండలి


తిరుపతి ఒక మహాక్షేత్రావతంసం. అగణిత మహిమలకు నిలయం. పాపారణ్యాలకు గొడ్డలిపెట్టు. ఈ తిరుపతిని కలియుగవైకుంఠంగా పురాణాలు కీర్తిస్తున్నాయి. ఆధునిక కాలంలో తిరుమల అన్న పేరు కొండపైభాగానికి, తిరుపతి అన్న పేరు కిందనున్న తిరుపతి నగరానికి ప్రసిద్ధిగా వచ్చింది. కానీ పూర్వం ఎగువ, దిగువ ప్రాంతాలను తిరుపతి క్షేత్రంగానే సంప్రదాయజ్ఞులు భావించేవారు.

ఈ తిరుపతి క్షేత్రం హరిహరాభేదాన్ని కలిగినది. కొండ దిగువప్రాంతంలోని కపిలతీర్థ సరోవరతీరం– కామాక్షీ సమేతుడైన కపిలేశ్వరుని దివ్యసన్నిధి. ఇది కొండకు మొదటితావు. అందుకే శ్రీవేంకటేశ్వర సహస్రనామాల్లో "ఉపత్యకా ప్రదేశస్థ శంకర ధ్యాత మూర్తయే నమః" (దిగువ కొండచరియలలో ఉన్న శివుణ్ణి ధ్యానించిన ఘనుడు) అన్న నామం ఒకటై విరాజిల్లుతోంది. ఈ సందర్భంలో స్మరించవలసిన అంశం, వేంకటాచలమాహాత్మ్యంలో శ్రీనివాసుడు వకుళమాలికను ఆకాశరాజు వద్దకు కల్యాణానికై పెళ్లి పెద్దగా పంపించడం. ఆ సమయంలో శ్రీనివాసుడు వకుళమాలికతో– బాలుడైన శ్రీనివాసుడు కామాక్షీ వరదుని ఆశీస్సులు కోరుతున్నాడని చెప్పమన్నాడు. వకుళమాత శ్రీనివాసుని ఆజ్ఞాపాటించి, తరువాత ఆకాశరాజు కొలువై ఉండే నారాయణ వనానికి వెళ్ళి శ్రీనివాసకల్యాణానికి శ్రీకారం చుట్టింది. శివుడు జ్ఞానప్రదాత, శ్రీహరి మోక్షప్రదాత. మోక్షాన్ని పొందటానికి జ్ఞానమేకదా వెనుబలం.

సర్వసాధారణంగా శివాలయాల్లో విష్ణువు, విష్ణ్వాలయాల్లో శివుడు క్షేత్ర పాలకుడిగా ఉండడం తెలిసిన అంశమే. తిరుమల శ్రీవైష్ణవాలయం. క్షేత్రపాలకుడు రుద్రుడు. తిరుమలలో మహాశివరాత్రిని క్షేత్రపాలకోత్సవం అని కీర్తిస్తారు. క్షేత్రపాలకుడైన రుద్రుడు ప్రస్తుతం శ్రీవారి ఆలయానికి ఆగ్నేయమూలలో రెండుకిలోమీటర్లదూరంలో ఉన్న గోగర్భతీర్థతీరంలో విరాజిల్లుతున్నాడు. ప్రతి మహాశివరాత్రినాడు ఆ క్షేత్రపాలక దైవానికి నమకచమకాలతో అభిషేకాదులు నిర్వహించడం అనూచాన సంప్రదాయం.

ఆసేతుశీతనగం మాఘబహుళ చతుర్దశి నాటి అర్ధరాత్రి కాలాన్ని 'మహాశివరాత్రి' పర్వంగా కీర్తిస్తారు. లింగమహాపురాణంలో మహాశివరాత్రివ్రతం చెప్పబడింది, స్కాంద పురాణాంతర్గత బ్రహ్మోత్తరఖండంలో లింగ కారణంలో శివరాత్రి మహిమను తెలిపే గొప్ప కథ ఉంది. దీన్ని శివరాత్రివ్రతాన్ని ఆచరించే భక్తులు, భక్తిశ్రద్ధలతో శ్రవణం చేస్తారు. శివలింగం సాకారనిరాకార పూజావిధులకు సమన్వయ స్వరూపం. శివరాత్రినాడు శివలింగ ఆరాధనే ప్రధానం. అనాదిగా ఉపవాసం, జాగరణ



వీటితో పాటు రాత్రివేళ నాలుగుయామాల్లో శివుణ్ణి అభిషేకించి పూజించడంద్వారా పాపాలు పరిహారమౌతాయి.

శివుడు సృష్టికిమూలం. మాఘబహుళ చతుర్దశినాటి అర్ధరాత్రికాలంలో బ్రహ్మవిష్ణువుల కలహానికి స్వస్తిపలికేందుకు శివుడు అగ్నిలింగరూపంలో తొలిసారిగా ఆవిర్భవించాడు. కనుక ఆరోజును మహాశివరాత్రిగా భావిస్తున్నారు. అయితే ఈ శివరాత్రులు ఐదురకాలుగా పురాణజ్ఞులు వర్గీకరించారు.

**1)నిత్యశివరాత్రి:** ప్రతినిత్యం శివారాధనకై సంకల్పించడం, పూజించడం, రాత్రి శివస్మరణతో నిద్రించడం.

**2)పక్షశివరాత్రి:** ప్రతిశుక్ల, కృష్ణపక్షాల్లో వచ్చే చతుర్దశి రాత్రివేళ శివారాధనకై సంకల్పించడం, పూజించడం, రాత్రి శివస్మరణతో నిద్రించడం.

**3)మాసశివరాత్రి:** ప్రతిమాసంలో కృష్ణపక్షాల్లో వచ్చే చతుర్దశి రాత్రివేళ శివారాధనకై సంకల్పించడం, పూజించడం, రాత్రి శివస్మరణతో నిద్రించడం.

**4)మహాశివరాత్రి:** మాఘమాస బహుళచతుర్దశినాడు పురాణాలు చెప్పినట్లు శివపూజావిధిని నిర్వర్తించడం.


**5)యోగశివరాత్రి:** జ్ఞాని తన చిత్తవృత్తిని పరమశివునిపై నిలిపి, లౌకికమైన ప్రపంచాన్ని విస్మరించి జీవించడం.


ఇలా శివరాత్రులతో వారివారి శివభక్తి స్థాయికొద్దీ, మానవజీవితాన్ని పండించుకోవాలని మహర్షులు ఉపదేశిస్తున్నారు. ఈ ఐదు శివరాత్రులలో **మహాశివరాత్రి**ని భారతీయులందరు వివిధమార్గాల్లో శివ ఆరాధనలు చేసి తరిస్తున్నారు.

శివునికి ప్రీతికరమైన వస్తువులుగా రుద్రాక్షలను, భస్మాన్ని మరియు పంచబిల్వాలలో ఒకటైన (తులసి, మారేడు, వావిలి, ఉత్తరేణు, వెలగ) మారేడుదళాలను పరిగణిస్తున్నారు. మారేడు స్పర్శ, వాసన చాలా ఆరోగ్యప్రదం. పైగా మారేడురసం, కషాయాలు ఉష్ణాన్ని, పైత్యాన్ని, ఉబ్బసాన్ని, మధుమేహాన్ని, రక్తపోటును ఉపశమింపజేసే ఓషధీగుణాలసారంగా పెద్దలు చెబుతున్నారు.

పురాణాలు శివపూజామహిమను విస్తారంగా ప్రబోధిస్తున్నాయి. పైగా జీవితంలో ఒక్కసారైనా మానవజన్మను ఇచ్చినందుకు కృతజ్ఞతగా శివరాత్రివ్రతాన్ని ఆచరించాలని ప్రబోధించే నానుడే– "జన్మానికో శివరాత్రి".

ఈ శివరాత్రిరోజున ద్వాదశజ్యోతిర్లింగక్షేత్రాలను సేవించడం లేదా కాశీ, శ్రీశైలం, శ్రీకాళహస్తి వంటి ఏదో ఒక మహాక్షేత్రాన్ని సేవించడం కూడా చిరంతర భారతీయ సంప్రదాయం. మన అఖండభారతావనిలో వివిధ ఆచారాలు, వస్త్రధారణలు, మంత్రోచ్చారణలతో జీవిస్తున్నా, ఇలాంటి మహాపర్వాలు భారతీయులలో ఒక ఏకాత్మతను తీసుకువస్తున్నాయి. శివరాత్రి అనంత కాలప్రవాహంలో ఒక మహాపర్వంగా ఆదరించబడుతోంది. ఇటువంటి మహాశివరాత్రినాడు మన పూర్వీకులు ఆచరించిన శివారాధన సంప్రదాయాన్ని కొనసాగిద్దాం, తరిద్దాం.






# వేదంలో ఆహారవ్యవస్థ

– డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు, 9885003420

లోకంలో సకలప్రాణులకు చాలా ఆవశ్యకమైనది ఆహారం. మానవులకు, మృగాలకు, క్రిమికీటకాదులకు, వృక్షాదులకు అన్నిప్రాణులకు కావలసినది అపేక్షించేది, ఆహారమే. ఇటువంటి ఆహారాన్ని భగవంతుడే సృష్టించాడు. ఆయా ఆహారాలను ఆయాప్రాణులు భుజించే క్రమాన్ని కూడా భగవంతుడే వాటికి సహజంగానే ఏర్పాటు చేసి తెలియజేశాడు. అప్పుడేపుట్టిన బిడ్డకు తల్లిదగ్గర పాలుతాగాలని నేర్పినది ఎవరు? భగవంతుడేకదా!

కానీ, మానవులకు, మిగిలినప్రాణులకు ఒక తేడా ఉన్నది. అంటే, "ఈ కాలంలో ఆహారాన్ని స్వీకరించాలి, ఇన్ని మార్లు స్వీకరించాలి, ఈ విధంగానే స్వీకరించాలి, ఇటువంటి నియమాలకు లోబడి స్వీకరించాలి" అనే ఒక వ్యవస్థ నిర్దిష్టంగా మానవులకు ఉన్నట్లు, మిగిలిన ప్రాణులకు లేదు. ఈ విషయాన్ని గురించి ఒక ఉపాఖ్యానం వేదంలో ఉన్నది–

బ్రహ్మజగత్తును సృష్టించడం ఆరంభించి, ఒక్కొక్క జీవరాశిని సృష్టించడం ఆరంభించాడు. అప్పుడు ఆ జీవులు బ్రహ్మ దగ్గరకువెళ్లి మాకు ఏమిఆహారం? అనిఅడిగాయి. ప్రతి ప్రాణి జన్మించగానే తనకు కావలసిన ఆహారాన్ని అన్వేషిస్తుంది కదా! ఆ క్రమంలో దేవతలు బ్రహ్మ దగ్గరకుపోయి "మాకు ఏది ఆహారం? అది ఎప్పుడు లభిస్తుంది? మాకు ఏది ప్రకాశం? బలం ఏది?" అని అడిగారు. ఈ విధంగా వారు అడిగేటప్పుడు కూర్చొని, వినయంగా, యజ్ఞోప వీతాన్ని ఉపవీతి క్రమంలో ధరించి, తమ కుడిచెవిని ముట్టుకొని ప్రశ్నించారు. అప్పుడు బ్రహ్మ "మీకు ఆహారం యాగంలో లభిస్తుంది. యాగంలో హోమంచేయబడే హవిస్సే మీకు ఆహారం. అయితే, మీకు మీ ఆహారం మాసానికి రెండుసార్లు మాత్రమే లభిస్తుంది. పౌర్ణమి, అమావాస్య కాలాలలో మరునాడు మాత్రమే మీకు ఆహారం లభిస్తుంది. మీకు ప్రకాశ కుడుగా సూర్యుడు ఉంటాడు. మీకు బలాన్ని కలిగించేదిగా అమృతం లభిస్తుంది" అని బ్రహ్మ సమాధానం ఇచ్చాడు. ఆ మాట విని దేవతలు వెళ్లిపోయారు.

తరువాత పితృదేవతలు బ్రహ్మదగ్గరకు వచ్చి ఆ విధం గానే తమకు ఏది ఆహారం? అని అడిగారు. ఆవిధంగా అడిగేటప్పుడు వారు కూర్చుని ప్రాచీనావీతిక్రమంలో యజ్ఞోప వీతాన్ని ధరించి, ఎడమచెవిని ముట్టుకొని ప్రశ్నించారు. "మీకు ఆహారం తర్పణం ద్వారా లభిస్తుంది. మీకు మీ సంతతికి చెందిన వారు నువ్వులతో, జలంతో, పిండాలతో తర్పణం చేస్తారు. అవి మీకు ఆహారం కాగలదు. అయితే, మీకు ఆహారం నెలకు ఒకసారి మాత్రమే లభిస్తుంది. అదికూడా అమావాస్య నాడు మాత్రమే లభిస్తుంది. మీకు చంద్రుడు ప్రకాశాన్ని కలిగిస్తాడు. మీకు బలం స్వధాద్వారా లభిస్తుంది" అని బ్రహ్మ చెప్పాడు. అప్పుడు పితృదేవతలు తృప్తిపడి వెళ్లిపోయారు.

ఆ విధంగానే, తరువాత మానవులు వచ్చి బ్రహ్మను తమకు ఏది ఆహారం? ఎప్పుడు లభిస్తుంది? తమకు ఏది బలం? ఏది ప్రకాశం? అని అడిగారు. వారు అడిగేటప్పుడు కూర్చొని మాత్రం అడిగారు. దేవతలవలె వినయంగా కుడి చెవిని కానీ, పితృదేవతల వలె ఎడమచెవిని కానీ ముట్టు

**తిరుమల పుణ్యక్షేత్రంలో స్వయంవ్యక్తమై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామివారికి అనాదిగా వైఖానసాగమం ప్రకారం పూజా నివేదనలు జరుగుతాయి. అలాగే, తిరుమల పుణ్యక్షేత్రంలో కూడ శ్రీవేంకటేశ్వర స్వామివారు ధ్రువమూర్తిగా, కౌతుకమూర్తి, స్నపనమూర్తిగా, కొలువు మూర్తిగా, ఉత్సవమూర్తిగా ఇలా ఐదు రూపాల్లో వేంచేసి భక్తుల మొక్కులందుకుంటున్నాడు. ఇష్టార్థ ప్రదాతయై వరలినాడు.**

కొని అడగలేదు. అప్పుడు బ్రహ్మ వారితో "మీకు ఆహారం భూమివల్ల లభిస్తుంది. భూమిలో ఫలించే అనేక విధాలైన పంటలద్వారా మీకు ఆహారం దొరుకుతుంది. మీకు ప్రతిదినం ఉదయం, సాయంకాలం రెండుసార్లు ఆహారం లభిస్తుంది. మీకు అగ్ని సహాయకుడుగా, ప్రకాశాన్ని కలిగించేవాడుగా ఉంటాడు. మీకు మీ శరీరంవల్లనే బలం లభిస్తుంది. మీరు దానివల్ల సంతానాన్ని పొందుతారు" అని బ్రహ్మ చెప్పాడు.

అయితే, ఈ కథ ఇంతటితో ముగిసిపోలేదు. తర్వాత, మృగాలు బ్రహ్మదగ్గరకు వచ్చాయి. వాటికి దేవతలు మొదలైన వారు అడిగినట్లుగా కూర్చొని, నియమంతో నోరు తెరిచి అడిగే సామర్థ్యం లేదు. అందుచేత వాటిని చూడగానే బ్రహ్మకు జాలి కలిగింది. " ఇవి నాదగ్గరకు వచ్చి నిలుచున్నాయి. అంటే, తమకు ఏదిఆహారం? అని అడగడం కోసమే కదా వచ్చాయి" అని బ్రహ్మ భావించాడు. అప్పుడు బ్రహ్మ వాటి చూచి "మీరు బాధపడకండి. మీకు ఆహారం పుష్కలంగా లభిస్తుంది. మీరు ఎప్పుడైనా, మీరు కోరినప్పుడు ఆహారాన్ని భుజించవచ్చు. మీకు ఏవిధమైన నియమాలులేవు. ఎప్పుడు మీకు ఆహారం లభిస్తుందో, అప్పుడు అంతా మీరు భుజించవచ్చు. దినానికి రెండుసార్లు అని కానీ, ఉదయం, రాత్రి అని కానీ, ఏ విధమైన నియమాలు లేవు" అని చెప్పి వాటిని పంపించివేశాడు.

ఆ తరువాత అసురులు బ్రహ్మ దగ్గరకు తమకు ఏదిఆహారం? అని ప్రశ్నించడం కోసం వచ్చారు. అయితే వారు ఒకచోట నిలవకుండా పరిగెత్తుతూనే అవినయంగా ప్రశ్నించారు. అప్పుడు బ్రహ్మ వారిని చూచి, "మీరు ఒకచోట నిలవకుండా పరిగెత్తుతూనే అడుగుతున్నారే! అందుచేత, మీరు రాత్రివేళ ఈ విధంగానే పరిగెత్తుతూనే ఆహారాన్ని భుజించండి. మీకు రాత్రివేళ బలం అధికంగా ఉంటుంది" అని చెప్పి వారిని పంపించి వేశాడు.

ఈ విధంగా బ్రహ్మ సృష్టికాలంలో ఆయాప్రాణులకు తగిన ఆహారాన్ని, వారు దానిని స్వీకరించే క్రమాన్ని ఏర్పాటు చేశాడు. ఇక్కడ మనం గమనించవలసిన ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే, ఈ వ్యవస్థ అందరిలో ఈనాటికీ కొనసాగుతూ ఉన్నది. ఈ క్రమాన్ని ఎవరూ అతిక్రమించలేదు. దేవతలు కాని, పితృదేవతలుకానీ, ఎవరరూ నియమాన్ని దాట లేదు. మానవులు ఒక్కరు మాత్రమే ఈ కాలంలో అతిక్రమించి వర్తిస్తున్నారు. ఆనాడు సృష్టికాలంలో బ్రహ్మ ఏర్పరచిన క్రమాన్ని మార్చి, వేరేవిధంగా, తమకు ఇష్టంవచ్చిన రీతిలో ఆహారాన్ని స్వీకరిస్తున్నారు. ప్రతిదినం రెండుసార్లు మాత్రమే భుజించాలి?అనే క్రమాన్ని మీరి స్వీకరిస్తున్నారు. ***"సాయం ప్రాతః ద్విజాతీనామశనం శ్రుతి చోదితమ్"*** అని ఉన్నది. దేవతలకు పూర్వాహ్నంలో, పితృదేవతలకు అపరాహ్నంలో ఆహారం అనేక్రమాన్ని కూడా బ్రహ్మ ఏర్పరిచాడు. మానవులకు మధ్యాహ్నసమయంలో, రాత్రివేళ అనే క్రమాన్ని ఏర్పాటుచేశాడు. దీనిని మనం మీరి, ఈనాడు మనకు తోచిన సమయంలో ఇష్టంగా భుజిస్తున్నాము. రెండుసార్లు అనే నియమాన్ని కూడా దాటి మూడుమార్లు, నాలుగుమార్లు కూడా ఆహారాన్ని స్వీకరిస్తున్నాము. ఆ విధంగా కాకుండా ఆహారాన్ని మితంగా, చెప్పబడిన సమయంలో భుజించడం అనేది ఒక తపస్సు. మితాహారం ఒకతపస్సు అని కదా! శాస్త్రాలు చెబుతున్నాయి.

ఆహారం ఈ విధంగా నియతంగా, రెండుమార్లు భుజించిన వానికి ఆరోగ్యం సిద్ధిస్తుంది, మానసికమైన స్థితి కూడా బాగుంటుంది. అతనిమాట, స్వభావం సాత్వికంగా ఉంటుంది. లోకంలో కూడా "ప్రతిదినం ఒకసారిమాత్రం భుజించేవాడు యోగి, రెండుసార్లు భుజించేవాడు భోగి, మూడు మార్లు భుజించేవాడు రోగి, అంతకుమించి, నాలుగుసార్లు, ఐదుసార్లు భుజించేవాడు ద్రోహి, అంటే, ఇంకొకరు భుజించవలసిన ఆహారాన్ని తానే స్వీకరిస్తున్నాడు కనుక ద్రోహి" అనే సూక్తి ఉన్నదికదా!

ఈ విధంగా వేదంలో విధింపబడిన ఆహారవ్యవస్థను మనం అనుసరించి, ఆహారాన్ని స్వీకరించి, మన ఆరోగ్యాన్ని కాపాడుకుందాం. మనలను, సమాజాన్ని ఆరోగ్యవంతంగా చేసికొందాం.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



## గత సంచిక విశేషార్థం..

"పౌరాణికమణీ! సర్వలోకాలకు సంబంధించిన అనేకాంశాలను మాకు విశదం చేయగల సమర్థులు మీరు అయినా విష్ణు కథలను వినాలని మేము కుతూహలపడుతున్నాం. దయతో తెలపండి." అంటూ శౌనకాది మునులు సూతుని ప్రశ్నించారు.

'మునివర్యా! అంతేకాదు మహావిష్ణువు తనకు నచ్చిన ప్రదేశాలలో ఉంటూ శ్రేష్ఠులయిన పరమభక్తులకు మాత్రం కనిపిస్తూ సామాన్యులకు అగోచరుడుగా ఉంటాడని సెలవిచ్చారు.

తపోనిధీ! అంజనాద్రిలాగా, నీలగిరిలాగా దర్శనీయుడయిన స్వామి వైకుంఠం వదలి కొండమీద తిరంగా నిలబడడానికి కారణాలేమిటి? చెప్పరా?' అని మరీ మరీ అడిగారు. అపుడా తాపసముని 'అలాగే! వ్యాసముని నాకు ఒకసారి చెప్పిన కథను మీకు చెబుతాను వినండి-

సనకసనందనాదులు వైకుంఠద్వారపాలకులైన జయ విజయులను శపించారు. ఆ శాపం కారణంగా దితి గర్భంలో జయవిజయులు హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా జన్మించారు. రాక్షససంవృత్తితో హిరణ్యాక్షుడు సాధువులను పీడిస్తుంటే, హరి వరాహరూపంలో హిరణ్యలోచనుని సంహరించాడు. అన్న హిరణ్యాక్షుడు సంహరింపబడడంతో, కోపోద్రేకంతో హిరణ్యకశిపుడు విజృంభించాడు. అతని ఆగడాలకు హద్దే లేకపోయింది. ఆ కారణంగా హరి విలక్షణమయిన నృసింహావతారమెత్తి హిరణ్యకశిపుని చంపి ప్రహ్లాదుని రక్షించాడు. శాపగ్రస్తులయిన జయవిజయులు రెండవజన్మలో వారే కుంభకర్ణ రావణులుగా జన్మించారు. వారు లోకాలను చిందరవందర చేశారు. శిష్టులను వేధించారు. ఈ వేదనలను భరించలేక చివరకు దేవాంద్రాదులతో తమ బాధను హరికి విన్నవిద్దామని కలిసికట్టుగా సాధుపుంగవులు కదిలారు. క్షీరసముద్రానికి ఉత్తరభాగంలో నిలబడి వేదమంత్రాదులతో స్వామిని వినుతించారు.

"దేశరక్షకా! రావణుడనే పేరుగల దానవుడు సాధువులను హింసిస్తున్నాడు. ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. రావణసంహారం జరిగితేకాని మాకు, లోకానికి విముక్తిలేదని" దైన్యంగా వేడుకున్నారు. అయినా ఏ ప్రత్యుత్తరం లేదు. దిక్కుతోచని మునులు ఆక్రోశిస్తుంటే అపుడు విష్ణోహం అంటూ ఒక 'విష్ణుదూత' ఆకాశంలో ప్రత్యక్షమై-

'విష్ణుభక్తులార! మీరు ఏ దేవుని ప్రార్థిస్తున్నారో ఆ విష్ణువు ప్రస్తుతం క్షీరసముద్రంలో లేదు. ఇక్కడ గడబిడ చేయకండి. స్వామి భూలోకంలో కొండమీదున్నాడు. మీరందరూ అక్కడికి వెళ్ళండి' అని ఆదేశించి మాయమయ్యాడు.

విష్ణుదూత ప్రత్యక్షం కావడం, ఆదేశించడంలాంటి వాటికి దేవేంద్రాదులు ఆశ్చర్యపడ్డారు. వెంటనే వారందరు భూలోకానికి కదిలారు. గిరులలో ఉన్నాడనే దేవదూత ఆదేశాలమేరకు గిరులన్నిటా అన్వేషించారు. చివరకు స్వామి బహుశః వైకుంఠంలో ఉన్నాడేమో అని తర్కించుకొని అటుకేసి వెళుతుంటే మార్గమధ్యాన దేవర్షి నారదుడు కనబడ్డాడు. దేవతలు ఎంతో సంతోషంతో 'స్వామి' ఎక్కడున్నాడో తెలుసుకొందామని నారదునికి సాగిలబడ్డారు.

'నారదా! ముల్లోకాలు సంచారం చేయగల సమర్థుడు. దేవాదిదేవతల మర్మాలు తెలిసినవాడివి. అంతేకాదు, నీవు మహాత్ముడివి. మేమందరం విష్ణుదూత సందేశంతో భూలోక మంతా గాలించినా స్వామి కనబడలేదు. వైకుంఠంలో ఉన్నాడేమోనని మేము అటుకేసి వెళుతుంటే మాకు తమ దర్శనమయింది' అన్నారు. ఆ మాటలు విన్న నారదుడు-

"దేవేంద్రా! నేను వైకుంఠంలో స్వామి దర్శనానికి వెళితే నాకూ నిరాశే ఎదురైంది. అక్కడి ప్రముఖుడు భూలోకంలో స్వామి లక్ష్మీ సమేతుడయి ఒక దుర్గ ప్రదేశాన ఉన్నాడన్నారు. అయినా మీరు భూలోకంలో వనదుర్గాలను అన్వేషించామని చెప్పారు కదా! మీరు గాభరాపడకండి. మరల ఆ సీమలకు వెళ్ళనవసరం లేదు. మన మందరం సరాసరి బ్రహ్మదేవుని దగ్గరికే వెళదాం" అంటూ వారితో కలిసి సత్యలోకం చేరుకొన్నారు.

ఇంద్రాదులు సత్యలోకానికి వెళ్లడం, సత్యలోకంలో నాలుగుమోముల వానిని దర్శించి దేవతలు చేతులు జోడించారు. వారి వాలకాన్ని గుర్తించి సత్యలోకపాలకుడు "ఎక్కడికి బయలుదేరారు. అందరూ కలిసి వచ్చారేమిటి? ముందు మీరు సేదదీరండి." అంటే వారు అలాగే ఆసీనులయ్యారు.

'దేవతలారా! మీరందరు కుశలమేకదా!' అని కుశల ప్రశ్నలు వేయగా, దేవతలు–

"స్వామి! అంతా కుశలమే. మీలాంటి వారికి మా పట్ల ఉన్న కారుణ్యం కారణంగా అందరూ క్షేమమే. అయినా ఒక చిన్న విన్నపం. సర్వలోకాలలోనూ సంక్షోభం ఏమాత్రం లేకున్నా భూతలంలో మాత్రం ఎన్నో వింతలు, విశేషాలు సంకటాలు. హాహాకారాలు....

రావణ ప్రేరితులయిన రాక్షసులు లంకను వదలి శ్రీశైలప్రాంతానికి వచ్చి మమ్మల్ని, భూలోకవాసుల్ని ఎంతో బాధ పెడుతున్నారు. కనబడితే చాలు మనుషుల్ని మ్రింగేస్తున్నారు. చేయరాని ఘోరాలు చేస్తున్నారు. తామే అధికులమనే గర్వంతో, మదంతో మునులను నిరంతరం బాధిస్తున్నారు. ఇవన్నీ తెలిసినా రావణునిలో ఉలుకూ పలుకూ లేదు. అన్నిటికి అతడే కర్త. అతడే శాసకుడు. అతడే నియంత. రావణవినాశనం జరిగితే గాని భూలోకవాసులకు శుభం కలగదు. స్వామి! మరో మాట.

మేము తాపసులం. శాంతస్వభావులం. రావణనికి శాపం పెట్టగలిగేంత వారం కాము. అతనికి తగిన శిక్ష విధించడానికి శ్రీపతి ఒకడే సమర్థుడు.

ఆ స్వామి దర్శనం కోసం తిరిగి తిరిగి ఆశాభంగులమయ్యాం. చివరకు మీరైనా స్వామి ఆచూకి చెబుతారని కొండంత ఆశతో ఇక్కడికి వచ్చాం. స్వామి ఉనికి మీకే ఎరుక. మీరు దయతో స్వామి ఎక్కడున్నాడో చెప్పండి. మా తపస్సుకు ఆటంకాలు కల్పిస్తూ, మమ్మల్ని కవ్విస్తున్న ఆ దుర్మార్గుణ్ణి సంహరించగల శక్తియుక్తులు ఆ స్వామికే తెలుసు. అందుకే ఈ మా అన్వేషణ" అంటూ సాగిలబడ్డారు.

"మునులారా! నా మాట వినండి. మీరు ప్రస్తావించిన రావణుడు బలవంతుడు. వరగర్వితుడు. అతణ్ణి సామాన్యులు సంహరించలేరు. 'కాలం తీరాక' ఆ దనుజేంద్రుని ఒక సామాన్య నరరూపధారి సంహరిస్తాడు. అతని తలలన్నీ తప్పక తెగుతాయి. అయినా హరికోసమే కదా మీ అన్వేషణ. అందుకు మీకు ఒక ఉపాయం చెబుతాను.

శ్రీహరి వేంకటాద్రిలో ఉన్నాడు. ఆ స్వామి ఒక్కడే శరణాగత రక్షకుడు. మీ ఆర్తిని తీర్చగల ఆర్తత్రాణ పరాయణుడు. ఆ స్వామి రావణసంహారార్థం మానవరూపధారి అవుతాడు. ఆ లోకకంటకుణ్ణి సంహరిస్తాడు. ఇది ముమ్మాటికి సత్యం. నేనూ మీతో వేంకటాద్రికి వస్తాను. ప్రస్తుత కర్తవ్యం. వినండి–

ముందు శ్రీ నగానికి వెళదాం. దక్షణపుదిక్కులోని పర్వాతాల వైపుగా పయనం కొనసాగిద్దాం. పద్మాక్షుడున్న కొండలలో అన్వేషిద్దాం. ఆ స్వామి ఆచూకి తెలుసుకొని, ఆ పై వేడుకొందాం. ఇంతకంటే మరో మార్గం లేనే లేదు.

మరొక్క విషయం– స్వామి దర్శనం అంత తేలిక కాదు. ఆ స్వామి మాయావి. శ్రీదేవితో దట్టమయిన అడవుల్లో, గుహల్లో, ఖడ్గమృగాదులు సంచరించే భయంకర కానన సీమల్లో విహరిస్తుంటాడు. అయినా ఈ సందర్భంలో మీకు తెలియనిదీ భవిష్యత్తులో జరగబోయే ఒక చిన్న వృత్తాంతం మీకు చెబుతానన్నాడు." అనగానే దేవతలు చెవులు రిక్క బొడుచుకొని వినసాగారు.

"మునులార! మీకు ఒక విశేషవార్త చెబుతానని అన్నాను. ఆ వార్త దశరథుడు సంతానంకోసం స్వామి పుష్కరిణి తీరంలో తపస్సు కొనసాగిస్తాడనేదే. ఆ సందర్భంలో హరి తప్పక ప్రత్యక్షమవుతాడు.

అంచేత అందాక మనమందరం ఆ పర్వతవాసులమై ఆ శుభ సమయం కోసం వేచి ఉందాం. ఆ హరి దశరథునికి ప్రత్యక్షమయ్యే వేళ మనమూ స్వామిని ప్రార్థిద్దాం" అన్నాడు.

బ్రహ్మ వేంకటాద్రికి ఉత్తరభాగంలో హరిని వెదుక్కొంటూ చివరకు వేంకట్రాది చేరాడు. దేవతలు కూడా బ్రహ్మను అనుసరించారు. స్వామి అనుగ్రహార్థం వారు తపశ్చర్యలో లీనమయ్యారు.

## దశరథుడు వేంకటాద్రికి రావడం

అయోధ్యాపతి అయిన దశరథుడు తనకు అన్ని సంపదలున్నా, సంతాన సంపదలేనందుకు బాధపడుతూ కుల గురువైన వశిష్ఠునితో ఒకనాడు తన బాధను వెళ్ళగక్కాడు. అపుడు కులగురువు–

'రాజా! నీ ఆవేదనను అర్థం చేసుకోగలిగాను. నీవు పుణ్యుడివే. కాని 'కలుషకర్మ' వల్ల నీకు సంతానప్రాప్తి కలుగ లేదు. ఈ కలుషకర్మ నివారణార్థం వేంకటాద్రిలోని పుష్కరిణి తీరంలో తపం చేయడమొక్కటే ఏకైక మార్గం. అయినా సందేహ మెందుకు? నీకు వంశోద్ధారలకులయిన కొడుకులు తప్పక పుడ తారు. ఆలస్యం అమృతం విషమ్. శుభం భవతు.' ఇప్పుడే వేంకటగిరికి పయనం కట్టమన్నాడు. దశరథుడు సంతోషంతో 'గురువర్యా! నిర్దేశించిన నా పయనానికి శుభలగ్నం కూడ నిర్ణ యించండి' అని వేడుకున్నాడు. గురువు సరే అంటూ–

'మహారాజా! ఈ రోజే సుదినం కావడం, ఈ వేళనే పయనం మంచిది. నీ పయనమార్గం మరోసారి చెబుతాను. విను–

గంగానదికి దక్షిణంలో సువర్ణముఖీనది. ఆ నదికి ఉత్తరంలో ఒక క్రోశమాత్ర దూరంలో, గంగకు దక్షిణాన రెండు వందల యోజన దూరంలో వేంకటగిరి. ఆ గిరిలోనే గంగాది నదులకంటె పుణ్యవంతమయిన తీర్థాలున్నాయి. ఆ తీర్థాలలో సర్వశ్రేష్ఠం 'స్వామిపుష్కరిణీ' తీర్థం.

అక్కడే వేంకటాద్రి. మేరుపర్వతంలా ఎత్తయినది. అలం కృతమైన రథంలా దర్శనీయం. అంతేకాదు చైత్రరథంలా కనులకు విందు చేసే పర్వతం. అక్కడ కిన్నరాదులు నృత్యగీతా లతో కాలక్షేపం చేస్తుంటారు. అయితే కొందరికి అది పాషణ పర్వతంగా కనిపించవచ్చు. అయినా ఆ పర్వతం వర్ణనాతీతం." అని చెప్పగానే దశరథుడు గురువుతో గంగానది చేరుకున్నాడు.

సంకల్పపూర్వకంగా దశరథుడు గంగాస్నానం చేశాడు. నదీ తీరాన జపతపాదులు కొనసాగించాడు. షోడశ మహా దానాలు చేశాడు. ఆపై ఆ ప్రాంతం నుండి కదలి గోదావరి, కృష్ణవేణి, మలాపహరి, తుంగభద్రాది నదులలో మునకలు వేస్తూ, చివరకు వేంకటాద్రి చేరుకున్నాడు. స్వామిపుష్కరిణీ తీరంలోని మునివరులకు నమస్కరించాడు. అంతేకాదు ఆ తీరంలో యోగుల్ని, వివిధ మంత్రోపాసకుల్ని, అలాగే వివిధ యోగాసానలతో సామాన్యమానవులను, అసాధ్యమైన రీతిలో తపస్సు చేస్తున్న హఠయోగుల్ని దర్శించాడు.

స్వామిపుష్కరిణీ తీరంలో మునిగణం. ఆ సమ్మునుల మధ్య నాలుగుమోములవాడు. ఆ సత్యలోకపాలకుడే ధ్యాన నిమగ్నుడయి అష్టాక్షరి మంత్రం జపిస్తుండడం చూచి ఆశ్చర్య పడ్డాడు వశిష్ఠుడు. వెంటనే దశరథునితో–

"అధిపా! మనం చేరవలసిన చోటికే వచ్చాం. చతు ర్ముఖుడంతటివాడే ఈ ప్రదేశాన తపస్సు చేస్తున్నాడు. కనుక స్వామి ఇక్కడే వాణీవల్లభునికి తప్పక ప్రత్యక్షం కాగలడు. ఇది సత్యం. అందువల్ల దశరథా! నీవూ ఇక్కడే పవిత్రుడవై ధ్యానించు" అన్నాడు.

'గురువర్యా! నిజమే. హరిమెచ్చే జపవిధానాన్ని మీరే సూచించండి' అని చేతులు జోడించాడు అయోధ్యాపతి.

కులగురువయిన వసిష్ఠుడు దశరథునికి శ్రీమన్నారా యణ అష్టాక్షరీమంత్రం ఉపదేశించాడు. దశరథుడు నియమంతో జపం కొనసాగించాడు.

ఆ సందర్భంలో ఒక్క పెట్టున మహాధ్వని వినబడింది. ఆ ధ్వని శ్రవణంతో బ్రహ్మాదులు కనులు తెరిచారు. దశరథుడు వారికి నమస్కరిస్తే 'దశరథా! వంశాభివృద్ధిరస్తు' అన్నారు. అయినా అక్కడి వారికంతా ఆశ్చర్యమే. ఆ మహాధ్వని ఏమిటా? అని. కాసేపటికే ఒక తేజస్సు. ఆ దివ్యతేజాన్ని దర్శించలేక దేవతలు కళ్ళు మూసుకొన్నారు.

బ్రహ్మదేవునికి ఐదురంగులతో ప్రకాశించే పట్టణం కని పించింది. ఆ పట్టణం మధ్యలో చిత్రవిచిత్ర కల్పితమయిన దివ్యవిమానం కళ్ళకు ఆనుతుంటే, బ్రహ్మదేవుడు అగస్త్య వశిష్ఠాదులను చూస్తూ –

'ముని పుంగవులార! నా తండ్రి వాసం కనిపిస్తున్నది. రండి. రారండి.' అంటూ సంతోష పారవశ్యంతో పిలిచాడు. వారందరు విమానం తూర్పు మార్గానపోతుంటే వారి వెంట దశ రథుడు కూడా వారిని అనుసరించాడు. అక్కడ క్రీడామంటపంలో నవరత్నఖచితమయిన పద్మపీఠంపై హరి దర్శనీయుడై శ్రీభూనీళా సమేతుడై కనిపించడంతో తమ జన్మసార్థకమయిందని శ్రీమన్నారాయణుని మనసారా నుతించాడు. *(ఇంకా ఉంది)*

# సందేహాలు



# సమాధానాలు

–డా॥ రేవూరు అనంతపద్మనాభరావు,
98665 86805

**ప్ర) నిత్యం కనకధారాస్తోత్రం పఠనం చేస్తే ఎన్నాళ్లకు లక్ష్మీదేవి కటాక్షం కలుగుతుంది? -శ్రీ టి.లక్ష్మీకళ, భీమవరం.**

జ) మనం త్రికరణశుద్ధిగా పఠనం చేసే దీక్షాదక్షతలపై అది ఆధారపడి ఉంటుంది. దీనికి ఉదాహరణ కనకధారాస్తోత్ర ఆవిర్భావమే. ఆదిశంకరులు భిక్షాటనకై వెళ్లి, ఒక పేదరాలి గృహం ముందు నిలిచి–'భిక్షాం దేహి మాతే!' అని అర్థించారు. దీనావస్థలో ఉన్న ఆమె తలుపు చాటున నిలబడి శంకరుల చేతిలో ఒకే ఒక ఉసిరికను జారవిడిచింది. అది మాత్రమే ఆమె ఇంట్లో ఉంది. భక్తిశ్రద్ధలతో సమర్పించిన ఆ భిక్షకు తృప్తి చెందిన శంకరులు లక్ష్మీదేవిని ఆ పేదరాలిని కరుణించమని కోరుతూ...

వందే వందారు మందార మందిరానంద కందళం
అమందానంద సందోహ బంధురం సిందురాననం

అని అర్థించాడు. ఆనందించిన ఆ లక్ష్మీదేవి కనకధారగా ఆమలకాలను ఆ పేదరాలి ముంగిట వర్షించింది.

**ప్ర) 'హనుమాన్ చాలీసా' పారాయణం సుందరకాండతో సమానమని అంటారు. ఎందువల్ల?**
**- శ్రీ వి.శ్రీమన్నారాయణ, ఆకివీడు.**

జ) తులసీదాసు ప్రసిద్ధ రామచరితమానస్ గ్రంథాన్ని 'అవధి'భాషలో వ్రాశాడు. చాలీసా అంటే నలభై. హనుమాన్ చాలీసాలో 40 ద్విపదలుంటాయి. తులసీదాసు పరమరామభక్తుడు. 39వ శ్లోకంలో 'ఎవరైతే హనుమంతునిపై సంపూర్ణ భక్తి భావంతో జపిస్తారో, వారికి హనుమదనుగ్రహం కలుగుతుందని' స్పష్టం చేయబడింది. వాల్మీకి రామాయణంలో సుందరకాండ పఠనం ఎంత ఇష్టసిద్ధి కారకమో, హనుమాన్‌చాలీసా పఠనం కూడా అంతే శ్రేష్ఠమని దాని భావం. వాల్మీకి పునర్జన్మలో తులసీదాసుగా జన్మించాడని ప్రతీతి.

**ప్ర) శ్రీదక్షిణామూర్తి స్తోత్రం రోజుకు ఎన్నిసార్లు చదవాలి? దానివల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?**
**- శ్రీ ఎం.గురువర్ధిని, కాకినాడ.**

జ) దక్షిణామూర్తి పటాన్ని ఇంటిలో ఉంచి, రోజూ పదినిమిషాలు దక్షిణామూర్తి స్తోత్రాన్ని భక్తిశ్రద్ధలతో పఠిస్తే, ఆ ఇంట్లో ఉన్న అరిష్టాలు నశిస్తాయని ప్రబల విశ్వాసం. మానవులకు వారి జీవితంలో దుఃఖాలను తొలగించేదీ, జ్ఞానాన్ని ప్రసాదించే దైవం దక్షిణామూర్తి. ఆయన సాక్షాత్కరించిన ప్రదేశం శ్రీకాళహస్తి. ఇక్కడి శక్తిపేరు జ్ఞానప్రసూనాంబ. మోక్షాన్ని కోరే వారికి జ్ఞానాన్ని అందించే దయగల గురువు దక్షిణామూర్తి.

"ఓం మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ తత్త్వం యువానం" అని ఆ స్తోత్రం ఆరంభమవుతుంది. అది జ్ఞానప్రదాయకం.

**ప్ర) సామాన్యమానవులు తమ జీవితంలో భక్తి, జ్ఞాన, కర్మయోగాలలో ఏది పాటించాలి?**
**- శ్రీ ఎం.శ్రీనివాసరావు, రాజోలు.**

జ) జీవితపరమధ్యేయం 'బ్రహ్మానందం' పొందడమే. అదే నిష్కామకర్మ. 'కర్మణ్యే వ్యాధికారస్తే మాషుఫలే కదాచన' అన్నాడు గీతాచార్యుడు. రాజయోగం గూర్చి పతంజలి విస్తృతంగా చర్చించాడు. భక్తి, జ్ఞాన, కర్మయోగాలు పరస్పరం ఆధారపడి ఉంటాయి. ధ్యానయోగం నాల్గవది. ముక్తి, మోక్షము, నిర్వాణము పొందడానికి నాలుగు యోగాలు ఆవశ్యకమే. నాల్గింటిని అనుసరించాలి.

**ప్ర) శ్రీశైలశిఖరదర్శనం చేస్తే పునర్జన్మ ఉండదంటారు. నిజమేనా?**
**- శ్రీ వి.నాగప్రసాద్, తణుకు.**

జ) "శ్రీశైలం శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అని పురాణాలు చెబుతున్నాయి. శిఖరదర్శనం శ్రీశైలంలో చేస్తే వారణాసిలో మృతి తథ్యమని పద్మపురాణం ఘోషిస్తోంది. శిఖరదర్శనంతో సకల పాపాలు హరిస్తాయని శివపురాణం చెబుతోంది. శ్రీశైలశిఖరం సముద్రమట్టానికి 2850 అడుగుల ఎత్తులో ఉంది. పూర్వకాలంలో దట్టమైన అడవిలో ప్రయాణించి అలసిపోయి శిఖరానికి చేరుకొనేవారు. శిఖరాన్ని దూరం నుంచి చూసినా సర్వపాపాలు తొలగిపోతాయని, 'జీవితం–మరణం' చక్రం తొలగిపోతాయని పురాణాలు పేర్కొంటున్నాయి. శిఖరేశ్వరంలో కొలువైన దేవుడు వీరశంకరుడు. భక్తులు ఇక్కడ నువ్వుల గింజలను రోకలి ఉపయోగించి రుబ్బుతారు. శ్రీరామచంద్రుడు ఈ క్షేత్రాన్ని సందర్శించాడని ప్రతీతి. 'రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే' అనే లోకోక్తి కూడా ప్రచారంలో ఉంది. ఉత్సవసమయంలో రథంపై ఉన్న కేశవుణ్ణి చూచినా పునర్జన్మ లేదని భావం.

మార్చి 25
'శ్రీలక్ష్మిజయంతి'
సందర్భంగా...

# 'శ్రీమహాలక్ష్మి' మహోదయం

- శ్రీమతి పసుపులేటి స్వరూప - 85005 45097

లక్ష్మీదేవి సర్వైశ్వర్యాలను, సకల సౌభాగ్యాలను ప్రసాదించే సిరులతల్లి. సకల సంపదలకు అధిదేవత. శ్రీమహాలక్ష్మీ దేవిని పూజిస్తే అష్టైశ్వర్యాలు కలుగుతాయి. నిత్య సత్య స్వరూపిణి అయిన ఆ తల్లి అనుగ్రహం వల్లనే మనం శాశ్వతమైన ఆనందాన్ని పొందగలం. ఆ జగన్మాత పుట్టినరోజు ఫాల్గుణ పూర్ణిమ.

లక్ష్మి అంటే 'శుభలక్షణ లక్షిత' అని అర్థం ఉంది. మనిషి రూపురేఖలు ఎలా ఉన్నా, గుణగణాలు సక్రమంగా ఉంటేనే లక్ష్మీకటాక్షం కలుగుతుంది. మనలోని శుభలక్షణాల కలబోతే లక్ష్మి. ధైర్యం, వీర్యం, ఆరోగ్యం, బుద్ధి ఇవన్నీ లక్ష్మీదేవి సంకేతాలే. వీటినే ధైర్యలక్ష్మి, సంతానలక్ష్మి అని వివిధ పేర్లతో, పలు రూపాల్లో కొలుస్తుంటాం. పవిత్రంగా, ప్రశాంతంగా ఉండే ఇండ్లలో, మనుషులతో తాను ఉంటానని స్వయంగా లక్ష్మీ అమ్మవారు ప్రకటించింది.

కష్టానికి ప్రతిఫలం లక్ష్మి. సంతోషాలకు ఆధారం, సంతృప్తికి మూలం కూడా ఆమే. మహాలక్ష్మికటాక్షం కోసం లోకమంతా ఎదురు చూస్తుంటుంది. అష్టలక్ష్ముల చూపు తగిలితే చాలు... అష్టదరిద్రాలూ తీరిపోతాయని లోకంలోని ప్రజలంతా తహతహలాడుతుంటారు. ఆ తల్లి కరుణ అణువంత ప్రసరిస్తే చాలని ఆకాంక్షిస్తుంటారు.




## మంచి గుణాలే మహాలక్ష్మి

'శుద్ధ (సిద్ధ) లక్ష్మీ మోక్షలక్ష్మీ జయలక్ష్మీ సరస్వతీ శ్రీలక్ష్మీ వరలక్ష్మీశ్చ ప్రసన్న మమ సర్వదా' అన్నారు పెద్దలు. 'శుద్ధలక్ష్మి' అంటే పరిశుభ్రంగా ఉన్న ఇంట్లోనే లక్ష్మీదేవి ఉంటుంది. ఇంటినీ, తమ ఒంటినీ శుభ్రంగా ఉంచుకున్న వారింటికి పిలవకపోయినా సిరి నడిచి వస్తుంది. శుద్ధి అంటే పైకి కనిపించేది మాత్రమే కాదు. అంతశ్శుద్ధి కూడా. సర్వ కాలాల్లో బాహ్యంగా, మానసికంగా శుద్ధి ఉన్న చోట లక్ష్మి నివసిస్తుంది. బూజు కొట్టుకుపోయిన పైకప్పు, మురికిపట్టిన గచ్చుతో కళావిహీనంగా ఉండే ఇండ్లలో లక్ష్మీదేవి అరక్షణం కూడా నిలువదు. తిట్లు, శాపనార్థాలు, పరనింద చేసే మనుషులున్న ఇంటి వైపు కన్నెత్తి కూడా చూడదు.

'నిరంతరం శుభాన్ని కోరేవారు, శాంత స్వభావులు, ఇంద్రియ నిగ్రహం కలవారు, పరులకు సాయం చేసేవారు, అతిథులను గౌరవించేవారు, కాలం వృథా చేయనివారు, కృతజ్ఞత చూపేవారు, సమర్థంగా పని చేసేవారు- ఇలాంటి సద్గుణాలు కలిగిన వారింట 'నేనుంటా'నని లక్ష్మీదేవి స్వయంగా రుక్మిణీదేవికి చెప్పిందని పురాణగాథ. లక్ష్మి నిలిచిన చోట సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయి. శ్రమైక జీవన సౌందర్యమే లక్ష్మి. కష్టపడేవారిని ఆ తల్లి ఎల్లప్పుడూ అనుగ్రహిస్తుంది. లక్ష్మీదేవి అనుగ్రహం అంటే ఐశ్వర్యంలో మునిగిపోవడం కాదు. డబ్బు మాత్రమే కాదు. జ్ఞానం, సంతృప్తి, ప్రశాంతత, ఆనందం ఇవన్నీ లక్ష్మీ స్వరూపాలే.

## ప్రకృతి అంతా లక్ష్మీమయం

మన చుట్టూ ఉన్న ప్రకృతి కూడా లక్ష్మీదేవి ప్రతి రూపమే. ఆ తల్లిని 'ప్రకృత్యై నమః' అని స్తుతించారు. ప్రకృతి లోని ప్రతి సంపదా లక్ష్మీ స్వరూపమే. పాంచభౌతిక శక్తులైన **భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశాలను** సమన్వయపరిచి పుడమిపై నివసించే ప్రాణులకు రక్షణ కల్పించే శక్తి లక్ష్మి. పంటపొలాల్లోనే కాదు, పచ్చని చెట్లలోనూ ఆమె నివసిస్తుంది. ముఖ్యంగా బిల్వవృక్షాలు లక్ష్మీ నివాసాలని శ్రీసూక్తం చెబుతున్నది. చెట్లు నాటేవారినీ ఆమె అనుగ్రహిస్తుంది. తొలిసంధ్య కిరణాల్లోని లక్ష్మీశక్తి భూమిలో ఖనిజాలను సృష్టిస్తుందని వేదమంత్రాలు చెబుతున్నాయి.

*వర్షంతు తే విభావరి దివో అభ్రస్య విద్యుతః/ రోహంతు సర్వబీజాన్యవ బ్రహ్మ ద్విషోజహి* – లక్ష్మీదేవి అనుగ్రహం వల్లనే వర్షం కురుస్తుందని శాస్త్ర వచనం. ఆ వర్షం కారణంగానే నేల మీద విత్తనాలు మొలకెత్తి సమస్త జీవులకు ఆహారం అందుతున్నది. అంతేకాదు, ఆ తల్లి మనలో జ్ఞానబీజాన్ని మొలకెత్తించి విజ్ఞాన ఐశ్వర్యాన్ని సిద్ధింపజేస్తుంది. లక్ష్మీకటాక్షం సంతోషాలకు మూలకారణం. అయితే, ఆ ఆనందాల్లోనే తేలిపోతూ మనలోని సద్గుణాలను విడిచిపెట్టిన క్షణం నుంచి పతనం మొదలవుతుంది.

శ్రీదేవి కరుణను తాత్కాలికమైన లౌకికసుఖాలకు పరిమితం చేయడం అజ్ఞానమే అవుతుంది. ఆపదలు తీరి అన్నిటా సంతోషం కలిగినప్పుడు విచక్షణ కోల్పోకుండా, వివేచనతో మెలగాలి. జ్ఞానతృష్ణను తీర్చుకుంటూ, ధార్మికతవైపు పయనించాలి. కలిగిన దాంట్లో నలుగురికీ సాయం చేస్తూ పునీతులం కావాలి. అప్పుడే లక్ష్మీ అనుగ్రహానికి సార్థకత ఏర్పడుతుంది. మోక్షానికి మార్గం సుగమం అవుతుంది.

## జగమంతా లక్ష్మీనివాసం

లక్ష్మీదేవి ప్రస్తావన మహాభారతం శాంతిపర్వంలో వస్తుంది. 'లక్ష్మీదేవి ఎక్కడ ఉంటుంది?' అని భీష్ముడిని అడుగుతాడు ధర్మరాజు. దానికి జవాబుగా 'జలాల్లో, పచ్చని పొలాల్లో, అగ్నిలో, వాయువులో, గోవులో, ఏనుగు కుంభస్థలంలో, ఇంటి గడపపై, ఇల్లాలి పాపిటబొట్టులో, నుదుటి సిందూరంలో, ఇంట్లోని వ్యక్తుల చిరునవ్వులో, అతిథిసత్కారాలు ఉన్న ఇంటిలో, స్వచ్ఛతలో, పరిశుభ్రతలో, బంగారంలో, చల్లని వెన్నెలలో, సత్యం, దానం, వ్రతం, ధర్మం ఆచరించే చోట లక్ష్మి నివసిస్తుంది' అని చెప్పిన భీష్ముడి సమాధానం ద్వారా జగమంతా లక్ష్మీ నివాసమే అని అర్థమవుతుంది.

## లక్ష్మీదేవి ఎక్కడ ఉండదంటే...

మన ఇంట్లో లక్ష్మి కొలువుదీరడానికి ఎంతో కష్టపడాల్సి వస్తుంది. కానీ, చిన్నపొరపాటు చాలు అనంతలక్ష్మి అంతర్ధానమైపోతుంది. మనసులో అసూయ రగిలినా, లోభాన్ని ప్రదర్శించినా, అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకు గురైనా ఆ ఇంట లక్ష్మి ఉండదు. ధర్మం తప్పిన చోట, తులసిని పూజించని చోట, శివార్చన జరగని ఇంట, అతిథి సత్కారాలు లేని నెలవు నుంచి లక్ష్మి వెళ్లిపోతుంది. ఇల్లాలు కంటతడిపెట్టినా, అసత్యాలు పలికినా, దుర్భాషలాడినా, ఇతరుల మనసు గాయపరిచిన వారి ఇంటి నుంచి సిరి తరలిపోతుంది. భాగవతులను నిందించే వాళ్లపై కనికరం చూపదు లక్ష్మీదేవి. పొద్దస్తమానం నిద్రపోయే సోమరులను, పని చేయడంలో అశ్రద్ధ వహించే బద్ధకస్తులను కన్నెత్తి చూడదు. కలహాలు పెట్టుకునే ఇంట్లో క్షణం నిలువదు.

## విశ్వమంతా లక్ష్మి స్వరూపం

ప్రతి స్త్రీలోనూ లక్ష్మీకళ ఉంటుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకనే స్త్రీలను లక్ష్మీస్వరూపంగా ఆరాధించటం, అర్చించటం మన సంప్రదాయంలో ఒక భాగంగా ఉంటుంది. ఏ పనికైనా మహిళే ఆదిశక్తి. ఆమెదే ఉన్నతస్థానం. అందరి మాటలు ఓర్పుగా వింటుంది. ఇతరులతో పనులు చేయిస్తుంది. తాను స్వయంగా చేస్తుంది. గుణాల చేత వ్యాపిస్తుంది. దోషాలు తొలగిస్తుంది. అందుకే స్త్రీ రూపంలో లక్ష్మికి మన సంస్కృతి సమున్నత స్థానాన్ని ఇచ్చింది. అనంతవిశ్వాన్ని లక్షించేది లక్ష్మి. అందరూ లక్షించేది లక్ష్మిని. లక్షించటం అంటే చూడటమని అర్థం. అందరినీ తన కరుణామృతపూర్ణమైన చల్లని చూపులతో కనిపెట్టుకుని, గమనించి, పాలించేశక్తిని లక్ష్మిగా చెప్పుకోవచ్చు. సర్వసాక్షియైన ఈ భగవద్దర్శన శక్తిని లక్ష్మిగా ఉపాసించటం లక్ష్మీ ఆరాధనలోని ప్రత్యేకత. అందరూ ఆనందాన్నీ, ఐశ్వర్యాన్నీ, జ్ఞానాన్ని, లక్ష్యంగా పెట్టుకొనే జీవిస్తారు. ఇలా అందరికీ లక్ష్యమైన జ్ఞాన ఆనంద, ఐశ్వర్యాల సాకారరూపమే లక్ష్మి.

*ఓం శ్రియై నమః*

మార్చి 25
'తుంబురుతీర్థముక్కోటి'
సందర్భంగా...

# తపోధ్యానస్థలి-
# 'తుంబురు తీర్థం'

– ట్రెక్కింగ్ బాలు, 98484 29244



మనిషి పుట్టుకే ఆశ్చర్యమనుకుంటే... ఆ ఆవిర్భావానికి కారణమైన మూలప్రకృతి మరెంతటి నిబిడాశ్చర్యకరమో! అలాంటి అచ్చెరువొందించే, కుతూహలం రేకెత్తించే ప్రాకృతిక చమత్కృత శిలా శిల్పాలయం **తుంబురుతీర్థం!** భౌగోళికంగా, నైసర్గికంగా, పౌరాణికంగా, చారిత్రకంగా, సాంస్కృతికంగా, జీవవైవిధ్య పరంగా ఎన్నదగ్గ ఒకానొక ఉత్కృష్ట సృష్టిక్రమం–తుంబురుతీర్థం. శ్రీవేంకటేశ్వరస్వామి వేట విడిది! ఎందరో ఋషులు, యోగులు, సిద్ధులు, సాధకుల తపఃస్థలి!

## భువిపై దివి

మెరిసే నక్షత్రాల జడి నడుమునుండి జారిపడిన గ్రహ శకలంలాంటి తుంబురుతీర్థం శేషాచలసానువుల్లోని సమ్మోహన స్థలం. తూర్పుకనుమలు, దక్కను పీఠభూమికి చెందిన శేషాచలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు, కడపజిల్లాల ఉమ్మడి అటవీ ప్రాంతం. ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలకి శేషాచలమే పుట్టినిల్లు, శేషాచలం హృదయస్థానమే తిరుమల క్షేత్రం! తిరుమల మరో పేరు ఆదివరాహక్షేత్రం! తిరుమల గర్భగుడిలోని శ్రీనివాసుడికి ఈ ప్రాంత స్థలదాత ఆదివరాహస్వామి.

పౌరాణికంగా వరాహస్వామి జగల్లీల జగద్విదితం! వరాహభూమి– తిరుమల కేంద్రంగా భక్తి, ధర్మ, జ్ఞాన, ముక్తి ప్రదాలైన 108 దివ్యతీర్థాలున్నట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. 'తీర్థం' అంటే 'పుణ్యం' అని కూడా భావార్థం. రాన్రాను పవిత్రోదకం అనే అర్థంలో చెప్పడం పరిపాటి. తిరుమల గుడి దాపునగల స్వామిపుష్కరిణీ తీర్థం నుండి *శంఖ, చక్ర, నాగ, గోగర్భ, పాండవ, దేవ, ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార, సనకసనందన, కాయరసాయన, రామకృష్ణ, జాబాలి, సీతమ్మ, శేష..* తదితర దివ్యతీర్థాల వరకు.. అనేక జల నిక్షేపాలకు ఆలవాలం ఈ క్షేత్ర పరిసరాలు.

తీర్థాలన్నింటిలోకి తలమానికమైనది **'తుంబురుతీర్థం'.** దీనినే **'ఘోణతీర్థం', 'ఫల్గుణీతీర్థం'** అనికూడా పిలుస్తారు. తుంబురుడు అనే నాదయోగి తపస్సు చేసిన స్థలం. అంతేగాక తుంబురుడు అనే గంధర్వుడి ధర్మపత్ని శాపవిమోచనం పొందిన ప్రదేశం కూడా. వరాహ, బ్రహ్మ, స్కాంద, గరుడ పురాణాల్లో ఈ తీర్థమాహాత్మ్యం వర్ణితమైంది.

## మార్గం

తిరుమల నుండి రోడ్డుమార్గాన పాపవినాశనం చేరుకుని, అక్కడ్నుంచి పర్వతారోహణ చేయాల్సి ఉంటుంది లేదా తిరుమల నుండే ఉత్తరంగా పురాతన కాలిదోవల గుండా కూడా తుంబురు తీర్థం వెళ్ళవచ్చు. అయితే ఒక మంచి గైడ్ తప్పనిసరి. పాపవినాశనం నుండి తుంబురుకోనకు సుమారు ఏడు కి.మీ. దూరం. పాపవినాశనం డ్యామ్ మీదుగా బయల్దేరి *సనకసనందన తీర్థం, సలీంద్రబండ, పింగదీసినమడుగు* మీదుగా తుంబురుకోన చేరుకోవచ్చు లేదా తిరుపతి–కడప రాష్ట్రహైవే మీదగల మామండూరు, కుక్కలదొడ్డి గ్రామాలనుండి బయల్దేరి కూడా తుంబురుతీర్థం చేరుకోవచ్చు. కుక్కలదొడ్డినుండి తుంబురు తీర్థానికి సుమారు 14కి.మీ. దూరం. (అడవిబాట సుమా!)

## తీర్థస్నానం విశేషం

ప్రతిఏటా ఫాల్గుణమాసం, ఉత్తరఫల్గుణీ నక్షత్రయుక్త పున్నమినాడు (మార్చి, ఏప్రిల్‌మాసాల మధ్యకాలంలో) **'తుంబురుతీర్థ ముక్కోటి'.** తీర్థపర్వదినంరోజు లక్షలాదిమంది భక్తులు ఇక్కడకు వచ్చి తీర్థస్నానం ఆచరిస్తారు. తీర్థస్నానం సర్వ పాపహరణంగా భక్తులు సంబరపడతారు.



## తుంబురు తీర్థం

- 13.75 ఉత్తరఅక్షాంశం, 79.36 తూర్పురేఖాంశం.
- సముద్రమట్టానికి రమారమి 1100ల అడుగుల ఎత్తున ఉంది.
- తిరుమల దివ్యతీర్థాల్లో ఒకటి. మార్చి ఏప్రిల్ నడుమ వచ్చే ఉత్తరఫల్గుణీనక్షత్ర యుక్త పున్నమికి 'తీర్థముక్కోటి'.
- అరణ్యసీమ శ్రీ వేంకటేశ్వర అభయారణ్యం పరిధి లోనిది.
- సీజన్: ఆగష్టు నుండి జనవరి వరకు.
- అటవీశాఖ అనుమతి అవసరం.
- గైడ్ లేదా దారి తెలిసిన వ్యక్తి తప్పనిసరి.
- ప్రయాణంలో కాటన్ దుస్తులు ధరించాలి. అత్యవసర మందులు, తగిన ఆహారపదార్థాలు, త్రాగునీరు చెంతన ఉండాలి.
- దూరం: తిరుమల పాపవినాశనం డ్యామ్ నుండి 7 కి.మీ.
- తిరుపతి - కడప మార్గంలోని కుక్కలదొడ్డి నుండి 14కి.మీ.
- సెల్‌ఫోన్ పనిచేయకపోవచ్చు.

## తీర్థస్థలి

తుంబురు కోన చేరుకోవడం ఒకెత్తు. కోన నుండి తుంబురు తీర్థస్థలికి ఏగడం మరోఎత్తు. విరాట్ పురుషుడికి నైవేద్యచందంగా ప్రకృతిమాత కొట్టిన కొబ్బరికాయ రెండు ఒప్పులై, నారికేళ జలం చిప్పిల్లిన రీతిని తలపిస్తుంది ఇక్కడి కొండల దృశ్యం. కోట్లాది సంవత్సరాలక్రితం భూమి పరిణామ క్రమంలో భాగంగా ఓ నిండుకొండ అమాంతం రెండుగా విచ్చుకుని, దోవవిడిచిన మార్గంలో సుమారు ముప్పావు కిలో మీటరు ముందుకేగితే చివర్లో తటిల్లతలా తీర్థ జలపాతం! ఎన్నో అమూల్యమైన మూలికల సారాన్ని ఇముడ్చుకుని ప్రవహిస్తున్న సంజీవనీ జలం. ఆత్మను అభిషేకించేలాగున తనివితీరా తడిస్తే ఒళ్ళు, మనస్సు ప్రక్షాళన అవుతాయి. షట్చక్రాలు ఉత్తేజిత మౌతాయి. తపస్సిద్ధి కలుగుతుంది. ఈ ప్రయాణం ఆసాంతం అంచెలంచెలుగా దేవాలయ నిర్మాణరీతుల్ని దాటుకుంటూ అంతిమంగా గర్భగుడిలోని మూలదైవంతో ఐక్యం అయిన అనుభూతి.

## తరిగొండమ్మ గవి


అడవితల్లి ఆవులిస్తున్నట్లు నోరుపెట్టిన ఈ గుహ పేరు తరిగొండ వెంగమాంబ గవి. 'తరిగొండమ్మ గవి'గా వ్యవహార నామం. భక్త కవయిత్రి, మహాయోగిని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 1730-1817 సంవత్సరాలలో ఈ గవిలో చాలాకాలం తపస్సు చేసింది. తన యోగవిద్యతో సూక్ష్మశరీర యానం చేస్తూ, ప్రతిరోజూ తిరుమల గుడిలోని ఇష్టదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని కొలిచి వచ్చేది. ఈ మహానుభావురాలు



రాసిన ‘చెంచునాటకం’లో వేంకటేశ్వరుడు కోడెగాడై, గరుడవాహనంపై వేటనిమిత్తం తుంబురు కోనకు తరలివస్తాడు. ఇక్కడి చెంచువనితలతో ఆడి పాడి, అలసి సొలసి ఆనందంగా తిరిగి తిరుమల కొండకు పయనమవుతాడు.

## నారదమండపం

తుంబురుతీర్థం ముఖద్వారం ముంగిటదర్శనమిచ్చే



చిన్నపాటి నిర్మాణమే ‘నారదమండపం’ అనే నారదాశ్రమం. అసమాన వీణావాదంలో తుంబురుడు, నారదుడు సమకాలికులు. అందుకేనేమో ఇద్దరినీ స్మరించుకునేరీతిలో తుంబురు తీర్థంలో నారదుడి పేరిట మంటపం వెలసింది. రండి. శేషాద్రి తీర్థ రాజమైన తుంబురుతీర్థాన్ని దర్శించండి. తుంబురు తీర్థముక్కోటిన స్నానమాచరించండి. ముక్తిని పొందండి.

ఓం నమో వేంకటేశాయ



# శ్రీకృష్ణామృతం...

మేలుకొలుపులివే వేంకటరాయా
మేలుగా మమ్మేల భక్తుల కాయా

పాలకడలిలో శేషతల్పముపై
నిద్రించిననిను మేల్కొనజేయగా
దేవ గంధర్వ సిద్ధచారణులతో
అనంతను నేను నీకై వచ్చితి

మేలుకొంటిమయా భౌతికముగా
మేలుకొన జేయుము మానసికముగా
మేదిని పుట్టిన మనుజుల కికనూ
మేవడి నీవని తెలియగ చేయుము

మర్మపు కర్మల మాయను తీసి
మనసును ముత్యపు పీఠముచేసి
ముదముతో వచ్చి మనసున నిలచీ
మా పూజలు గైకొని మార్గము చూపుమా

సత్వ గుణముల సత్తువ పెంచి
సాధువర్తనపు గుణములు నింపి
సాగనీ బుద్ధికి సమ్మతి నొసగీ
సార్వభౌముడా సద్గతి నొసగుమా

సాధనమార్గపు సుళువులు తెలిసీ
సతతము నిన్నే మాయెద నింపీ
స్వరములు కూర్చి పదములు పేర్చి
స్వామిని కొలిచి సన్నుతి సేయగా




సంకీర్తనలను కైంకర్యముగా
స్వామికి నిత్య నైవేద్యముగా
సేవలు చేసేడి భాగ్యమునిడుమా
సత్వర వరముల
సంపదనొసగుమా

–‘అనంత’ కృష్ణసుందరి సత్తిరాజు,
99103 10594

# కృష్ణం వందే జగద్గురుమ్

- డా॥ యస్.ఏ.టి.రాజ్యలక్ష్మి

శ్రీమన్నారాయణుని దివ్యఅవతారాలలో విశిష్టమైనదీ, పరిపూర్ణమైనదీ శ్రీకృష్ణావతారం. శ్రీరామావతారంలో రాముడు ఆదర్శమానవుడిగా సాక్షాత్కరిస్తాడు. కృష్ణుడు మాత్రం మేధావిగా దర్శనమిస్తున్నాడు. పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావ తారాలనే శ్రీమహావిష్ణువు పంచస్వరూపాలను శ్రీరామావతారంలో ఎక్కడా ప్రదర్శించినట్లు కన్పించదు. ఒక సాధారణ మానవుడిగా మాత్రమే రాముడి ప్రయాణం సాగింది. కృష్ణావతారం అలా కాదు. రామావతారంలో అసంపూర్ణంగా మిగిలిపోయిన లీలలన్నీ కృష్ణావతారంలో పరిపూర్ణమయ్యాయి. కేవలం లౌకిక జీవనం ప్రధానంగా శ్రీకృష్ణావతారంలో మనకు దర్శనమిచ్చి నప్పటికీ, లోలోపల తరచి చూసినట్లయితే ఎన్నో వేదాంత రహస్యాలు, సామాజికాంశాలు, సాంస్కృతికాంశాలు, ప్రాకృతి కాంశాలు శ్రీకృష్ణపరమాత్మ జీవితంలో కన్పిస్తాయి.



శ్రీకృష్ణుడు గొప్ప ఆధ్యాత్మికవేత్త. యోగి. నిత్యబ్రహ్మ చారి. అష్టమహిషుల్ని పెండ్లాడిన శ్రీకృష్ణుడు నిత్యబ్రహ్మచారి ఎలా అవుతాడనే సందేహం చాలామందికి కలగవచ్చు. ఎల్ల ప్పుడూ పరబ్రహ్మతత్త్వంలో చరించేవాడు. అందుకే నిత్యబ్రహ్మ చారి. ఆర్ష సంప్రదాయాన్ని అనుసరించి చేసే పూజావిధానాలలో "శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః" అని నమస్కరించడం ద్వారా ఈ తత్త్వం విశదమవుతుంది. శ్రీకృష్ణుడు మహదాచార్యుడు. గురువు లకే గురువు 'జగద్గురువు'.

వసుదేవ సుతం దేవం కంస చాణూరమర్దనం।
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుం॥

వసుదేవుడి సుతుడై వాసుదేవుడయ్యాడు. అంతర్యామి స్వరూపంగా చరాచర జీవరాశిలో అంతర్లయగా ఉండేవాడు కాబట్టి వాసుదేవుడు. దీనిని నిరూపించడానికే కంసుడు, చాణూరుడు మొదలైన రాక్షసులను సంహరించాడు. జగత్తు మొత్తానికీ పరమానందాన్నిచ్చే విధంగా అలరించేవాడు.

పోతన భాగవతంలో చెప్పినట్లుగా -


"లోకంబులు లోకేశులు లోకస్థులు తెగిన తుది నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వడు ఏకాకృతితో వెలుంగు నతనినే సేవింతున్"

అని భావిస్తూ ఎందరెందరో శ్రీకృష్ణుని ఆచార్యుడిగా, కుమారుడిగా, స్నేహితుడిగా, దైవంగా, పరబ్రహ్మగా సేవించి తరించారు. కృష్ణుడంటే ఆకర్షించేవాడనీ అర్థం. తన దివ్యలీల లతో దివ్యసందేశాలతో అలరించిన దివ్యపురుషుడు.

మానవుడికి ప్రకృతితో ఉన్న సంబంధాన్నే శ్రీకృష్ణుడి లీలలు మనకు అందిస్తాయి. నవనీతచోరుడైన నందకిశోరుడు, గోవర్ధనోద్ధరణం, కాళియమర్దనంలాంటి లీలలద్వారా పశు సంపదను జలసంపదను పరిరక్షించుకోవాలనే సందేశాన్ని అందించాడు. సేవాధర్మమే అన్ని ధర్మాలకంటే మిన్న అని చాటి చెప్పినవాడూ శ్రీకృష్ణుడే. ఆర్తత్రాణపరాయణత్వం శ్రీకృష్ణుడి స్వరూపంలో స్వభావంలో ప్రస్ఫుటమవుతూ ఉంటుంది.

సహనం, క్షమ, గర్వంలేకపోవటం వంటి లక్షణాలున్న వారికి విజయం కొంచెం పరీక్ష పెట్టినా చివరికి వరించి తీరుతుంది. మానవుల్ని సరిదిద్దటంలో, హితవు పలకటంలో శ్రీకృష్ణుడికి తర-తమ భేదం లేదు. 'కృష్ణా నీవే నాకు దిక్కు' అని సర్వశక్తులూ, ప్రయత్నాలు విడనాడి ఆర్తితో పిలిస్తే శ్రీకృష్ణుడు రక్షిస్తాడు.

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

**(తిరుమల–తిరుపతి ఐతిహ్యమాల)**

**తెనుగు అనువాదకులు:**

**కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,**

**కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు**

*గత సంచిక తరువాయి భాగం....*

తిరుమల యడివారమునకు పొలిమేర(ఎల్ల) అని శిష్ట గోష్ఠిలో ప్రసిద్ధమైన 'పెణ్ణై పెణ్ణై'యందు శ్రీమండపము నధిష్ఠించి దివ్యతిరుమలగిరిని శ్రీవేంకటరమణుని కుణ్ణమేన్ది, అకలకిల్లేన్, ఒళివిల్‌కాలమ్– అను పాశురములకు అనుసంధించి పాదార్చన చేసియుండ, అంతట శ్రీవేంకటేశ్వరుడు శేషవస్త్రము, మహా ప్రసాదము, అభయహస్తము, కట్టివిడిచిన పీతాంబరము మొదలగు మర్యాదలనన్నిటిని అనుగ్రహించి పంపగా పొంది కృతార్థులై మరలివచ్చి గోవిందరాజస్వామి పేరోలగమైన శ్రీమణి మండపము నధిష్ఠించియుండి, పిమ్మట గోవిందరాజస్వామి అర్చనను స్వీకరించి "ముద్గాన్నం వ్యంజ నోపేతం ప్రభూతం తు నివేదయేత్" (పెసరపప్పు కలిపిన యన్నము(పులగము) వ్యంజ నములతో మిగుల గొప్పగ ఆరగింపు చేయవలెను.) అనిన రీతిగ ప్రశస్తమగు రీతిని ఆరంగింపుజేసి తిరువాయ్‌మొళి విని పించి వేదములకు సమాప్తి మంగళము జరిపి తిరువాయ్‌మొళికి సమాప్తి జరుపునప్పుడు వకుళాభరణమునులు(శ్రీనమ్మాళ్వారు) గోవిందరాజస్వామి శ్రీపాదములను జొచ్చిన పిదప కట్టియము (ప్రశస్తి ప్రబంధము) విన్నవించువారు–

**"శ్రీవేంకటాచలవిభో రపరావతార గోవిందరాజ గురుగోపకులావతార, శ్రీపూరాధీశ్వర జయాదిమ దేవదేవనాథ ప్రసీద నత కల్పతరో నమస్తే."**

**"లీలావిభూతిజనతా పరిరక్షణార్థం**
**దివ్యప్రబోధ శుకయోగి సమప్రభావ,**
**స్వామిన్ భవత్పదసరోరుహసాత్కృతం తం**
**యోగీశ్వరం శఠరిపుం కృపయా ప్రదేహి."**

(శ్రీ వేంకటాచలపతికి అవతారస్వరూపుడైనవాడా! శ్రీ గోవిందరాజా! గౌరవార్హమగు గోపకులమున నవతరించిన వాడా! తిరుపతినగరాధీశ్వరా! ఆద్యుడవగు దేవదేవా! జయము. అస్మన్నాథా! దయచూడుము. ప్రణతులపాలిటి కల్పవృక్షమా! నీకు ప్రణామము. శ్రీగోవిందరాజా! దివ్యజ్ఞానసంపత్తి యందు శుకయోగితోడ సమానమైన ప్రభావముగలవానిని నీ చరణార విందములందే లీనమైన వానిని ప్రఖ్యాతయోగీశ్వరుని శఠరి పువును నమ్మాళ్వారులను లీలావిభూతియందలి ఈ భూలోక మందలి ప్రజలను పాలించుటకై దయతోడ మాకు ప్రసా దింపుము.)

పై శ్లోకముల ననుసంధించుచు 'శ్రీవేంకటావతార, 'తిల్లై'(చిదంబరము) గోవిందరాజ, తిరుపతి ప్రభూ, నమ్మా ళ్వారులను లీలావిభూతియందు (ఈ భూలోకమున) లోకోప కారార్థమై మరల కృపతోడుత ప్రసాదింపవలెను' అని విన్నపము చేసిన తరువాత భగవంతుడు నమ్మాళ్వారులను ప్రసాదింప ఆళ్వారు కృతార్థులైరి. ప్రసాదవినియోగమైన తరువాత భగవద్రా మానుజాచార్యుల శిష్యులందరును శ్రీపరాంకుశపంచవింశతి– నక్షత్రమాలను అనుసంధింప సమస్త గీతవాద్యములతోడ తమ ఆలయమునకు విజయముచేసి అందరికి తీర్థ ప్రసాదములను మధురకవిసంజ్ఞితములైన శ్రీపాదములను(శఠకోపము వంటి దానిని) ప్రసాదించి, భగవద్రామానుజుల దివ్యాజ్ఞ ప్రవర్తిల్ల జేయుచు ఎల్లవారిని రక్షించునట్లు ఏర్పాటు గావించిరి.

*(ఇంకా ఉంది)*

**మార్చి 16 నుండి 25 వరకు**
**తరిగొండలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా..**

# 'తరిగొండ' లక్ష్మీనరసింహ నమో! నమో!!

*- డా॥ సంగీతం కేశవులు, 90146 57722*

ఈనాడు తరిగొండ గ్రామం ఉన్న చోటు 700 సం॥రాల క్రితం దట్టమైన అటవీప్రాంతంగా ఉండేది. ఈ అడవి నడుమ గుట్టలాంటి ప్రదేశం విశాలంగా విస్తరించి ఉండేది. ఆ గుట్టను **'ప్రత్తిమిట్ట'** అనే పిలిచేవారు.

అప్పటి బళ్ళారిసీమ రాయదుర్గాన్ని అచ్యుత గోత్రోద్భ వుడు అయిన రామానాయుడు అనే పాళెగారు పరిపాలిస్తూ ఉండేవారు. ఈ ప్రాంతంలో కరువు రావడంతో తన అనుచరు లతో సకుటుంబంగా బయలుదేరి సురక్షితంగా ఉండే ప్రాంతాన్ని వెతుకుతూ "ప్రత్తిమిట్ట" ప్రాంతానికి చేరుకుంటారు.

ఒకరోజు రామానాయుడి భార్య నరసమాంబ ఒక వెడల్పు కుండను పసుపు, కుంకుమలతో అలంకరించి పూజించి అందులో పెరుగుపోసి, ఒక పొన్నచెట్టు క్రింద కవ్వంతో చిలకడం ప్రారంభించిన వెంటనే రాయిలాంటి వస్తువు కవ్వానికి తగిలి శబ్దం రాగానే, భర్త రామానాయుడికి ఈ విషయం చెప్పగా రామానాయుడు కుండలో తడిమి చూశారు. నున్నటి శిల చేతికి తగిలింది. శిలను శుభ్రం చేసి ఉంచగా, ప్రజలందరికీ వినబడే విధంగా "ఇది నా క్షేత్రం. దీనికి అధిపతి నేను. మిమ్మల్ని కాపాడటానికి ఈ రూపంలో ఇక్కడ అవతరించాను. మీరు అందరూ ఇక్కడే స్థిరపడి, నన్ను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ ఉండండి! మీ కష్టాలు పోతాయి!" ఆ మాటలు విన్నవారు అందరూ భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.

తమిళభాషలో 'తైర్' అంటే పెరుగు. చిలుకుతున్న కుండను 'తరికుండ' అంటారు. అంటే పెరుగుకుండ అని అర్థం. ఈ తరికుండ ప్రజల వాడుక భాషలో క్రమంగా **'తరిగొండ'**గా మార్పు చెందింది.

## తరిగొండ ఆలయనిర్మాణం

రామానాయుడికి లక్ష్మీనరసింహస్వామి కలలో సాక్షా త్కరించి, ఈ విధంగా ఆదేశించాడు. "ఈ ప్రదేశం పురాతన కాలంలో దుర్వాసమహర్షి నన్ను ఆరాదించిన పవిత్రస్థలం. కాబట్టి మీరు అంతా కలసి ఇక్కడ ఆలయాన్ని నిర్మించి కుల దైవంగా నన్ను ఆరాధించండి. గుడి కట్టించడానికి అవసరమైన ధనం ఇక్కడికి సమీపంలోని 'మారేళ్ళగవి'లో లభిస్తుంది." అని చెప్పి మాయమైపోయారు.

కలలో రామానాయుడికి లక్ష్మీనృసింహస్వామి కనపడి తనకు దేవాలయం కట్టించమని ఆదేశించాడు.


## లక్ష్మీనరసింహస్వామి ఆలయం

లక్ష్మీనరసింహస్వామి ఆదేశానుగుణంగా రామా నాయుడు మంచి ముహూర్తంలో సపరి వారంగా మారేళ్ళగవికి వెళ్ళి, దైవానుగ్రహంగా పూజలు,



దేవునికి కానుకలు ఇచ్చి, గవిలో గుప్తంగా ఉన్న నిధిని సేకరించారు.

దుర్వాస మునీంద్రుడు తపస్సు చేసిన చోట ప్రత్తి మిట్టలో పాతబడిన చిన్నగుడి ఉంది. రామానాయుడు ఆ ప్రదేశంలో కొత్త దేవాలయాన్ని నిర్మించాడు. గర్భాలయం, ముఖమండపం, అమ్మవార్లగుడి, ధ్వజస్తంభం, దుర్వాస మహర్షి స్థాపించిన సత్యధర్మయంత్రం మీదే బలిపీఠం, పార్శ్వమండపాలు, ప్రాకారం, మహాద్వారం, గాలిగోపురం మొదలైనవి మనోహరంగా నిర్మించబడినాయి.


శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలోని ఉత్సవమూర్తులు

## స్వామివారి బ్రహ్మోత్సవం

ప్రతి సంవత్సరం శ్రీలక్ష్మీనరసింహస్వామివారికి బ్రహ్మోత్సవాలు ఫాల్గుణమాసంలో జరుగుతుంది. ఈ సంవత్సరం మార్చి 16న అంకురార్పణతో మొదలవుతుంది. 21వ తేది స్వామివారికి గరుడసేవ, 24వ తేది రథోత్సవము. ఆ పై 25వ తేది చక్ర స్నానంతో బ్రహ్మోత్సవం ముగియనుంది.

**STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT**

**SAPTHAGIRI**

**(MONTHLY)**
**FORM IV**
**See Rule 8**

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : TIRUPATI |
| 2. | Periodicity of its Publication | : Monthly |
| 3. | Printer's Name | : **Sri P.Ramaraju,** M.A., |
| | Whether citizen of India | : Yes |
| | Address | : Special Officer, TTD Press Compound K.T.Road, Tirupati. |
| 4. | Publisher's Name | : **Dr.K.Radha Ramana,** M.A.,M.Phil., Ph.D. |
| | Whether citizen of India | : Yes |
| | Address | : Chief Editor Office, TTD Press Compound, K.T.Road, Tirupati. |
| 5. | Editor's Name | : **Dr. V.G.Chokkalingam,** M.A., Ph.D. |
| | Whether citizen of India | : Yes |
| | Address | : Chief Editor Office, TTD Press Compound, K.T.Road, Tirupati. |
| 6. | Name and address of individuals who own the Newspaper and partners or shareholders holding more than one percent of the Total Capital | Tirumala Tirupati Devasthanams |

I, **K. Radha Ramana**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

TIRUPATI,
Date : 29-2-2024.

**(Sd.) Dr. K. Radha Ramana,**
Signature of the Publisher


మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ సన్నిధి

భక్తకవయిత్రి వెంగమాంబ స్వామివారికి పరమ భక్తురాలు. ఈ స్వామిపై సంకీర్తనలు రచించి, పాడి ధన్యురాలైంది. ప్రసిద్ధమైన ఈ క్షేత్రాన్ని దర్శించి, తరించి ముక్తిని పొందుదాం.

ఓం లక్ష్మీనరసింహాయ నమః



# పతంజలి యోగసూత్రములు

– అనువాదకులు:
డా॥ ఈశ్వర వరాహనరసింహము

**సూత్రం-5-**
**ప్రవృత్తిభేదే ప్రయోజకం చిత్తమేకమనేకేషామ్।**

ఒకే చిత్తము అనేక చిత్తములను భిన్నభిన్న ప్రవృత్తి యందు ప్రేరేపించును. ఆ అనేక చిత్తముల యొక్క ప్రవృత్తి నివృత్తులు భేదములు గలవిగా అగపడినను యోగి యొక్క స్వయమైన చిత్తము ఒకే కారణమైనదిగా ఉండును.

ఎట్లనగా, ఒక దేహమునందుండు చిత్తము ఇంద్రియాదులను తన ఇచ్ఛానుసారముగా ఎట్లు ప్రేరేపించునో అట్లే అని భావము.

**సూత్రం-6- తత్ర ధ్యానజమనాశయమ్।**

ఆ అనేక చిత్తములన్నిటికంటే, సమాధిచే గలిగిన చిత్తము కర్మ వాసనారహితమైనది. జన్మ, ఔషధ, మంత్ర, తపాది వలన గలిగిన ఐదువిధములైన చిత్తములకంటే, ఇప్పటి సమాధిచే అనేకములైన చిత్తములై పరిణమించుశక్తిగల చిత్తము కర్మవాసనా రహితమైనదై విలక్షణమైనదై యుండును.

**సూత్రం-7- కర్మాం-శుక్లా-కృష్ణం యోగినస్త్రివిధమితరేషామ్।**

యోగియొక్క కర్మ (నిష్కామ) పాపపుణ్యరహితము. అన్య సాధారణమానవుల కర్మ మూడు విధములుగా ఉన్నది. 1)శుక్లం= పుణ్యకర్మ; 2)కృష్ణం= పాపకర్మ 3)శుక్లకృష్ణం= మిశ్రమమైనది. యోగి యొక్క కర్మ నిష్కామమై విలక్షణమై, సంచితమై నిలువక జ్ఞానాగ్నిచే దహింపబడును.

**సూత్రం-8- తతస్తద్విపాకానుగుణానామేవాభివ్యక్తిర్వాసనామ్।**

ఆ కర్మమువలన ఆయాజాతి దేహముల పరిపాకములను అనుకూలించు నట్టివిగా నుండు సంస్కారములయొక్క ఆవిర్భావము కలుగుచున్నది కర్మ సంస్కార ఫలములు స్మృతి మాత్ర సంస్కార ఫలము లనియును, జాత్యాయుర్భోగ ఫలము లనియును రెండు విధములు. (యోగ, 2 పా 3 సూ) మొదట మనుష్యదేహమునందు గలిగిన సంస్కారము మరల మనుష్య దేహము కలిగినప్పుడు అభివ్యక్తమగును. ఆ మనుష్య దేహముల రెండింటి నడుమ కలిగిన ఇతర జాతి దేహముల యందు అది అభివ్యక్తము కాదు. అప్పుడు చిత్తమునందు ఆ సంస్కారములు ఆచ్ఛాదితమై నిలిచి యుండును.

**సూత్రం-9- జాతిదేశకాలవ్యవహితానామప్యానన్తర్యం,**
**స్మృతి సంస్కార యోరేకరూపత్వాత్।**

జాతి, కాలములు ఒకొటికొకటి దూరముగా నున్నను (వ్యవ ధానము), జ్ఞాపకము సంస్కారము ఒకేరీతిగా నుండుట వలన నిరంతరత ఉండదు. మనుష్య జన్మ నుండి మఱల మనుష్య జన్మము వచ్చుటకు జాతి, దేశ, కాలములవల్ల ఆలస్యమైనను, స్మృతి సంస్కారములు ఏకరస మగుట చేత తిరిగి అభివ్యక్తమగును. మధ్యను వచ్చు ఇతర దేహము లందలి అభివ్యక్తము కావు. మొదట ఒకనికి మనుష్యదేహము కల్గి, ఆ కర్మ తీరిన తర్వాత వాని సంచిత కర్మానుగుణముగా వేర్వేరైన పశు పక్ష్యాది దేహములు వచ్చెను. తర్వాత మఱల మనుష్య దేహములు వచ్చినపుడు మొదటి మనుష్యదేహ సంబంధమైన స్మృతి సంస్కారములు అభివ్యక్తములగును.

108 దివ్యదేశాలు

# తేరళున్దూర్

## (తిరువళున్దూర్)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

శ్లో॥ దివ్యే దర్శన పద్మినీ తటగతే శ్రీమత్యళందూర్ పురే
రాజ త్యామరువి ప్రభు ర్గరుడ ఇత్యాఖ్యే విమానే స్థితః
ప్రాప్త శ్శైంగమలోప పూర్వలతికాం ప్రాచీముఖ స్సహ్యాజా
ధర్మశ్రీ వసురాజ సేవిత వపు శ్శ్రీమత్కలిఘ్న స్తుతః॥

దేవదేవుడు వేంచేసియున్న 108 దివ్యతిరుపతులతో 'తేరళున్దూర్' అనే దివ్యదేశం విరాజిల్లుచున్నది. 'కృష్ణారణ్యం' అని కూడ ఈ దివ్యదేశానికి మరొక పేరు కలదు. కుంభకోణం నుండి మయిలాడుత్తురై వెళ్ళేమార్గంలో, కావేరీనదీతీరంతో అద్భుతమైన ప్రకృతిరామణీయకతతో, మూడుప్రాకారములతో, ఒక పెద్ద గోపురంతో విరాజిల్లుచున్న ఈ దివ్యక్షేత్రం విష్ణుపురాణం మరియు తమిళ సంఘగ్రంథాలలో, ఆళ్వారుల పాశురములలో ఉల్లేఖించబడింది.

**విశేషాంశములు**

| | |
|---|---|
| దివ్యదేశం పేరు | : తేరుళున్దూర్ లేదా తిరువళున్దూర్ |
| సంస్కృతనామం | : రథమగ్నపురీ |
| మార్గం | : తమిళనాడు కుంభకోణం నుండి మయిలాడుత్తురై వెళ్లేమార్గం |
| నది | : కావేరి |
| మూలమూర్తి | : దేవాధిరాజన్- తూర్పు ముఖం |
| ఉత్సవమూర్తి | : గోసఖన్ |
| అమ్మవారు | : శంగమలవల్లీ / రక్తపద్మ |
| విమానం | : గరుడ |
| పుష్కరిణి | : దర్శపుష్కరిణి |
| విశేషం | : ప్రసిద్ధ తమిళకవి 'కంబర్' జన్మస్థలం |
| కీర్తించిన ఆళ్వార్లు | : తిరుమంగై ఆళ్వార్లు |




ఈ దివ్యదేశ మూలమూర్తి దేవాధిరాజన్ అను తిరు నామంతో, తూర్పుముఖంగా నిలుచున్న భంగిమలో దర్శన మిస్తున్నారు. మూలవర్ల కుడిప్రక్కన గరుడాళ్వార్, ఎడమ ప్రక్కన ప్రహ్లాదాళ్వార్లు స్వామిని నమస్కరించే భంగిమతో వేంచేసి యున్నారు.

ఉత్సవమూర్తి 'గోసఖన్' అనేపేరుతో, తమిళంలో 'ఆమరువిలప్పన్' అనే నామంతో కీర్తింపబడుచున్నారు. అమ్మ వారు శంగమలవల్లీ, రక్తపద్మ అనే పేరుతో ప్రత్యేకసన్నిధిలో కొలువు తీరియున్నారు. ఈ దివ్యదేశానికి సంస్కృతంలో "రథమగ్నపురీ" అనే పేరు. గారుడవిమానం, స్థలతీర్థం– దర్శపుష్కరిణితో ఈ దివ్యదేశం అలరారుచున్నది.

ముఖ్యమైన విషయం ఏమిటంటే– తమిళ మహా కవియైన, రామాయణాన్ని రచించిన "కంబర్" అనే కవి పుట్టిన ప్రదేశము ఇది. ఆ మహాకవి ఈ స్వామికి నమస్కరించి, శ్రీరామాయణాన్ని రచించెనని ఒక ఐతిహ్యం. వీరికి కూడ ఒక ప్రత్యేక సన్నిధి కలదు.

అలాగే ఈ దివ్యదేశంలో ఈ రామచంద్రుడు, యోగ నృసింహస్వామి, హనుమంతుడు, ఆళ్వారులు, ఆచార్యుల మరియు నిగమాంత మహాదేశికన్ అందరూ ప్రత్యేకసన్నిధిలో వేంచేసియున్నారు.

ఈ దివ్యదేశానికి పలు స్థలపురాణాలు కలవు.



కుండలలో వెన్న సిద్ధం చేయదలచాడు. ఎంత చేసిననూ 999 కుండలలో మాత్రమే వెన్న సమకూరెను. ఎవరూ చూడరని భావించి, 1000 కుండ ఖాళీగానే భగవంతుడికి నివేదించెను. సర్వజ్ఞుడైన ఆ గోసఖుడు విషయాన్ని గ్రహించి, 999 కుండలలో ఉన్న వెన్ననంతా అదృశ్యమొనర్చెను.

పిదప, ఆ ఉపరిశ్రవస్సు తన తప్పిదాన్ని గ్రహించి, ఆ గోసఖుణ్ణి శరణాగతి వేడగా, స్వామి అనుగ్రహంచేత తనకు ముక్తికలిగి మనోవాంఛ సిద్ధించింది.

ఇప్పటికి కూడా తమిళ **'తైనెల'** అమావాస్యనాడు ఈ ఐతిహ్యాన్ని పురస్కరించుకుని 1000 కుండలతో ఈ స్వామికి నవనీతమును నివేదిస్తారు. ఆమరువిలప్పన్ గరుడవాహనారూఢుడై ఆ రోజు భక్తులను అనుగ్రహిస్తున్నాడు.

## స్థలపురాణం

**1)** ఉపరిశ్రవస్సు అనే ఒక రాజు తన తపశ్శక్తితో పైలోకంలో కూడ తన రథాన్ని సంచరింపజేసే శక్తిసామర్థ్యం గలవాడు. ఒక సమయంలో దేవతలకు, మునులకు వివాదం ఏర్పడగా, ఆ వివాదానికి మధ్యస్థుడిగా ఉన్నటువంటి ఉపరిశ్రవస్సు తగిన న్యాయాన్ని చేయలేకపోగా, అతడు పై లోకంలో తన తేరులో సంచరిస్తుండగా, మునులు అతని యొక్క తేరు భూమిలో కూరుకుపోయేటట్లు శాపం ఇచ్చారు. ఆ శాప ఫలితంగా కృష్ణారణ్యక్షేత్రంలో, దర్శపుష్కరిణిలో ఉపరిశ్రవస్సు తేరు కూరుకునిపోయినది. అందువల్ల తేరు కూరుకున్న స్థలం గనుక ఈ ప్రదేశానికి **'తేరళున్దూర్'** అను అన్వర్థనామము వచ్చినది.

**2)** ఈ కృష్ణారణ్యక్షేత్రంలో భగవంతుడు గోవులను మేపుచున్న సందర్భంలో, ఆకాశంలో తన తేరులో సంచరిస్తున్న ఉపరిశ్రవస్సు ఈ క్షేత్రాన్ని, క్షేత్రాధీశుణ్ణి అహంకారంతో నమస్కరించకపోవడం వలన, గోసఖుడైన భగవంతుడు తన పాదాంగుళితో తేరు యొక్క నీడను పట్టి లాగి, దర్శపుష్కరిణిలో కూరుకుపోయే విధంగా చేసెను. ఉపరిశ్రవస్సు తన తప్పును తెలుసుకొని, ఇచట తపస్సు చేస్తున్న అగస్త్యమునిని ప్రార్థించి, ఆయన ఉపదేశం ద్వారా, క్షేత్రాధిపతి అయిన ఆ గోసఖుడైన పరమాత్ముని సేవించి, విముక్తి పొందవచ్చు అని తెలుసుకుని, అప్పటికి కూడా తన గర్వాన్ని వీడనందున విముక్తి పొందక, పరమాత్ముని శరణువేడగా– 'సహస్ర కలశాలతో వెన్న నివేదన చేస్తే ముక్తి పొందవచ్చు' అన్న ఆ దేవదేవుని ఆదేశం మేరకు

**3)** ఈ కోవెలకు పశ్చిమాభిముఖంగా వేంచేసిన, వేదపురీషుడు అను పేరుగల శివుడు ఒకనాడు గోసఖునితో ద్యూతక్రీడ ఆడుచుండగా, పార్వతీ తన అన్న అయిన గోసఖునికి క్రీడలో సహకరించదని గ్రహించిన శివుడు, కోపోద్రిక్తుడై తనను పశువుగా మార్చెను. ఆనాటి నుండి గోరూపమును ధరించిన పార్వతి ఈనాటికీ ఈ క్షేత్రంలో గోసఖుడైన ఆ పరమాత్ముని సన్నిధిలో గోసఖుణ్ణి ఆశ్రయించి ఉన్నది. ఇలా ఎన్నో స్థల పురాణాలతో ఈ దివ్యదేశం అలరారుచున్నది.

తిరుమంగైఆళ్వారులకు భగవంతుడు గోసఖుడిగా సాక్షాత్కరించారు. అంచేత తిరుమంగైఆళ్వారులకి భగవంతుని ఊరేగింపు సమయంలో ప్రత్యేకమైనటువంటి మర్యాదలు గలవు.

ఆనాటినుండి నేటివరకూ చక్కగా పాశురములతో ఈ స్వామిని అత్యంత అనురాగ భక్తి విశేషాలతో కీర్తించిన తిరుమంగైఆళ్వారులు ఇక్కడ భక్తులకు దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్నారు.

ఇట్టి వైభవాన్ని కలిగిన **శంగమలవల్లీ** అమ్మవారితో వేంచేసియున్న **గోసఖుడిని** దర్శించడంచేత భక్తులు సకల సౌభాగ్యాలను పొంది తరించగలరని మహాత్ముల మాట.

# శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు - 2024




సనాతన హైందవ ధర్మాన్ని పరిరక్షించే విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ముందంజలో ఉంది. అందులో భాగంగా తిరుమల ఆస్థానమండపంలో మూడురోజుల పాటు (03-02-2024 నుంచి 05-02-2024 వరకు) శ్రీవేంకటేశ్వరధార్మిక సదస్సు వైభవంగా జరిగింది.

మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా తొలుత శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి, హారతి సమర్పించి, ఆ పై జ్యోతి ప్రజ్వలనతో ధార్మికసదస్సు ప్రారంభించబడింది. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయానికి చెందిన వేదపండితులు వేదస్వస్తి నిర్వహించారు.

అనంతరం తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., కార్యక్రమ సందర్భ పరిచయం చేశారు.

ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం జీయర్ స్వాములు శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి వారితో పాటు సదస్సుకు పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామీజీలు విచ్చేశారు.

ఈ సందర్భంగా స్వామీజీల అనుగ్రహభాషణములు, సదస్సు తీర్మానాలను 31వ పుట నుండి 39వ పుట వరకు 'సప్తగిరి' పాఠకులకు అందిస్తోంది.









తిరుమల తిరుపతి దేవస్థానములు



తిరుమల ఆస్థానమండపంలో
మూడురోజుల పాటు
03-02-2024 నుంచి 05-02-2024 వరకు
జరిగిన '**శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు-2024**'

తిరుమల ఆస్థానమండపంలో
మూడురోజుల పాటు
03-02-2024 నుంచి 05-02-2024 వరకు
జరిగిన 'శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు-2024'



# శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు - 2024

శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు ముగింపు కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వాములు ధర్మకర్తలమండలి అధ్యక్షులు గౌ॥ శ్రీ భూమన కరుణాకరరెడ్డి, కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., తి.తి.దే. జే.ఈ.ఓ శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., అప్పటి జే.ఈ.ఓ. శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., గారలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్న దృశ్యమాలిక.











# 2024, ఫిబ్రవరి 3 నుండి 5 వరకు జరిగిన శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు- స్వామీజీల అనుగ్రహభాషణం



**తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి**

తి.తి.దే. దేశవ్యాప్తంగా గల పీఠాధిపతులు, మఠాధిపతులను ఆహ్వానించి శ్రీవారి పాదాల చెంత ధార్మిక సదస్సు నిర్వహించడం ఎంతో సంతోషకరం. స్వామీజీలు ఆయా సంప్రదాయాల్లో ధర్మప్రచారం చేస్తున్నారు. వారి విలువైన సూచనలు తీసుకుని తి.తి.దే. మరింతగా ధర్మప్రచారం చేయాలని ఆకాంక్షిస్తున్నాను.



**తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి**

ఈ ధార్మికసదస్సులో ఇంత పెద్ద సంఖ్యలో స్వామీజీలు పాల్గొనడం శుభసూచకం. పూర్వయుగాల్లో యజ్ఞయాగాది క్రతువులు చేస్తే మోక్షం లభించేది. కలియుగంలో నామ సంకీర్తనలు చేస్తే చాలు భగవంతుని కృప తప్పక కలుగుతుంది. భగవన్నామ స్మరణతో భక్తులు తమ కష్టాలను దూరంచేసుకొని, ముక్తిమార్గం వైపు పయనించవచ్చు.

## మొదటి రోజు - 03-02-2024



**01) శ్రీశుశ్రూశానందమాతాజీవారి శిష్యురాలు మాతాశివానందసరస్వతి చైతన్య తపోవనం, తేనేపల్లి**

తి.తి.దే. హిందూ ధర్మప్రచారపరిషత్ ద్వారా అనేక ధార్మికకార్యక్రమాలను నిర్వహిస్తోంది. సనాతనధర్మాన్ని ఆచరించనివారి బాగుకోసం ధార్మికసదస్సులు ఇంకా కొన సాగాలి. హిందూధర్మం గురించి మంచి సందేశాలు ఇవ్వ గలిగేలా ధార్మికసమావేశాలు నిర్వహించాలి. ఆయా ప్రాంతాల్లో ధార్మిక కార్యక్రమాలను విస్తృతం చేయాలి. బాల, బాలికలకు, యువతకు సనాతనధర్మం గురించి తెలిపేలా తి.తి.దే. సహ కారంతో కార్యక్రమాలను నిర్వహించాలి.



**02) శ్రీసస్వరూపానందగిరి స్వామీజీ, శ్రీలలితా పీఠం, శ్రీనివాసమంగాపురం**

తిరుపతి నుంచే గోవిందనామస్మరణ, పవిత్రత ఏర్పాటుకు తి.తి.దే. కృషి చేయాలి. తిరుమల తరహా గోవిందనామస్మరణ తిరుపతి, శ్రీనివాస మంగాపురం, అలివేలుమంగాపురం, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల నుంచే మొదలు పెట్టాలి.



**03) శ్రీవిద్యాశ్రీషతీర్థస్వామి, వ్యాసరాయ మఠం**

భారతదేశంలో ధర్మసంస్థాపన తిరుమల క్షేత్రం మూలంగా జరుగుతోంది. తిరుమల తిరుపతి దేవస్థానములు ఇప్పటికే సుందరకాండము, గీతాపారాయణం వంటి అనేక కార్యక్రమాలతో హైందవ భక్తి చైతన్యాన్ని ఎంతో ఉత్తేజితంగా ముందుకు తీసుకువెళుతోంది. గోసంరక్షణను కూడా అత్యద్భుతంగా చేస్తున్నారు.



**04) శ్రీశివానందస్వామి, శైవక్షేత్రం, తాళ్ళ పాలెం, గుంటూరు**

తి.తి.దే. చేస్తున్న సేవాకార్యక్రమాలు గ్రామస్థాయికి వెళ్ళేందుకు మరింత విస్తృత ప్రచారం చేయాలి. తి.తి.దే. గోశాల ఏర్పాటు ద్వారా ధర్మ ప్రచారం చేయాలి. ప్రతి జిల్లాకు గోశాల, గో అంబులెన్స్‌లు, ప్రతిజిల్లాలో గురుకులాలు ఏర్పాటు చేయాలి.



**05) శ్రీస్వాత్మానందేంద్రసరస్వతిస్వామి, విశాఖ శారదాపీఠం, విశాఖపట్నం**

తి.తి.దే. ధార్మికసూక్ష్మాలపట్ల యువతను చైతన్య పరిచి, వారి జీవనాన్ని ధార్మిక జీవనం వైపు అడుగులు వేసేలా చేయాలి. ఎస్వీబీసీద్వారా ప్రచారం, గోసంరక్షణ జరగాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ద్వారా ప్రచారం చేసేలా తి.తి.దే. సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకోవాలి. ధర్మ ప్రచారాన్ని యూనివర్సిటీలద్వారా ముందుకు తీసుకెళ్లాలి. ప్రతి దేవాలయంవద్ద ఆ పరిసరప్రాంతంవారికి అర్చకత్వంపై శిక్షణ ఇప్పించే కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలి.



**06) శ్రీప్రకాశానంద సరస్వతిస్వామి, శ్రీజ్ఞాన సరస్వతీపీఠం, పరమానంద ఆశ్రమం, విజయవాడ**

వసుధైక కుటుంబ ఆవశ్యకతను గుర్తించాలి. రాగద్వేషాలకు అతీతంగా ఉండాలి. భగవద్గీతను అర్థతాత్పర్యంతో ప్రత్యేకశిక్షణ ద్వారా అందరికీ బోధించాలి. గురుకులాలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేయడానికి తి.తి.దే. చర్యలు తీసుకోవాలి.




**07)శ్రీవిశ్వయోగి విశ్వంజీస్వామీజి, గుంటూరు**

తి.తి.దే. ధార్మికసేవా కార్యక్రమాలు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయి. తిరుమల ఆనందనిలయంలో కొలువైన శ్రీనివాసుడు శ్రీ, భూ.. అనగా జ్ఞానశక్తి, క్రియాశక్తి రూపంలో విశ్వమంతా పాలించడం జరుగుతుంది. ప్రపంచంలో భారతదేశం శక్తివంతం అవుతుంది. ప్రపంచానికి సనాతనధర్మాన్ని తీసుకెళ్లడానికి తిరుమలనుంచి తి.తి.దే. కృషి చేయాలి.




**08) శ్రీశివదర్శనం మాతాజీ, ప్రొద్దుటూరు**

సనాతన హిందూధర్మం ప్రతి ఒక్కరిలో వెలికి తీయడానికి ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు అవసరం. నిరంతరం ఇవి కొనసాగాలి. తిరుమల శ్రీవారిదర్శనానికి వేచి ఉన్న సమయంలో భక్తులకు లిఖిత జపం చేసుకునేలా ఆధ్యాత్మిక పుస్తకాలు, గ్రంథాలను అందుబాటులో ఉంచాలి. పాఠ్యాంశాల్లో ధర్మసంస్థాపన గురించిన విషయాలపై అవగాహన కలిగే విధంగా రూపొందించాలి.



**09) శ్రీదేవనాథరామానుజజియ్యర్‌స్వామీజీ, శంషాబాద్**

తిరుమల దివ్యక్షేత్రంలో ధ్యానమందిరాలు ఏర్పాటు చేయాలి. స్వామివారి దర్శనం ప్రయాణం తరహాలో కాకుండా గోవిందనామ స్మరణ, భక్తిభావన పెరిగేలా ధ్యానకేంద్రాలు ఎంతో అవసరం. ఎస్వీబీసీ యూట్యూబ్ ఛానల్ ద్వారా చిన్న చిన్న కార్యక్రమాల్ని సమాజంలోకి తీసుకెళ్లాలి. శ్రీవారిసేవ కార్యక్రమంలో విద్యార్థుల్ని భాగస్వాములుగా చేయాలి. ఆలయవ్యవస్థద్వారా జ్ఞానం, సేవ గ్రామస్థాయికి తీసుకెళ్లడానికి తి.తి.దే. కృషి చేయాలి.



**10) శ్రీరామచంద్ర రామానుజ జీయ్యర్, భీమవరం**

ధార్మికసదస్సు నిర్వహిస్తున్న తి.తి.దే. ద్వారా అనేక మంచికార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆధ్యాత్మికతతో కూడిన విద్యఅవసరం. సంస్కార వంతమైన జీవితమే ధన్యమైనది అవుతుంది. అదే అందరిని వృద్ధిలోకి తేవడానికి దోహదపడుతుంది. సంస్కృతం, వేదాన్ని ప్రోత్సహిస్తోన్న తి.తి.దే. ద్రవిడ వేదాన్ని కూడా ప్రోత్సహించాలి.




**11) శ్రీవిరజానందస్వామి, బ్రహ్మంగారి మఠం, కడప**

ధర్మప్రచారాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి. భజన మండళ్ల ద్వారా పిల్లలకు భగవద్గీత, సంస్కృతం నేర్పించాలి. భజనల్లో పిల్లలను భాగస్వాములను చేయాలి. శ్రీరాముడు, శ్రీవేంకటేశ్వరుడి తత్త్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తి.తి.దే. కృషి చేయాలి.



**12) శ్రీస్థితప్రజ్ఞానంద సరస్వతిస్వామి, ఉత్తరకాశీ**

ప్రతి పౌరుడు హిందూ సంస్కృతిని, సంప్రదాయాలను గౌరవించాలి. ప్రతి సంవత్సరం తి.తి.దే. ఈ తరహా ధార్మికసదస్సు నిర్వహించాలి. బాల బాలికలను బాల్యం నుంచే సనాతన ధర్మంవైపు నడిపించాలి.



**13) శ్రీపరిపూర్ణానందస్వామి, వ్యాసాశ్రమం, ఏర్పేడు**

మారుమూల ప్రాంతాల్లోనూ ధర్మప్రచారం జరగాలి. భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలవడానికి ధర్మమే కారణం. తి.తి.దే. వినూత్న ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయం.



**14) శ్రీహరితీర్థానంద స్వామీజీ, నెల్లూరు**

తి.తి.దే. మానవుల్లో ధర్మబీజాలను నాటాలని దృఢసంకల్పం చేయడం అభినందనీయం. భక్తులు తి.తి.దే.కి ఇస్తున్న ఆస్తులకు రక్షణకల్పించి, ధార్మికకార్యక్రమాలకు వినియోగించాలి. తి.తి.దే. కల్యాణమండపాలు ఖాళీగా ఉన్న రోజుల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలి.



**15) శ్రీసత్యానందభారతిస్వామి, చిదానంద ఆశ్రమం, గన్నవరం**

తి.తి.దే. ద్వారా ధార్మికకార్యాలు పెద్దఎత్తున కొనసాగించాలి. ధర్మప్రచారపరిషత్ కార్యక్రమాలు రాష్ట్రానికే పరిమితం కాకుండా విశ్వవ్యాప్తం కావాలి. తి.తి.దే. ఇలాంటి సదస్సులను కొనసాగించాలి. తీర్మానాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి.

### 16) శ్రీరమ్యానందభారతిమాతాజీ, శ్రీశక్తిపీఠం, రాయలచెరువు



భారతదేశాన హిందూమతం ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తోంది. హిందూసనాతన ధర్మాన్ని ప్రచారంచేయడంలో ఎస్వీబీసికు ప్రత్యేకస్థానం ఉంది. తి.తి.దే. ధర్మప్రచారకార్యక్రమాలను డిజిటలైజ్ చేసే దిశగా ముందుకు సాగాలి, చిన్నపిల్లలను దృష్టిలో ఉంచుకుని ధార్మిక కార్యక్రమాలను రూపొందించి, వారిలో నైతిక విలువలను పెంపొందించి వారిని నిజమైన భారతపౌరులుగా తీర్చిదిద్దాలి.

### 17) శ్రీఅష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, విజయవాడ



తి.తి.దే.లో చాలామంది ఆగమ, పురాణ, వేదపండితులు ఉన్నారు. వారి సేవలు ధర్మప్రచారానికి ఉపయోగించుకోవాలి. స్వామివారి దర్శనానికి వెళ్లేటప్పుడు సాధారణ భక్తులు కూడా సంప్రదాయదుస్తులను ధరించాలని తి.తి.దే. సూచించాలి.

### 18) శ్రీసచ్చిదానందసరస్వతిస్వామి, తపోవనం, తుని



పుస్తకప్రసాదం పంపిణీని పటిష్టం చేసి, విస్తృతం చేయాలి. వేదపండితులకు ప్రోత్సాహకాలను పెంచడం శుభపరిణామం. తి.తి.దే. మారుమూల ప్రాంతాల్లో భజనలు, భక్తికార్యక్రమాలను పెంచాలి.

### 19)డా॥గౌరీశంకర్‌స్వామి,శృంగేరిపీఠంప్రతినిధి



వేదపాఠశాల స్థాయిని ఉన్నతీకరించాలి. విదేశాలకు వెళ్ళినా గుర్తింపు, విలువ కలిగిన సర్టిఫికేట్స్ జారీ చేయడానికి తి.తి.దే. చర్యలు తీసుకోవాలి. అన్యమతస్తులుగా మారి తిరిగి హిందువులుగా మారేందుకు ముందుకు వచ్చే వారిని స్వాగతించడానికి తి.తి.దే. విధివిధానాలు రూపొందించాలి. ఆలయాలు, ఆశ్రమాలు, మఠాలకు ఉపయోగపడే సాఫ్ట్‌వేర్‌ను చేయడానికి తి.తి.దే. కృషి చేయాలని కోరారు.

### 20) శ్రీచల్లావిశ్వనాథశర్మస్వామి, శ్రీకంచీకామకోటిపీఠం



తి.తి.దే. ఓరియంటల్ కళాశాలలో పురాణాలపై పరిశీలన చేసి, హైందవసనాతన ధర్మవ్యాప్తికి కృషి చేయాలి.

### 21) శ్రీరాఘవులుస్వామి, విశ్వహిందూపరిషత్ అంతర్జాతీయ కార్యదర్శి



పారాయణాల్లో మహిళల్ని భాగస్వాములను చేయాలి. ప్రచారకులను అన్ని ప్రాంతాలకుపంపి ధర్మప్రచారంచేయాలి. మతమార్పిడుల నివారణకు చర్యలు తీసుకోవాలి. యువత, బాలల్లో ధార్మిక ప్రచారంకోసం ఒక్కో స్వామీజీ ఒక్కో జిల్లాను దత్తత తీసుకోవాలి.

## రెండవ రోజు - 04-02-2024

### 01) శ్రీవెదురుపాక స్వామీజీ, విజయదుర్గ పీఠం



తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుమలలో సామాన్య భక్తులుకు ఎన్నో సౌకర్యాలను కల్పించారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇచ్చే దిశగా దృష్టి సారించడం మంచి పరిణామం. భవిష్యత్తులో కూడా ఇదే తరహాలో తి.తి.దే. సామాన్యభక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి.

### 02) శ్రీసుజయనిధితీర్థస్వామి, శ్రీపాదరాయ మఠం, ముళబాగల్



తిరుమల తిరుపతి దేవస్థానంకు భారత దేశంలో ప్రత్యేకమైన స్థానంలో ఉంది. సనాతన ధర్మంలో ప్రతి ఒక్క పీఠాధిపతిని భాగస్వామిని చేయాలి. దేశంలోని ప్రతి ఇంటికీ సనాతన హిందూధర్మం, ఆచారాలు, సంప్రదాయాల గురించి తెలియపరచడానికి కృషి చేయాలి.

### 03) శ్రీముకుందానందమహరాజ్, జ్యోతిర్మఠం, ఉత్తరాఖండ్



తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మ ప్రచారపరిషత్ ద్వారా సనాతనధర్మంగురించి చాలా కార్యక్రమాలు చేబడుతోంది. సనాతనధర్మం అంటే కేవలం మనుషులు మాత్రమే కాక పశుపక్ష్యాదులు, వృక్షాలు, జంతువులు సమస్తం సుభిక్షంగా ఉండడం. ఆధునిక విద్యలో మన సనాతన హిందూధర్మం, సంస్కృతి సంప్రదాయాల గురించి అందరికీ తెలియపరచాలి. గోమాతను విశ్వమాతగా ప్రకటించాలి.



### 04) శ్రీవిద్యావల్లభతీర్థస్వామి, కాణియూరు మఠం, ఉడుపి.

తి.తి.దే. సనాతన సంప్రదాయాన్ని నిలిపేందుకు మరిన్ని కార్యక్రమాలు చేయాలి. పిల్లల్లో నైతికత పెంచే కార్యక్రమాలు సంతోషకరం. గుడికో గోమాత కార్యక్రమం విజయవంతం కావడం ఆనందం. దాస సాహిత్యం ఉన్నతస్థాయిలో ప్రచారం కావడానికి తి.తి.దే. కృషి విశేషం. వేద అధ్యయనం చేస్తున్న విద్యార్థులకు మరింతగా ఆర్థికసహాయం చేయాలి.



### 05) శ్రీమన్నార్‌గుడి సెందలంకార శెన్నగ మన్నార్‌జీయర్ స్వామి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో జరుగుతున్న మతమార్పిడులను నివారించడానికి తి.తి.దే. కృషి చేయాలి. ప్రపంచవ్యాప్తంగా హిందూ ధర్మప్రచారం, గోసంరక్షణ కోసం తి.తి.దే. పని చేయాలి. వైద్య, విద్యాసంస్థల్ని మరింత విస్తృతం చేయాలి.



### 06) శ్రీవిద్యావిజయతీర్థస్వామి, బెంగళూరు

దాససాహిత్యప్రచారం బాగా జరుగుతోంది. తి.తి.దే. 27 ప్రాజెక్టుల ద్వారా అనేక హిందూధర్మకార్యక్రమాలు నిర్వహిస్తోంది. ధార్మిక, సాంస్కృతిక, విద్య, వైద్యసేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషం. సాహిత్యం, శిల్పకళాశాస్త్రం, సంగీతశాస్త్రం అన్నింటిలో ప్రత్యేక కృషి చేస్తోంది. తి.తి.దే. వేదపరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.

'సప్తగిరి' మాసపత్రికను పలు భాషల్లో ప్రచురిస్తున్నారు. ఇలాంటి పలు కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరుతున్నాం.



### 07) శ్రీఅనుపమానంద మహరాజ్, రామ కృష్ణసేవాసమితి, కడప

తి.తి.దే. భవిష్యత్‌తరాలకు ధర్మాన్ని అందించడానికి మరిన్ని మెరుగైన ప్రయత్నాలు చేపట్టాలి. ధర్మాచరణ పట్ల యువతకు ఆసక్తిని పెంపొందించాలి. సంస్కృతభాషను ప్రోత్సహించాలి. దీనివల్ల భాషతో పాటు సంస్కారం కూడా యువతకు అలవడుతుంది.





### 08) శ్రీకమలానందభారతీస్వామి, భువనేశ్వరి పీఠం, గన్నవరం, విజయవాడ.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు ఆ భగవంతుడు ఇచ్చిన వరం తి.తి.దే. హిందూధర్మప్రచారానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ ధర్మప్రచారపరిషత్ ఇంటింటికీ కరపత్రాన్ని పట్టుకుని వెళ్లి ప్రచారం నిర్వహిస్తోంది. తి.తి.దే. నిర్వహించిన దళితగోవిందం గొప్ప కార్యక్రమం. ఉమ్మడి కడపజిల్లాలో కూడా దళితులు చక్కగా ఈ కార్యక్రమాన్ని స్వాగతించి నిర్వహించుకున్నారు.




### 09) శ్రీరేవతి రమణదాస్‌స్వామి, అంతర్జాతీయ ఉపాధ్యక్షులు, ఇస్కాన్

శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్(ఎస్వీబీసీ) కార్యక్రమాలు చాలాబాగున్నాయి. శ్రీ రామాయణ, భాగవతం సహా పలు కార్యక్రమాలు ఎస్వీబీసీలో ప్రసారం అవుతున్నాయి. దేశవ్యాప్తంగా గోశాలలు ఏర్పాటు చేయాలి. తి.తి.దే. మంచి ధార్మికకార్యక్రమాలు చేస్తున్నారు. తిరుమల తరహాలో తిరుపతి ఇతర ప్రాంతాల్లో గోవిందనామస్మరణ జరగాలి.



### 10) శ్రీవాసుదేవానందగిరి స్వామీజీ, పెద్ద పులిపాక ఆశ్రమం, కృష్ణాజిల్లా

గోసంరక్షణ కోసం తి.తి.దే. చర్యలు తీసుకోవాలి. మాతృమూర్తులు, స్త్రీలను గౌరవించడం, వారిని ధార్మిక కార్యక్రమాల్లో భాగస్వామ్యులను చేయాలి. తి.తి.దే. పాలకమండలిలో ధర్మాచార్యులకు కూడా అవకాశం ఇస్తే సలహాలు, సూచనలకు అవకాశం ఉంటుంది.



### 11) శ్రీసౌందరరాజన్ రంగరాజన్‌స్వామి, చిలుకూరుబాలాజీఆలయం,హైదరాబాద్

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉన్న ఆలయాల్లో ధర్మరక్షణ కోసం అర్చకుల్ని భాగస్వాములను చేయాలి. ఒంటిమిట్ట రామాలయంలో హరిదాసు స్థలపురాణం ఉంది. అక్కడ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, అట్టడుగువర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

తిరుమల తిరుపతి దేవస్థానంలోని దాససాహిత్య ప్రాజెక్ట్, అన్నమాచార్య ప్రాజెక్టులద్వారా నామ సంకీర్తన, భజన

కార్యక్రమాలు విస్తృతం చేయాలి. పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసశిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి.



### 12) శ్రీసుబుధేంద్ర తీర్థస్వామి, శ్రీరాఘవేంద్ర స్వామి మఠం, మంత్రాలయం

హిందూ ధర్మప్రచారం కోసం ప్రపంచ వ్యాప్తంగా తి.తి.దే. కృషి చేస్తోంది. తిరుపతిలో ఉన్న ఆలయాల్లో ధర్మప్రచారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. భగవంతుడికి అందరూ సమానమే.

హిందువులే కాకుండా ఇతరుల్ని కూడా సనాతన హిందూధర్మం ఆచరించే విధంగా చేయాలి. గోవిందనామస్మరణ అన్ని చోట్ల జరగాలి.



### 13) శ్రీశఠగోపన్ రామానుజజీయ్యర్, శ్రీవిల్లి పుత్తూరు, తమిళనాడు

ప్రతి ఒక్కరు మోక్షం పొందాలన్న రామానుజుల ఆలోచన మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం కృషి చేస్తున్నది. నేటి కాలంలో హిందువుల గురించి ఇతరులు చెడుగా మాట్లాడకుండా ఉండడానికి అప్పుడప్పుడు ఇలాంటి సదస్సులు నిర్వహించాలి. మన మందరం ఐక్యంగా ఉండి, మన ప్రజల మధ్య విభేదాలను తొలగించి మన ధర్మాన్ని కాపాడుకోవాలి.



### 14) శ్రీనారాయణజీ మహారాజ్, ద్వారక, శంకరాచార్య మఠం, గుజరాత్

హిందూ సనాతన ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి, రక్షించడానికి పలు పీఠాలకు చెందిన పీఠాధిపతులు, మఠాధిపతులందరూ ఏకం కావాలి. ధర్మప్రచార కార్యక్రమాలు నిర్వహించడంలో తి.తి.దే. ముందు వరుసలో ఉండడం శుభసూచకం.



### 15) శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వామి,శుకబ్రహ్మ ఆశ్రమం, శ్రీకాళహస్తి

శ్రీసూక్తం, శ్రీలక్ష్మి అష్టోత్తరం, ధర్మం వంటి అంశాలను పుస్తక రూపంలో పంపిణీ చేయాలి. సనాతన ధర్మప్రచారం పాఠశాల స్థాయినుంచే చేయడానికి తి.తి.దే. కృషి చేయాలి.



### 16) శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ, కంచి కామకోటి పీఠం

ధర్మప్రచారపరిషత్ కార్యక్రమాలు బాగున్నాయి. ఉత్తరదేశంలోని ప్రాచీన ఆలయాల్లో కూడా ధార్మికప్రచారం జరగాలి. భక్తులు తిలక ధారణ చేయడం ద్వారా హైందవధర్మ వ్యాప్తికి కృషి చేయాలి. తి.తి.దే. తిరుపతిలో వేసిన రోడ్డు నిర్మాణానికి శ్రీశ్రీశ్రీచంద్రశేఖర సరస్వతి మార్గంగా నామకరణం చేయడం ప్రశంసనీయం. మతాంతరీకరణ చెందిన హిందువులను తిరిగి సనాతన హిందూ ధర్మం వైపు తీసుకురావడానికి ఘర్‌వాపసీని (మళ్లీ మన ధర్మంలోకి రావడం) ప్రోత్సహించాలి.



### 17) శ్రీరవిశంకర్ గురూజీ, బెంగళూరు

సనాతనధర్మ వ్యాప్తికి తిరుమల తిరుపతి దేవస్థానం యువతను ధర్మం వైపు నడిపించాల్సిన సమయం ఆసన్నమైంది. ధర్మ పరిరక్షణలో యువత ప్రాధాన్యత ఎంతో ఉంది. పట్టణాలు, గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో జానపదగీతాలు, యక్ష గానం, భజనలు, కీర్తనల ద్వారా విస్తృతంగా ధర్మప్రచారం జరిగేలా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు తీసుకోవాలి. అన్నమయ్య కీర్తనలు, భక్తి గీతాలాపన ద్వారా నాస్తికులు ఆస్తికులుగా మారడానికి అవకాశం ఏర్పడుతుంది.



### 18) శ్రీవిద్యాశంకర భారతిస్వామి, పుష్పగిరి మఠం, కడపజిల్లా

యజ్ఞాలు, పూజాకార్యక్రమాలు, ఆలయాలు పెరుగుతున్నాయి. సంప్రదాయాల పరిరక్షణ కోసం అందరూ పని చేయాలి. తి.తి.దే. అద్భుతమైన ధార్మిక కార్యక్రమాలను చేపడుతోంది. ఈ విషయంలో తి.తి.దే. కృషి చాలా ఉంది. ధార్మికసదస్సులో తీసుకున్న నిర్ణయాలు అమలు పరచాలి.



### 19) శ్రీసత్యాత్మతీర్థస్వామీజీ, ఉత్తరాదిమఠం

'వేదరక్షణ చేస్తే ధర్మపరిరక్షణ' జరుగు తుంది. గోశాల, ఆయుర్వేద, వేదపాఠశాల వంటి ఎన్నోసంస్థలను తి.తి.దే. నిర్వహిస్తోంది. సనాతన హిందూధర్మప్రచారంకోసం పీఠాధిపతుల సహకారం తీసుకోవాలి. ఆలయాల నిర్మాణం, భజనమండళ్ల ఏర్పాటు

ద్వారా మతాంతరీకరణను అడ్డుకోవాలి. ఆధ్యాత్మిక పుస్తకాలు, స్వామివారిఫొటోలు పంపిణీ చేయాలి. పండుగలు, సంప్రదాయాల గురించి పిల్లలకు పరిచయం చేయాలి.



### 20) శ్రీవిద్యాదీశతీర్థస్వామీజీ, పలిమారుమఠం, ఉడుపి

పాఠశాల విద్యార్థులకు ధర్మాన్ని బోధించే విధంగా పాఠ్యాంశాలు ఉండాలి. యోగసాధన విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఉపయోగపడుతుంది. సంస్కృతభాష ద్వారా హిందూసనాతనధర్మ వ్యాప్తి పెరుగుతుంది. సంస్కృతాన్ని అందరికీ నేర్పాలి. సనాతన ధర్మపరిరక్షణలో తిరుమల తిరుపతి దేవస్థానం విశేషంగా కృషి చేస్తోంది.



### 21) శ్రీవిదుశేఖరభారతీతీర్థస్వామీజీ, శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి

ధార్మికచింతనకోసం తిరుమల పుణ్య క్షేత్రంలో ధార్మికసదస్సు నిర్వహించడం సంతోషకరం. సనాతనధర్మానికి హాని కలిగించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. సనాతనధర్మానికి హాని కలిగించడం అంటే తమకు తాము హాని చేసుకున్నట్టే. సనాతనధర్మం వల్లే ప్రపంచశాంతి సాధ్యమవుతుందని వారు గ్రహించాలి. సామాన్య ప్రజలకు కూడా సనాతనధర్మం గురించి మరింత తెలియజేయాలి.



### 22) శ్రీవిజయదత్తానందస్వామీజీ, ఉత్తరాధికారి, దత్తపీఠం, మైసూరు

శ్రీవేంకటేశ్వరస్వామివారు ధర్మస్థాపన కోసమే తిరుమలలో వెలిశారు. వేద-శాస్త్ర సంరక్షణ చాలా అవసరం. గోవిందకోటి రాసిన భక్తులకు స్వామివారి దర్శనం ఆలోచన చాలామంచిది. యువతీయువకులకు ధార్మిక అంశాల్ని వేర్వేరు కార్యక్రమాలద్వారా చేరవేయాలి. దేశవ్యాప్తంగా 5 కోట్ల గీతాపుస్తకప్రసాదపంపిణీ జరగాలి. సామాన్యజనంలోకి ధార్మికకార్యక్రమాలను తీసుకెళ్లాలి.



### 23) శ్రీవణ్ శఠగోప శ్రీరంగనాథయతీంద్ర మహాదేశికన్‌స్వామి, అహోబిలమఠం

వేదాల్లో పేర్కొన్న విషయాలను ప్రచారం చేయాలి. వేదాల్ని రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి. వేదపారాయణానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అదేవిధంగా వేదపండితులను ప్రోత్సహించాలి. తి.తి.దే. హిందూ ధర్మ పరిరక్షణకు ఎంతో కృషి చేస్తున్నది.



### 24) శ్రీసిద్ధేశ్వరానందభారతీతీర్థ స్వామీజీ, మౌనస్వామిమఠం, కుర్తాళం

భారత్ లాంటి హిందూ దేశంలో 75 శాతం జనాభా ఉన్న అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. హిందూ వైభవవికాసంలో తి.తి.దే. పాత్ర గణనీయం. హైందవ ధర్మానికి సమస్య ఎదురైనప్పుడు సన్యాసులు కూడా ఆయుధాలు పడతారు. కానీ ఆ పరిస్థితి రాదు. చాలా మార్పు వస్తోంది. విగ్రహారాధన, ధ్యానం ద్వారా ధర్మప్రచారం జరగాలి.



### 25) శ్రీసుగుణేంద్రతీర్థస్వామీజీ, పుత్తిగెమఠం, ఉడుపి

తిరుమల తిరుపతి దేవస్థానం ధార్మిక సదస్సులాంటి మంచికార్యాన్ని చేపట్టారు. ఇతిహాస పురాణాలు యువత సన్మార్గంలో పయనించడానికి సహాయపడతాయి. మహాభారత, రామాయణం లాంటి ఎన్నో పుస్తకాలు యువతకు మార్గదర్శనం. పిల్లలకు ఇతిహాస పురాణాలను పరిచయం చేయాలి. ఈ విషయాలను తి.తి.దే. కార్యరూపంలోకి తీసుకొస్తుందని ఆశిస్తున్నాను.



### 26) శ్రీయదుగిరి యతిరాజస్వామీజీ, శ్రీయదుగిరియతిరాజమఠం, మేల్‌కోటె

ధార్మికసదస్సు నిర్వహించిన తిరుమల తిరుపతి దేవస్థానంకు మా కృతజ్ఞతలు. తిరుమల తిరుపతి దేవస్థానం ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతోంది. ఈ కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆశిస్తున్నాను.



### 27) శ్రీఈశప్రియతీర్థ స్వామీజీ, ఆదమారు మఠం, ఉడుపి

హిందువులు వేదాలు, ఉపనిషత్తులకు సంబంధించిన జ్ఞానాన్ని పెంచుకోవాలి. ప్రతి ఒక్కరికీ విద్య మహత్యం గురించి తెలియపరచాలి. తిరుమల తిరుపతి దేవస్థానంగ్రామాల్లోని ఇంటింటికీ సనాతన సంప్రదాయాల గురించి తెలియపరచాలి. వేదాలు తెలిసిన వాళ్లను ప్రోత్సహించాలి. అలాగే గో సంరక్షణ, ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రోత్సహించాలి. భగవంతుని అనుగ్రహం ప్రతి ఇంటికీ చేరేలా

కార్యక్రమాన్ని తి.తి.దే. చేపట్టాలి. ఇంతటి మహత్ కార్యాన్ని చేపడుతున్న తి.తి.దే.కు మా ధన్యవాదాలు.



### 28) శ్రీమధురకవివానమామలైజీయర్‌స్వామీజి, నాంగునేరి, తమిళనాడు

సనాతన ధర్మం అందరికీ మార్గదర్శకం. ఎవ్వరూ సృష్టించలేదు. అదేవిధంగా పునర్జన్మ లేదని చెప్పడం మన పద్ధతి. కాబట్టి మనం మన సనాతనానికి కట్టుబడి ఉండాలి.



### 29) శ్రీవరాహ మహాదేశికన్‌స్వామిజీ, శ్రీమత్ ఆండవన్ ఆశ్రమం, శ్రీరంగం


గీతాచార్యుడు మనకు గీతలో జీవించడానికి మంచిమార్గాలను అందించాడు. కాబట్టి గీతను గ్రామ గ్రామానికి తీసుకెళ్లాలి. అలా చేయడం వల్ల మనతో పాటు దేశానికి కూడా మేలు జరుగుతుంది.

ఈ సదస్సును ఏర్పాటు చేసిన తి.తి.దే.కు మంగళా శాసనం తెలియజేస్తున్నాము. *'ప్రజాసేవే మాధవసేవ'*. కావున ప్రజలకు మంచి పనులు చేసి వేంకటేశ్వరస్వామి అనుగ్రహం పొందుదాం.



### 30) శ్రీవిశ్వప్రసన్నతీర్థ స్వామిజీ, పెజావర్ మఠం, ఉడుపి

తి.తి.దే. దాససాహిత్యప్రాజెక్ట్‌ద్వారా భక్తికార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వాడ వాడలకు భక్తి కార్యక్రమాలను విస్తరింపజేయాలి. స్త్రీ, పురుషులు అందరూ దైవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి. యువతకు ధార్మిక సంస్కారాన్ని నేర్పాలి. భగవంతుని స్మరణ జరగాలి. అందుకు తగ్గట్టే పిల్లలకు పేర్లు పెట్టుకోవడం సరైనమార్గంగా సూచిస్తున్నా.



### 31) శ్రీఎంబెరుమాన్నర్‌జియ్యర్‌స్వామి, ఆళ్వార్ తిరునగరి, తమిళనాడు

మనమందరం మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి మరియు పాటించాలి. పురాణాలు, మహాభారతం, రామాయణం మొదలైన మన సనాతన ధర్మాన్ని, మన సంస్కృతిని ప్రతి పల్లెకు తీసుకెళ్లి మంచిమార్గంలో నడవడానికి అక్కడి వారిని తీర్చిదిద్దాలి.

## మూడవరోజు - 05-02-2024



### 01) శ్రీవేదవర్ధన స్వామి, శిరూరు, ఉడుపి

తిరులమ తిరుపతి దేవస్థానం చిన్న పిల్లలకు భగవంతుని పట్ల అవగాహన కల్పించేందుకు ప్రతి ఊరిలో వారానికి ఒకసారి ప్రవచనాలు, ప్రార్థన గురించి తెలపాలి. తి.తి.దే. యువతను సన్మార్గంలో నడిపించి, ధార్మిక కార్యక్రమాలను చేయడానికి కృషి చేయాలి.



### 02) శ్రీపరవకొట్టై చిన్న ఆండవన్ శ్రీశ్రీనివాస గోపాలమహాదేశికన్‌స్వామి, పౌండరీక పురం ఆశ్రమం, శ్రీరంగం

తి.తి.దే. *'సప్తగిరి'* పత్రిక ద్వారా మరింతగా వివరాలు తెలియవస్తున్నాయి. శ్రీనివాసకల్యాణం ద్వారా అందరికీ భక్తిని చాటేలా చేస్తున్నారు. ధర్మప్రచారంలో తి.తి.దే.కి సాటి లేదు.



### 03) శ్రీవిద్యేంద్రతీర్థ స్వామీజీ, చిత్రాపూరమఠం, ఉడుపి

'ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది'. హిందూ సనాతన ధర్మాన్ని అన్నిచోట్లా ప్రచారం చేయాలి. సమాజానికి సేవ చేయడం వల్ల మనకు పుణ్యఫలం దక్కుతుంది.



### 04) శ్రీసదాశివఆశ్రమ స్వామిజీ, వారణాసి

శ్రీవిష్ణుసహస్రనామపారాయణం, సంస్కృత సుభాషితాలు ప్రత్యేకంగా బోధించాలి. పాశ్చాత్యసంస్కృతి పెచ్చరిల్లకుండా చర్యలు తీసుకోవాలి. తిరుమల తిరుపతి దేవస్థానం ధార్మిక, సేవా కార్యక్రమాలను అంతర్జాతీయస్థాయికి విస్తరించాల్సిన అవసరం ఉంది.



### 05) శ్రీసువిద్యేంద్ర తీర్థస్వామి, రాఘవేంద్ర మఠం, బెంగళూరు

తిరుమల తిరుపతి దేవస్థానంవారు వేదపరిరక్షణ చేయవలసిన ఆవశ్యకత ఉంది. 'వేద పరిరక్షణే ధర్మపరిరక్షణ'. గోసంరక్షణ ఆవశ్యకత చాలా ఉంది. ప్రతి గ్రామంలో దేవాలయాలు నిర్మించాలి. సంస్కృత భాష అభివృద్ధికి కృషి చేయాలి.

# శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు తీర్మానాలు

**01) హిందూమతంలో చేరాలనుకునేవారికి పవిత్రజల సంప్రోక్షణ ప్రక్రియ**

ఈ సదస్సుకు వచ్చిన పలువురు స్వామీజీల ఏకకంఠ అభిప్రాయాన్ని అనుసరించి ఇతరమతస్తులు ఎవరైనా స్వచ్ఛందంగా హిందూమతంలోకి మారడానికి శ్రద్ధతో ఇష్టపడి వచ్చే వారికోసం తిరుమలలో ఒకప్రాంగణం ఏర్పాటుచేసి పవిత్రజల ప్రోక్షణంతో విధిపూర్వకంగా ప్రక్రియను నిర్వహించి స్వాగతించాలని, ఒకసారి శ్రీవారిదర్శనం కల్పించాలని సదస్సు తీర్మానించింది.

**02) పురాణ ప్రచారం**

సమాజంలో పిల్లలనుంచి పెద్దలవరకు హైందవ ధర్మాన్ని సరళంగా అందరికీ అర్థమయ్యే విధంగా చెప్పేవి పురాణాలు. కనుక పురాణముల విస్తృత ప్రచారం చేయుటకు అదేవిధంగా సామర్థ్యం కలిగిన పురాణ ప్రవచనకర్తలకు శిక్షణనిచ్చుట అవసరం అని సదస్సు తీర్మానించింది.

**03) తిరుపతిలో పవిత్ర వాతావరణం**

తిరుమల చేరుకోవాలంటే యాత్రికులందరూ తప్పనిసరిగా తిరుపతికి రావలసిందే. కనుక యాత్రికులకు తిరుమలలోలాగే తిరుపతిలో కూడా సంపూర్ణమైన ఆధ్యాత్మిక వాతావరణం, భక్తిభావన కలగాలి. అందుకు తగినట్లుగా తిరుపతిని మార్చాలని సదస్సు తీర్మానించింది.

**04) సమైక్యతా భావం పెంపొందించడం, మతాంతీకరణ నివారణోపాయాలు**

నానాటికీ హిందూ సమాజం బలహీనం కావడానికి కారణం కొన్ని వర్ణ, వర్గాల పట్ల కొందరికి ఉన్న వివక్షతో కూడిన దృష్టి ప్రధానాంశం. అందువలన ఆయా జాతులవారు హిందూసమాజానికి దూరంఅవుతున్నారు. వారినందరినీ కలుపుకుని సనాతన ధర్మం అందరిదీ అని చెప్పడానికి అన్ని విధాలుగానూ ప్రయత్నించాలి. వారి మతాంతీకరణను నివారించుటకు తగిన ఉపాయాలను సిద్ధపరచుకోవాలని సదస్సు తీర్మానించింది.

**05) దేవాలయాల పరిరక్షణ, నిర్మాణం**

భారతీయ సమాజంలో అందరికీ చక్కని సంస్కారాలను నేర్పేవి దేవాలయాలు. అటువంటి దేవాలయాలు వేలాదిగా శిథిలమవుతున్నాయి, కొన్ని ప్రాంతాలలో పూర్తిగా కనుమరుగవుతున్నాయి. కనుక అందరికీ సంస్కారాలందించడానికి శిథిలములైన దేవాలయాలను ఉద్ధరించుట, దేవాలయాలు లేని చోట మరియు హరిజన, గిరిజన, మత్స్యకార ప్రాంతాలలో దేవాలయాలు నిర్మించుట ఎంతగానో అవసరమని సదస్సు తీర్మానించింది. తి.తి.దే.శ్రీవాణిట్రస్టు ద్వారా హరిజన, గిరిజన, మత్స్యకార ప్రాంతాలలో 3600 ఆలయాల నిర్మాణం చేపట్టింది.

**06) గో సంరక్షణ**

హిందూ సమాజం గోవిందుని పట్ల ఎంత భక్తి కలిగి ఉన్నదో గోవు పట్ల కూడా అంతే భక్తి కలిగి ఉన్నది. హిందువులకు గోవు తల్లితో సమానం. కానీ నేటి సమాజంలో ఆధునిక అలవాట్ల ప్రభావం వల్ల గోమాతలు క్షీణించిపోతున్నాయి. కనుక గో సంరక్షణ అత్యావశ్యకతగా సదస్సు తీర్మానించింది.

**07) వేద, శాస్త్ర, విద్యావ్యాప్తి సంరక్షణ**

హిందూ ధర్మానికి మూలం వేదములు, శాస్త్రములు. ఏ యజ్ఞములు చేయాలన్నా, ఏ సత్కర్మలు ఆచరించాలన్నా వేదశాస్త్రాలు ఎంతో అవసరం. కనుక వేదశాస్త్రాల పరిరక్షణ ఎంతో అవసరమని సదస్సు తీర్మానించింది.

**08) సార్వజనీనంగా ధర్మ, ఆచార, సంప్రదాయ ప్రచారం, పరిరక్షణ**

హిందూ ధర్మముల పట్ల, ఆచారముల పట్ల, సంప్రదాయముల పట్ల అందరికీ ఆసక్తి, ఆదరణ, శ్రద్ధ తగ్గడానికి కారణం తగు ధర్మప్రచారం లేకపోవడమే. అందుకోసమై అన్ని విధములుగా అందరికీ అర్థమయ్యే రీతిలో ధర్మాన్ని ప్రచారం చేయడం ఎంతో అవసరం అని సదస్సు తీర్మానించింది.

**09) మాతృమూర్తుల ధర్మనిష్ఠ**

ఏ సమాజంలో తల్లి తన పిల్లలను శ్రద్ధగా పెంచుతుందో ఆ సమాజం ధర్మనిలయం అవుతుంది. కనుక హిందూ సమాజంలో ప్రతి మాతృమూర్తి తన పిల్లలకు బాల్యం నుంచి ధర్మబోధను చేయడానికి తగు విధంగా మాతృమూర్తులకు ధర్మనిష్ఠను కలుగచేసే శిక్షణా కార్యకలాపాలు అవసరమని సదస్సు తీర్మానించింది.

**10) యువతలో ధర్మప్రీతి, ధర్మాసక్తి**

నేటి సమాజంలో హిందూ యువతీ యువకులలో చాలామంది తమ చుట్టూ ఉన్న వాతావరణ ప్రభావంవల్ల, ధనకనకాది ప్రలోభాలవల్ల స్వధర్మాన్ని విడిచిపెట్టి మతాంతరీ కరణకు లోనవుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికై ఎన్నో శిక్షణా శిబిరాలు నిర్వహించడం మరియు ఇతర పథకాలు అవసరమని సదస్సు తీర్మానించింది.

**11) జీవవైవిధ్యపరిరక్షణ**

సహజంగా ఎన్నో అరుదైన వృక్ష జంతుజాతులకు ఆశ్రయమైనది తిరుమల సప్తగిరులు. కనుక ప్రయత్నపూర్వకంగా ఈ తిరుమల వనాలను, తిరుమలలోని వేలాది తీర్థాలను జాగ్రత్తగా పరిరక్షించి తిరుమల, తిరుపతి మరియు నీటి పరిసర ప్రాంతాలను ఒక ప్రత్యేక జీవవైవిధ్యక్షేత్రముగా పరిరక్షించాలి అని సదస్సు తీర్మానించింది.

**12) వివిధసేవలు, సత్సంగం, భజనమండళ్ళు ఇతరబృంద వ్యవస్థలను బలోపేతం చేయడం**

2007, 2008 సంవత్సరాలలో నిర్వహింపబడిన ధార్మికసదస్సుల తీర్మానాలను అనుసరించి హరిజన, గిరిజన, మత్స్యకారులు మతాంతరీకరణము నుంచి నివారించుటకై అమలు చేయుచున్న, ప్రస్తుతము తక్కువస్థాయిలో జరుపబడు తున్న మరియు మధ్యలో నిలిపివేయబడిన ప్రణాళికలన్నిటినీ తిరిగి బలోపేతం చేసుకొనవలెనని సదస్సు తీర్మానించింది.

**13) జనశక్తినిర్మాణం**

ఎన్ని పథకాలున్నా, ఎన్ని ఆలోచనలున్నా సామర్థ్యం కలిగిన కార్యశీలులు లేకపోతే అవి సఫలములు కావు కనుక ప్రతి వ్యక్తిలోని ధర్మపరిరక్షణా సామర్థ్యమును, ఆ ప్రచారానికి తగిన సామర్థ్యమును వీలైనంత ఎక్కువమందికి శిక్షణ ద్వారా నేర్పడం అవసరమని సదస్సు తీర్మానించింది.

**14) ఆధ్యాత్మిక కార్యక్రమాలు**

శారీరకబలం ఎంత అవసరమో మనిషి ఆత్మవిశ్వాసా నికి, ఒడిదుడుకులను తట్టుకోడానికి ఆత్మికబలము కూడా అంతే అవసరం. కనుక హిందూ సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుటకు తగిన శిక్షణా కార్యక్రమాలను విరివిగా నిర్వహించా లని సదస్సు తీర్మానించింది.

**15) ద్రావిడవేద వికాసానికి ప్రణాళికలు**

ఋగ్వేదము మొదలైన వేదముల వలే 12మంది ఆళ్వార్లచే మానవాళి శ్రేయస్సుకోసం అందించబడిన ద్రవిడ వేదమునకు కూడా తగిన ప్రోత్సాహము, గుర్తింపు అవసరమని సదస్సు తీర్మానించింది.

**16) పాఠశాల విద్యార్థులకు కార్యక్రమాలు, ఉపాయాలు**

వివిధపాఠశాలల్లో ప్రస్తుతం అమలులో ఉన్న పాఠ్య ప్రణాళికలలో హిందూ ధర్మ ప్రాధాన్యతకు పెద్దపీట వేయాలని, ఇందుకై మరిన్ని ధర్మప్రబోధకములైన ప్రణాళికలు అవసరమని సదస్సు తీర్మానించింది.

**17) భాషాసామర్థ్యం**

తెలుగు, సంస్కృతం హిందూ ధర్మానికి సంబంధించిన అన్ని విధాలైన అంశాలు తెలుగులోనో, సంస్కృతంలోనో ఎక్కువగా ఉన్నవి. వీటిని అర్థం చేసుకోవలెనన్నా, ఆచరించ వలెనన్నా ఈ రెండు భాషల పరిజ్ఞానము బాలబాలికలకు, యువతీ యువకులకు అవసరమని వారందరికీ ఆ రెండు భాషలు నేర్పవలెనని సదస్సు తీర్మానించింది.

**18) సామాజిక ప్రచారమాధ్యమము**

నేటి సమాజంలో ఏవిషయమైనా ప్రతి ఒక్కరినీ చేరా లంటే సామాజిక ప్రచారమాధ్యమాలు ఎంతో ప్రధానపాత్రను పోషిస్తున్నాయి. కనుక హిందూ ధర్మాన్ని ప్రచారంచేయుటకు కూడా అన్నివిధాలా ప్రచార, ప్రసారమాధ్యమాలను వినియో గించుకోవాలని సదస్సు తీర్మానించింది.

**19) ధార్మికసంస్థలన్నీ ఏకీకృతం కావాలి, తి.తి.దేతో కలిసి ఇటువంటి ధార్మిక సదస్సులను నిర్వహించుటలో సహకరించాలి.**

హిందూ ధర్మరక్షణకై ఈ సదస్సు ఎంతగానో దోహద పడుచున్నదని ఇటువంటి సదస్సులు ప్రతి సంవత్సరానికి ఒకసారి తిరుమలలో లేదా తిరుపతిలోనైనా జరగాలి. అలాగే గ్రామస్థాయిలోను, జిల్లాస్థాయిలోను కూడా నిర్దిష్టకాల పరిమితిలో తరచూ నిర్వహించాలని సదస్సు నిర్ణయించింది. ఈ సదస్సులో తీసుకున్న తీర్మానాలన్నిటినీ కేవలం తిరుమల తిరుపతి దేవస్థానములు ఆచరించుటయే కాక హిందూ ధర్మపరిరక్షణకు పాటుపడే అన్ని ధార్మికసంస్థలు కూడా అమలు పరచాలని సదస్సు తీర్మానించింది.

# వైరాగ్యం

- ఆచార్య ఎ. సచ్చిదానందమూర్తి

## వైరాగ్యం అంటే...

విరాగం. రాగం లేకుండుట. దృశ్యమాన ప్రపంచ మందు రాగం లేకుండుట. శరీరము, ప్రపంచమందు విష యములు అనిత్యమైనవని గ్రహించి, ఇహ పరలోకముల యందు ఏ విధమైన కోరికలు లేకుండా ఉండటం. అలాగని తాముచేసే పనిని, తమకుగల బాధ్యతలను, స్వధర్మాన్ని వదిలి వేయడం వైరాగ్యంకాదు, తాము సాధించ దలిచిన లక్ష్యానికి అడ్డుగా వచ్చే వాటినన్నిటినీ వదలడమే వైరాగ్యం.

వివేకం వలన, విచారణ వలన వైరాగ్యం కలుగును. ఏది నిత్యమో, ఏది అనిత్యమో; ఏది సుఖమో, ఏది దుఃఖమో, ఏది మంచో, ఏది చెడో..... ఇత్యాదులను గ్రహించడమే 'వివేకం'. దృక్కును, దృశ్యమును పరీక్షించుచుండుట విచారణ. 'విచారణ' అనేది అంతరంగిక అన్వేషణ. ఈ విచారణయే వైరాగ్యంనకు దగ్గర దారి. సద్విచారణ వలెనే అనిత్యపదార్థముల యందు అనాసక్తి ఏర్పడుతుంది. ఇట్టి సద్విచారణ జనితమైన అనాసక్తి పేరే వైరాగ్యం.


అలాగే ప్రతికూల పరిస్థితిలో విషయాసక్తి విడిచి పెట్టడం వైరాగ్యం కాదు, అనుకూల పరిస్థితిలో విషయాసక్తి లేకపోవడం వైరాగ్యం. వైరాగ్యంనందు మూడవస్థలు గలవు. అవి 1)వైరాగ్యం యొక్క హేతువు, 2)వైరాగ్యం యొక్క స్వరూపం, 3)వైరాగ్యం యొక్క కార్యం.

విషయములయందుగల అనిత్యత్వ స్వాతి శయత్వాది దోషదర్శనమే వైరాగ్యమునకు హేతువు. విషయభోగములను విడుచుటయే వైరాగ్యస్వరూపం. మరల భోగేచ్ఛ కలుగకపోవు టయే వైరాగ్యము యొక్క కార్యమగును. అలానే మనుష్యులలో కదలాడే భావాలబట్టి వైరాగ్యమందు వైవిధ్యాలున్నాయి. కొన్ని వైరాగ్యాలు తాత్కాలికమైనవి. అందులో కొన్ని -

**1) మందవైరాగ్యం-** సంసార బాధలు వచ్చినప్పుడో, మహాత్ముల మాటలు విన్నప్పుడో, దైవికగ్రంథములు చదువునప్పుడో, సత్సాంగత్యం కలిగినప్పుడో దైవకార్యంలో ప్రవేశించాలన్న భావన కలిగి, ఏదైనా ఒక తరుణోపాయమగు ధ్యానమునో, ధ్యాసనో ఏర్పరచుకునే తలంపు చేయడం మందవైరాగ్యం. (కొద్ది రోజులే ఈ సాధన. మరల ప్రాపంచికజీవనంలో పడిపోతారు)

**2)శ్మశానవైరాగ్యం-** ఆత్మీయులో, తెలిసినవారో మరణించి నప్పుడు 'ఎవ్వరికెవ్వరో, ఎన్నాళ్ళు ఉంటారో, ఎప్పుడు రాలి పోతారో తెలియదు. మరణం తప్పదని తెలిసినా బంధాలను పెంచుకోవడం, భార్యా పుత్రాదులకై, బందుమిత్రులకై పరి తపించడం, కష్టపడి సంపాదించడం, చివరికి ఏదీ తోడురాక ఒంటరిగా కాటికి చేరుకోవడం... ఏమిటిదంతా? ఇంతటిదానికి ఎందుకింత ప్రాకులాడడం... ఇత్యాది ఆలోచనలతో వైరాగ్య భావంకు లోనుకావడం శ్మశానవైరాగ్యం. (కొలదిరోజుల్లోనే సంసారమునందు మునిగిపోతారు)

**3) ప్రసూతివైరాగ్యం-** ప్రసవవేదన పడుతున్నప్పుడు ఈ బిడ్డ ఒక్కరు చాలు, చాలు. ఈ నొప్పులు మరల మరలపడలేను..... అని ఆ బాధను తాళలేక అనుకోవడం ప్రసూతివైరాగ్యం. (మరల సంతోషంగా మరోసంతానికి సిద్ధం కావడం జరుగుతుంది)



**4)పురాణవైరాగ్యం-** పురాణాలు వింటున్నప్పుడూ, పఠిస్తున్నప్పుడు దైవం నందు భక్తిభావం కుదిరి మోక్షం పొందేయాలి అని ఆ క్షణమునే భావించి త్వరపడడం పురాణవైరాగ్యం.

కొన్ని స్థిరముగా నిలిచే దృఢమైనవైరాగ్యాలు. అవి –

**1) మృదువైరాగ్యం-** ఆధ్యాత్మికమార్గంలో పయనించాలని, అందుకై గురువును ఆశ్రయించాలని, పరమార్థసిద్ధిని పొందాలని, పరితాపంతో ప్రయత్నించడం మృదువైరాగ్యం.

**2) తీవ్రవైరాగ్యం-** ఇదంతా మిథ్యాప్రపంచమని గ్రహించి, ప్రాపంచిక విషయలాలసను విడిచి, దేనియందు ప్రీతి లేకుండా పరమాత్మకై ప్రయత్నించడం తీవ్రవైరాగ్యం.

**3) తీవ్రతరవైరాగ్యం-** అనన్యదైవభక్తితో, బ్రహ్మజ్ఞానామృతం గ్రోలడానికి ఒకే ధ్యాసలో మోక్షమనెడు సర్వేశ్వరప్రాప్తికై అవిశ్రాంతకంగా ప్రయత్నించడం తీవ్రతరవైరాగ్యం.

**4) అతి తీవ్రతమవైరాగ్యం-** జ్ఞానతాపంచే తపిస్తూ ఆత్మోపలబ్ధికొరకు ఆజన్మాంతం ప్రయత్నించడం అతి తీవ్రతమవైరాగ్యం.

వైరాగ్యం ఎప్పుడూ మనస్సులోనే కలుగుతుంది. కాని, అరణ్యానికో, నిర్జనప్రదేశానికో, స్వధర్మాన్ని విడిచిపెట్టి ఏకాంత వాసానికో వెళ్ళడం వైరాగ్యం కాదు అని మానవుడు గ్రహించాలి.

## వైకుంఠపాళి
### :: 98 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ద | శ | 2 ర | థు | డు | | | 3 ఆ | మ | ల | 4 కి |
| ధి | | మ్యు | | | | | యు | | | ష్కిం |
| 5 ము | రు | డు | | 6 జ | టా | యు | వు | | 7 రా | ధ |
| ఖు | | | | లం | | | | 8 శి | వ | |
| డు | | | | 9 ధ | ర్మ | 10 రా | జు | | ణా | |
| | | 11 నీ | | ర | | ధ | | 12 కా | సు | |
| | 13 న | లు | డు | | 14 ధ | | 15 వి | | 16 రు | మ |
| 17 అం | | డు | | 18 ప | ర | శు | రా | ము | డు | |
| 19 గ | తి | | 20 స | | | | టం | | | 21 వ |
| దు | | 22 సు | ర | స | | | | | | సం |
| డు | | | మ | | 23 మ | హేం | ద్ర | ప | ర్వ | తం |

## తిరుమల శ్రీవారి తెప్పోత్సవాలు
*(మార్చి 20 నుండి 24 వరకు)*



తెప్ప అనగా పడవ, ఓడ. ఓడలో సుఖాసీనులైన శ్రీ తిరుమల స్వామి వారిని కోనేటిలో విహారం చేయించడమే తెప్పోత్సవం అంటారు. ఈ తెప్పోత్సవాలను తమిళంలో *'తిరుపల్లి ఓడై తిరునాళ్'* అంటారు. వీటినే తెలుగులో 'తెప్ప తిరునాళ్లు' అని అంటారు.

తిరుమలలో శ్రీవేంకటేశ్వరునికి అత్యంత ప్రాచీన కాలం నుండి తెప్పోత్సవాలు జరిగేవని తెలుస్తున్నది. ఈ ఉత్సవాల కొరకే 1468లో పుష్కరిణి మధ్యలో, సాళువ నరసింహరాయలు ఒక మండపాన్ని నిర్మించారు. దీనినే *'నీరాళి మండపం'* అంటారు. ఆ సమయంలో ఈ మండపంలో కొలువై ఉన్న స్వామివారికి నివేదన కట్టడి ఏర్పాటు చేశాడట.

ప్రతి సంవత్సరం ఫాల్గుణమాసంలో శుద్ధఏకాదశి నుండి పౌర్ణమివరకు ఐదురోజులపాటు తెప్పోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఐదురోజులపాటు జరిగే ఈ తెప్పోత్సవాల్లో మొదటి రోజు (ఏకాదశి రోజు) సాయంకాలం 6 గం॥లకు తిరుమల పుష్కరిణిలో తెప్పలో శ్రీసీతారామ లక్ష్మణులు మూడు ప్రదక్షిణాలలో విహరిస్తారు. రెండవరోజు (ద్వాదశి రోజు) శ్రీరుక్మిణీకృష్ణులు పుష్కరిణిలోని తెప్పను అధిరోహించి మూడుమార్లు ప్రదక్షిణంగా విహరిస్తారు. ఇక మూడవరోజున త్రయోదశినాడు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి తిరుచ్చిని ఎక్కి మూడుమార్లు ప్రదక్షిణగా విహరిస్తారు. నాల్గవ రోజు శ్రీదేవి, భూదేవులతో కూడిన శ్రీవేంకటేశ్వరస్వామివారు ఐదుప్రదక్షిణాలున్ను, ఐదవ రోజు ఏడుమార్లు తెప్పలో విహరిస్తారు.

వేసవిప్రారంభంలో పున్నమిరోజుల నాటి వెన్నెల కాంతుల్లో శ్రీస్వామివారిని ఊరేగించే ఈ తెప్పోత్సవాలను భక్తులు కనులారా వీక్షించినట్లయితే ధన్యులు అవుతారు.

– *శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం*




# కరుణాంతరంగుడు శ్రీవేంకటేశ్వరుడు

- శ్రీమతి మాడ్గుల మాధురి


మా ఇలవేల్పు, ఆదిదేవుడైన ఆ వేంకటేశ్వరుని పాదసన్నిధిలో నాకు జరిగిన అనుభవాన్ని యథాతథంగా భక్తిశ్రద్ధలతో వివరిస్తున్నాను.

మేము తరచూ తిరుమలకు వెళ్లి ఆ స్వామిని సందర్శించి ప్రసాదాన్ని భక్తితో స్వీకరించి క్షణకాలంలో జరిగిన దర్శనభాగ్యాన్ని, చాలచక్కగా జరిగిందని భావిస్తూ ఉంటాము. ఆ స్వామివారిని ఎన్నిసార్లు దర్శించినా తనివి తీరదు.

ఒకనాడు నేను నా భర్తతో కలసి యథావిధంగా తిరుమలకు వెళ్లాలని సంకల్పించుకొని, మాట్లాడుకుంటున్నాము. మా మాటలు విన్న మా పని మనిషి తన దగ్గర ఉన్న దేవుడి హుండీలోని రూ. 5,000/- మాకు తెచ్చిచ్చి 'అమ్మా ఈ సొమ్ము నా కష్టార్జితం, ఆ వేంకటేశ్వర స్వామికి అందజేయండి. నేను వెళ్లలేను. అంత స్థోమత నాకు లేదని' తెలిపింది. అంతా చిల్లరనోట్లు, అన్ని కలిపి ఒక పసుపుసంచిలో ఉంచి దానికి దారం చుట్టి ఇచ్చింది. ఆమె భక్తి ప్రపత్తులకు సంతోషించి తప్పక హుండీలో వేస్తామని తిరుమలకు బయలుదేరి వెళ్లాము.

స్వామివారిని దర్శించే సమయంలో విధినిర్వహణలో ఉన్న మహిళలు త్రోస్తున్నా, పొడుగాటి వ్యక్తులు అడ్డంగా ఉన్నా, నా స్వామి దర్శనం ఎక్కడ కలుగదోనన్న భావంతో నిక్కి నిక్కి తలపైకెత్తి చూస్తూ దర్శనం చేసుకొని బయటికి వచ్చి హుండీలో డబ్బు వేస్తామని చూస్తే డబ్బులేదు. ఆ క్షణంలో ఒక్కసారిగా గుండె గుభేలుమంది. మా పనమ్మాయికి నేను ఏమని సమాధానం చెప్పాలి? స్వామికి మేము ఏమి అపరాధం చేశామో తెలియని పరిస్థితి. మా పనిమనిషి దీనవదం, బాధ ముప్పరిగొనగా, దిక్కుతోచని స్థితిలో నిస్తేజం చెంది, స్వామిపుష్కరిణి గట్టున కూర్చుని విచారిస్తూ- 'స్వామి మేము చేసిన అపరాధం ఏమిటి? రూపాయి రూపాయి కూడబెట్టిన మా పనిమనిషికి నేను ఏమని సమాధానం చెప్పాలి? ఆమె నమ్మకాన్ని మేము వమ్ము చేసిన వారమే గదా!' అని అనుకొంటూ శ్రీవిష్ణుషోడశ నామస్తోత్రం- మనసులో మననం చేసుకుంటున్నా!

నా ఆవేదనను అర్థం చేసుకున్న ఆ వైకుంఠవాసుడి దయవల్ల నాకు ఎండమావుల్లో ఒయాసిస్సులా ఒక తియ్యటి మధురమైన అనౌన్సుమెంటు చెవులకింపుగా నాకు వినబడింది.



"ఎవరో భక్తులు చిల్లరనోట్లు కల ముడుపు మాకు చేరింది. సంబంధించిన వ్యక్తులు దేవస్థానం సిబ్బందిని ఫలానా ప్రదేశంలో కలసి స్వీకరించవలసింది" అని.

ఆ అనౌన్సుమెంటు వినగానే పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది. స్వామిపైన విశ్వాసం ఏడుకొండలంత ఎత్తు పెరిగింది. ఆశ్చర్యం, భావోద్వేగం కలిగాయి. మా ఆయన్ను కుదిపి త్వరగా వెళ్లి డబ్బు తెమ్మన్నాను. ఆయన "నాకు వినిపించని అనౌన్సుమెంటు నీకెలా వినిపించింది? అంతా నీ భ్రమ. అదే ఆలోచనలో ఉన్నందున నీకలా అనిపించి ఉంటుంది." అని అన్నారు. ఏమి చేయాలో తెలియక, దిక్కుతోచని స్థితిలో కన్నీరు మున్నీరుతో ఉండిపోయాను. ఆ క్షణంలో దేవస్థానం వారి అనౌన్సుమెంటు మరోసారి వినిపించింది. ఈ సారి మావారు కూడా విన్నారు. వేయిదండాలవాడికి వేయిదండాలను మనుసులో సమర్పించుకున్నాను. 'నీవు చెప్పింది నిజ'మన్నారు మా ఆయన.

వెంటనే, దేవస్థానం సిబ్బందిని కలువగా వారు వివరాలు అడిగారు "అన్ని చిల్లర నోట్లండి. కవర్లో ఉంచి దారం చుట్టాం. అది మా ఇంటి పనిమనిషి కష్టార్జితం. మేము తిరుమలకు వస్తూ ఉంటే హుండీలో వేయమని ఇచ్చింది" అని వివరాలిచ్చాము, వారు ఆపైకం మాకు అందజేశారు.

ముప్పిరిగొన్న ఉత్సాహం ఒకవంక, స్వామికి మాపైన కల అపారకరుణ మరోవంక కలుగగా స్వామినామాన్ని జపిస్తూ హుండీలో ఆ ముడుపును సమర్పించుకున్నాము.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, భక్తుల అంత రంగంనెరిగిన అపార కరుణాసాగరుడు, ఆ కంచి గరుడసేవ కునికి సాష్టాంగప్రణామాలు చేస్తూ వెనుదిరిగాము.

ఆ భక్తవిఠలునికి తన భక్తులపై కల అపార కరుణకు ఇంతకంటే ఇంకేమి సాక్ష్యం కావాలి.

"హే కలియుగ ప్రత్యక్షదేవా! దేవాదిదేవా! కరుణాంత రంగా పాహిమాం! పాహిమాం!! శరణు శరణుదేవా..."

ఓం నమో వేంకటేశాయ

**సవరణ:** 2024, జనవరి మాసపత్రికలో ప్రచురించబడిన 'సంక్రాంతి' అను వ్యాసం పుట 14లో, పేరా 3లో, 3వ వరుసలో 'ఉత్తరాయణం' బదులు 'దక్షిణాయనం' అని చదువుకోగలరు.



## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు, శ్రీనివాసమంగాపురం

**2024, ఫిబ్రవరి 28 నుండి మార్చి 8 వరకు**

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 28-02-2024 | బుధ | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 29-02-2024 | గురు | తిరుచ్చి ఉత్సవం,ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 01-03-2024 | శుక్ర | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 02-03-2024 | శని | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 03-03-2024 | ఆది | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 04-03-2024 | సోమ | పల్లకీలో మోహినీఅవతారం | గరుడవాహనం |
| 05-03-2024 | మంగళ | హనుమద్వాహనం | సా॥వసంతోత్సవం,గజవాహనం |
| 06-03-2024 | బుధ | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 07-03-2024 | గురు | రథోత్సవం | అశ్వవాహనం |
| 08-03-2024 | శుక్ర | పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |

ఆయుర్వేదం

# ఆరోగ్య పరిరక్షణకు 'మునగ'

-డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

గ్రామాలు, పట్టణాలు, నగరాలతో నిమిత్తం లేకుండా ప్రతిచోటా పెరిగే మునగచెట్టు శరీరపోషణకు ఉపయోగపడటమే కాక వివిధ వ్యాధుల నివారణ, నిరోధాలకు కూడా శక్తివంతమైన ఔషధంగా పనిచేస్తుందనే విషయం జగద్విదితం.

మనం ఎదుర్కొనే వివిధ అనారోగ్య సమస్యలకు మునగని ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో ప్రస్తుతం తెలిసికుందాం.

**ఆకలి బాగా అయ్యేందుకు:** రోజూ ఒకసారి 200మి.లీ. మరిగే నీటిలో గుప్పెడు మునగాకుల్ని వేసి దించి, మూతపెట్టి నీరు చల్లారాక వడగట్టి ఆనీటిలో కాస్త మిరియాల పొడి, ఉప్పు, నిమ్మరసం కలిపి సేవిస్తుంటే జీర్ణశక్తి మెరుగు పడి ఆహారం బాగా జీర్ణమై జీర్ణాశయ సమస్యలు తగ్గుతాయి.

**నేత్ర వ్యాధులు తగ్గేందుకు:** 100మి.లీ. కేరట్ రసం, 20మి.లీ. మునగాకురసం, 5మి.లీ. తేనె కలిపి రోజూ ఒకసారి సేవిస్తుంటే కంటివ్యాధుల్లో ప్రయోజనకరంగా ఉంటుంది. రేచీకటిలాంటి సమస్యలకు మంచిది. జ్ఞాపకశక్తి కూడా వృద్ధి అవుతుంది.

**దెబ్బలు, బెణుకు నొప్పులు త్వరగా తగ్గేందుకు:** తగినన్ని మునగాకుల్ని దంచి వేడిచేసి కాస్త నిమ్మరసం కలిపి పట్టిస్తుంటే చక్కటి గుణం కనిపిస్తుంది.

**చర్మ వ్యాధులకు:** ఒక భాగం మునగాకురసాన్ని మూడు భాగాల కొబ్బరినూనెకు కలిపి నూనె మాత్రమే మిగిలేలా సన్నమంటపై మరిగించి దించి చల్లార్చి వడగట్టి నిల్వయుంచుకుని రోజు ఒక సారి పట్టిస్తుంటే గజ్జి, తామర, దురదలాంటి వ్యాధులు త్వరగా తగ్గుతాయి.

**బాలింతల్లో క్షీరోత్పత్తికి:** తగినన్ని నీటిలో గుప్పెడు మునగాకులు, రెండుచిటికెల ఉప్పు వేసి మెత్తగా అయ్యేలా ఉడికించి నాలుగైదు చిటికెల మిరియాల పొడి, పావు టీ స్పూన్ నెయ్యి కలిపి రోజూ ఒకసారి అన్నంలో కలుపుకొని తింటుంటే శిశువుకు సమృద్ధిగా మాతృక్షీరం లభ్యమవుతుంది.

**కడుపులో వ్రణాలకు:** రోజూ ఉదయం, సాయంత్రం పూటకు అర టీ స్పూన్ మునగాకుల పేస్టును 10మి.లీ. పెరుగులో కలిపి సేవిస్తుంటే వ్రణాలు త్వరగా మానిపోతాయి.

**అతిమూత్రం:** రోజూ రెండు పూటలా పూటకు 5-10 మి.లీ. మునగాకు రసంలో 2, 3 చిటికెల సైంధవ లవణం పొడి కలిపి సేవిస్తుంటే ఎక్కువసార్లు గాని, ఎక్కువ ప్రమాణంగాని మూత్రం వెడలటం అనే సమస్య తగ్గుతుంది.

**వేధించే తలనొప్పి, మెడనొప్పులకు:** మునగాకుల రసంలో 2, 3 చిటికెల మిరియాల పొడి కలిపి కణతలు నుదిటిపై, మెడ భాగంలో పట్టులా వేసి అరగంటాగి కడిగేస్తుంటే ఆయా నొప్పుల నుంచి తక్షణ ఉపశమనం కలుగుతుంది.

## శ్రీ కపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు, తిరుపతి

2024, ఫిబ్రవరి 29 నుండి మార్చి 10 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 29-02-2024 | గురు | -- | మూషికవాహనంపై వినాయకస్వామి, అంకురార్పణం |
| 01-03-2024 | శుక్ర | (పల్లకీఉత్సవం) ధ్వజారోహణం | హంసవాహనం |
| 02-03-2024 | శని | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 03-03-2024 | ఆది | భూతవాహనం | సింహవాహనం |
| 04-03-2024 | సోమ | మకరవాహనం | శేషవాహనం |
| 05-03-2024 | మంగళ | తిరుచ్చిఉత్సవం | అధికార నందివాహనం |
| 06-03-2024 | బుధ | వ్యాఘ్రవాహనం | గజవాహనం |
| 07-03-2024 | గురు | కల్పవృక్షవాహనం | అశ్వవాహనం |
| 08-03-2024 | శుక్ర | రథోత్సవం | నందివాహనం (మహాశివరాత్రి) |
| 09-03-2024 | శని | పురుషామృగవాహనం | కల్యాణోత్సవం, తిరుచ్చిఉత్సవం |
| 10-03-2024 | ఆది | సూర్యప్రభవాహనంలో నటరాజస్వామి త్రిశూలస్నానం | ధ్వజావరోహణం, రావణాసురవాహనం |

మార్చి, 2024

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** అధికధనం వ్యయం. ఆరోగ్యవిషయంలో శ్రద్ధ వహించాలి. ఆర్థికవిషయాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.



**వృషభం–** ఆకస్మిక ధనలాభం. ఆర్థికపరిపుష్టి. ఉద్యోగంకొరకు చేసే ప్రయత్నం సఫలమౌతుంది.



**మిథునం–** వృత్తి, ఉద్యోగాలలో కష్టపడి పనిచేయాలి. ఖర్చులను తగ్గించుకోవాలి. డబ్బు పొదుపు చేయడం మంచిది.



**కర్కాటకం–** అదృష్టప్రదమైన కాలం. మీ ప్రయత్నాల్లో విజయం. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం కన్పిస్తుంది. సంపాదన మెరుగుపడుతుంది..



**సింహం–** మీ ఆరోగ్యవిషయంలో శ్రద్ధ వహించాలి. దూరప్రయాణాలు వాయిదా వేసుకోండి. ఆర్థిక, పెట్టుబడుల వ్యవహారంలో జాగ్రత్త వహిస్తారు.



**కన్య–** కుటుంబంలో సానుకూల పరిస్థితులు ఏర్పడుతుంది. వ్యాపారస్థలకు లాభాలు వస్తాయి. ఉద్యోగులు పైవారి నుండి ప్రశంసలు అందుకొంటారు.



**తుల–** విద్యార్థులు పరీక్షల్లో రాణిస్తారు. చదువులో పురోగతి. వ్యాపారం పెరుగుతుంది. మీ అవసరాలకు తగినట్లు ఆదాయం ఉంటుంది.



**వృశ్చికం–** నూతనగృహప్రాప్తి. విద్యార్థులు ముందంజలో ఉంటారు. ఆకస్మిక ధనలాభం ప్రాప్తిస్తుంది.



**ధనుస్సు–** గ్రహస్థితి అనుకూలం. వ్యాపారవృద్ధి. ఆరోగ్యం బాగుంటుంది. జీవితంలో కొత్త దృక్పథాన్ని పొందుతారు..



**మకరం–** విద్యావిషయాల్లో ఉత్తీర్ణత పొందుతారు. నూతన వస్తు వస్త్రాభరణాల ప్రాప్తి. మీ ప్రవర్తన అందరికి ఆనందాన్ని కల్గిస్తుంది.



**కుంభం–** ధనాన్ని విరివిగా ఖర్చు చేస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. కుటుంబవాతావరణం శాంతియుతంగా ఉంటుంది. వాక్చాతుర్యం ప్రదర్శిస్తారు.




**మీనం–** జన్మరాశిలో బుధ, రాహువులు బంధన యోగాన్ని కలుగజేస్తారు. గృహంలో శుభ యోగాలు కలిసి వస్తాయి. భూ,గృహ స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు..

## 2024, ఏప్రిల్ నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 05-13 | తిరుపతి, శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం |
| 06 | శ్రీ అన్నమాచార్యవర్ధంతి |
| 09 | శ్రీ క్రోధినామసంవత్సర 'ఉగాది' |
| 11 | మత్స్యజయంతి |
| 12 నుండి 20 వరకు | వాయల్పాడు, శ్రీపట్టాభిరామస్వామివారి బ్రహ్మోత్సవం |
| 13 | శ్రీపంచమి |
| 14 | తమిళ ఉగాది |
| 17 | శ్రీరామనవమి |
| 17నుండి 25వరకు | ఒంటిమిట్ట, శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం |
| 21-23 | తిరుమల శ్రీవారి వసంతోత్సవం |
| 23నుండి మే 01వరకు | నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవం |

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## జీవుడే దేవుడు

వెన్న చేత బట్టి, వివరంబు తెలియక,
ఘృతము గోరునట్టియతనిభంగి,
తాను దైవ మయ్యు, దైవంబు దలచును;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** వివరము= స్పష్టంగా; ఘృతము= నేయి; భంగి= వలె.

**భావం:** చేతిలో వెన్న ఉండగా, దానిని గూర్చి స్పష్టంగా తెలిసికొనలేక నెయ్యి కావాలని కోరుకున్న విధంగా, మానవుడు దైవమై ఉండి దైవాన్ని తలచుకొంటాడు.

**వివరణ:** తనచేతిలో వెన్న ఉండగా నెయ్యికోసం వెదకడం తెలివి తక్కువ. ఆ వెన్ననుండి నెయ్యి వస్తుంది. కాబట్టి వెన్న ఉన్నదంటే నెయ్యి ఉన్నట్టే. అది తెలిస్తే నెయ్యికోసం వెదకడు. అలాగే జీవులందరూ దైవంకోసం వెదుకుతుంటారు. నిజానికి జీవుడే దేవుడు. ఆ విషయం గ్రహించక పోవడంచేతనే జీవులు పుణ్యక్షేత్రాదుల వెంట తిరుగుతూ దేవుడికోసం వెదుకుతారు. 'దేహో దేవాలయ ప్రోక్తః జీవో దేవ స్సనాతనః' అని ఆచార్యులవచనం. కాని వెన్నను వేడిచేయడం మొదలైన ప్రయత్నం చేస్తే నెయ్యి లభిస్తుంది. అదేవిధంగా జీవుడు తగినసాధన చేసి, తనలో దైవాన్ని దర్శించాలి. అంతేకాని, దైవంకోసం వెలుపల వెదకనవసరం లేదు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కరశతకం

## రాముఁ జేరి చిరపట్టము గట్టుకొనందె

కట్టడ దప్పి తాము చెడుకార్యముఁ జేయుచు నుండిరేని దోఁ
బుట్టినవారి నైన విడిపోవుట కార్యము; దౌర్మదాంధ్యముం
దొట్టిన రావణాసురునితో నెడబాసి విభీషణాఖ్యుఁ డా
పట్టున రాముఁ జేరి చిరపట్టము గట్టుకొనండె భాస్కరా! 13



**తాత్పర్యం**

భాస్కరా! నీతి నిజాయితీ తప్పి పాపకార్యాలు చేస్తుంటే జనులు అన్నదమ్ములనైనా త్యజించడం న్యాయమే. దుర్మ దాంధుడైన రావణాసురునితో విడిపోయి విభీషణుడు వెంటనే శ్రీరాముణ్ణి చేరుకొని రాజ్యపట్టం కట్టుకోలేదా!

వ్యాఖ్యానం– డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

### జనవరి నెల క్విజ్–18 సమాధానాలు

| | |
|---|---|
| 01) కామధేనువు | 11) భక్తాంఘ్రిరేణువు, విప్రనారాయణ |
| 02) గణపతి | 12) సుప్రభాతసేవ |
| 03) త్యాగయ్య | 13) ఓంకారం |
| 04) దానం | 14) శ్రీమహావిష్ణువు |
| 05) ఓంకారప్రతిధ్వని | 15) వీరసేనమహారాజు |
| 06) దాశరథి | 16) తిరుమలక్షేత్రం |
| 07) ఓంకారం | 17) ఓంకారస్మరణం |
| 08) ప్రవేశించడం | 18) కూరేశుడు |
| 09) ఇంద్రయాగం | 19) రామానుజులు |
| 10) గోదాదేవి | 20) తులసీదళం |

ఈ క్విజ్–18కు సరైన సమాధానాలు ఎవ్వరూ వ్రాయలేదు

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-29

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య    నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ

| | | |
|---|---|---|
| अस्मान् = మమ్మును | आहूय = పిలిచి | पास्यति = త్రాగగలడు |
| वृक्षात् = చెట్టునుండి, వల్ల, కంటె | पातुम् = త్రాగుటకు | पतति = పడుచున్నాడు |
| वृक्षेभ्यः = చెట్ల నుండి, వల్ల, కొరకు | पृष्ट्वा = అడిగి | चरति = నడచుచున్నాడు |

అ) ఈ క్రిందివాటిని తెలుగులోకి అనువాదం చేయండి?

01) किमरे क्षीरं पास्यसि किम्?
02) बालकः वृक्षात् अपतत्।
03) त्वं तत्र मा गच्छ।
04) ते बालकाः दौष्ट्यं करिष्यन्ति।
05) ब्राह्मणाः स्नानं कृत्वा तटाकात् आगच्छन्ति।
06) अनन्तरं भोजनं करिष्यन्ति।
07) अहमपि स्नानार्थं गच्छमि।
08) भोजनार्थम् आलस्यं मा कुरुत।
09) तव जनकः एतावत्पर्यन्तं ग्रामात् न आगच्छत्।
10) श्वः आगमिष्यति किं वा; तवानुजं प्रक्ष्यसि चेत् सः वदिष्यति।

అ) జవాబులు

01) ఏమిరా పాలు త్రాగగలవా ఏమి?
02) బాలకుడు (వృక్షము) చెట్టు నుండి పడెను.
03) నీవు అక్కడికి వెళ్ళకు.
04) ఆ బాలకులు గొడవ చేయగలరు.
05) బ్రాహ్మణులు స్నానం చేసి తటాకము నుండి వస్తారు.
06) తరువాత భోజనం చేయగలరు.
07) నేను కూడా స్నానం కొరకు వెళతాను.
08) భోజనం కొరకు ఆలస్యం చేయకండి.
09) నీ యొక్క తండ్రి ఇంతవరకు గ్రామము నుండి రాలేదు.
10) రేపు వస్తాడా ఏమి? నీ యొక్క తమ్ముడిని అడిగితే అతడు చెప్పగలడు.

ఆ) ఈ క్రిందివాటిని సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) ఆ పిల్లవానిని పాలు త్రాగుటకు పిలువుము.
02) అక్కడ నా మంచమున్నది కానీ ఇట్లు తీసుకొని రమ్ము.
03) నేను తీసికొని రాను.
04) మీ తమ్ముడిని తీసికొని రానిమ్ము.
05) నీవు పిల్లవానిని అడిగి అక్కడకు వెళ్ళుము
06) ఆ పిల్లలల్లరి చేయుచున్నారు.
07) మా యొక్క పండ్ల నెవరు తిన్నారు?
08) మీరే తిన్నారుగా.
09) అయ్యో చెట్ల నుండి పండ్లు పడ్డవి.
10) మీ చెంబులో కొంచెం పాలున్నచో నేను త్రాగెదను.

ఆ) జవాబులు


01) तं बालकं क्षीरं पातुम् आहूय।
02) तत्र मम शय्या अस्ति अत्र आनय।
03) अहं न आनयामि।
04) तव अनुजम् आनय।
05) त्वं बालकं पृष्ट्वा तत्र गच्छ।
06) ते बालकाः दौष्ट्यं कुर्वन्ति।
07) अस्माकं फलानि के अखादन्?
08) यूयमेव अखादत खलु।
09) अहो! वृक्षेभ्यः फलानि अपतन्।
10) तव पात्रे किञ्चित् क्षीरं अस्ति चेत् अहं पास्यामि।

చిత్ర కథ

# కుబేరుని గర్వభంగం

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్

కుబేరుడు యక్షులకి అధిపతి. అతను గొప్ప శివభక్తుడు. రావణాసురుడు లంకానగరం నుంచి కుబేరుని తరిమేశాడు. పారిపోయి అడవిలో శివుని గూర్చి తపస్సు చేశాడు కుబేరుడు. శివుడు ప్రత్యక్షమై...





మర్నాడు గణపతికి కుబేరుడు విందు భోజనం ఏర్పాటు చేశాడు.
రకరకాల పిండివంటలు... ఉండ్రాళ్ళు వడ్డిస్తున్నారు. గణపతి తింటున్నాడు. గణపతి....
ఊఁ.. వడ్డించండి. తొందరగా....
ఆశ్చర్యంగా ఉంది. ఇదేం తిండి...
ఆపవయ్యా గణపయ్యా! నీ పొట్ట పగిలిపోతుంది.
అందుకే పొట్ట చుట్టూ పాము చుట్టుకున్నాను... కుబేరా!
వేలమంది తినాల్సిన తిండిని గణపతి ఒక్కడే తిన్నాడు. అది చూసి...
వంటవాళ్లు చేతులెత్తేశారు. కుబేరుడు..
ఆకలి తీరిందా గణపతీ!
లేదు. వడ్డించు.
పరమేశ్వరా! నా గర్వం పోయింది. అందరికీ అన్నీ ఇచ్చే నీకు నేను ఏమివ్వగలను?
కుబేరుని గర్వంపోయింది. గణపతి ఆకలితీరింది. పరమేశ్వరుడు కుబేరుని ఆశీర్వదించాడు.
నీతి-
అహంకారం అనర్థానికి హేతువు

## సంఖ్యలను కలిపి రంగులు వేయండి!!









**1)లక్ష్మీజయంతి 2)మహాశివరాత్రి 3)హోలీపండుగ**

పై చెప్పిన పండుగలకు, పర్వదినాలకు సంబంధించి తగినట్లుగా సంఖ్యలను వ్రాయండి. ప్రతి పండుగకు సంబంధించి 4 చిత్రాలు ఉన్నాయి. కనుగొనండి!





## ఈ వాక్యాన్ని సరిచేయండి!




| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| వు | న | కో | మే | త | త్రు | న | వు | త |

జవాబు- తన కోపమే తన శత్రువు

## మార్గం కనుగొనండి!





మహాలక్ష్మి అభిషేకానికి కలశంతో నీళ్లు తీసుకొచ్చే ఏనుగుకు దారిని చూపించండి.







శ్రీరామజన్మభూమి, కాశీ, త్రివేణిసంగమం, ప్రయాగరాజ్ ఉన్న రాష్ట్రం పేరు .........................

జవాబు- ఉత్తరప్రదేశ్


**చక్రం తిప్పి అదే రంగులో ఉన్న ప్రశ్నకి తగిన జవాబు ఇవ్వండి?**






జవాబులు- 1)ఆదిలక్ష్మి 2)గజలక్ష్మి 3)విద్యాలక్ష్మి 4)సంతానలక్ష్మి 5)వీరలక్ష్మి 6)ధాన్యలక్ష్మి 7)ధనలక్ష్మి 8)విజయలక్ష్మి

క్రింద చేతిలో కనిపించే వస్తువులను పైన కనిపించే ఆమె చేతికి సరైనది చూసి అందించండి




జవాబు - ఆ) తామరపువ్వు

## సమయం విలువైనది



జీవితంలో అమూల్యమైనది
కాలం మాత్రమే!
దాని సరియైన రీతిలో
సద్వినియోగం చేయడం,
వృథా చేయడం
మనచేతిలోనే ఉంది.




# వివేక మార్గంలో నడవాలి

– ఉషశ్రీ

మహావిద్వాంసుడూ, భారతవంశ సామ్రాజ్యానికి ప్రధానమంత్రీ అయిన విదురుడు తన ప్రభువు అవివేకాన్ని వేలెత్తి చూపుతూ చెపుతున్నాడు. "ప్రభూ! ధనవంతుడున్నాడే వాడు హాయిగా సుఖ పడుతూ భోగమయ జీవితం గడుపుతూ తృప్తిపడకూడదు. పది మందికి పెట్టి, పేదవారికి దానధర్మాలు చేస్తూండాలి. దానం చేసేటప్పుడు చిరాకుతో, విసుగుతో చెయ్య కూడదు. సంతోషంతో చేస్తే పుచ్చుకున్నవాడు కూడా ఆనంది స్తాడు. దానివల్ల మన పుణ్యం పెరుగుతుంది. అదే ధనానికి ఫలం. వేదవేదాంగాలు చదివినవారుంటారు. వారు నిత్యం సత్కర్మలే చేస్తూ లోకకల్యాణం కోసం పాటుపడాలి. శాస్త్రాలు చదివిన వారందరూ అందులో చెప్పిన సదాచారాలను తాము ఆచరించి ఎదుటి వారికి బోధించాలి.

ఆత్మబలం కనక ఉన్నట్లయితే ఎన్ని విపత్తులు మీదపడ్డా తట్టుకోగలం. అది లేని నాడు ఏ చిన్న కష్టం వచ్చినా క్రుంగి పోతాం. ద్వేషాన్ని ద్వేషంతో జయించలేము. క్రోధాన్ని




శాంతంతో జయించాలి. దుష్టులను మంచిమాటలతో మరలించాలి. లోభబుద్ధి ఉంటే అది పోవడానికి దానగుణం అలవరచుకోవాలి. అసత్యాన్ని సత్యమే జయిస్తుంది. అన్నిటికంటె లోభం మహాచెడ్డది. ఎందుకంటే– ఈ ప్రపంచంలో ఉండే బంగారం, మణులూ, రత్నాలూ, ధాన్యాలూ, అన్నీ లభించినా ఇంకా ఏదో దొరక లేదని ఏడుస్తూనే ఉంటాడు లోభి. అందువల్లనే మానవుడు ముందుగా లోభగుణాన్ని విడిచి పెట్టాలంటారు. విద్యార్థులైనవారు సోమరితనాన్ని దరి చేరనివ్వకూడదు. వ్యామోహాలకు లొంగరాదు. మదోన్మత్తులు కాకూడదు. చపలచిత్తులు కాకూడదు. సర్వసుఖభోగాలలో తేలియాడేవారికి చదువురాదు. విద్యాభ్యాసకాలంలో వినయాన్నీ, క్లేశసహనాన్నీ అలవరచుకోవాలి. అప్పుడే విద్య అంటుతుంది.

ప్రభూ! మరొక్క ముఖ్యమైన మాట. సావధానంగా వినండి. ఈ శరీరం శాశ్వతం కాదు. ఆత్మ మాత్రమే నిత్యం. అందుచేత దానిని గురించే యోచన చెయ్యాలి. ఈ విషయం మీకు తెలియనిదని చెప్పడం లేదు. తెలిసిన వాటిని మళ్లీ గుర్తు చేసుకోవడం మన విధి. కష్టపడి పెంచి, పోషించి, విద్యా బుద్ధులు నేర్పి, సంపద లన్నీ ఇచ్చిన తండ్రి మరణిస్తే, ఇన్నీ అనుభవించే ఆ కొడుకు ఏం చేస్తున్నాడు? కొంతసేపు ఏడ్చి, వల్లకాటికి తీసుకుపోయి బూడిద చేస్తున్నాడు. అంతేగదా! ఆ తరువాత హాయిగా జీవితం సాగిస్తున్నాడు. ఇదీ లోకవ్యవహారం. ఆ మరణించిన వాడి సిరిసంపదలన్నీ బంధువులు పంచుకు తింటున్నారు. ఆ శరీరాన్ని బూడిద చేస్తే పంచభూతాలలో కలసిపోతుంది. మరణించిన వాడితో ఎవరూ పోరు. ఎటొచ్చీ వాడు చేసిన పుణ్య, పాపకర్మల ఫలం మాత్రం కూడా వెడుతుంది. కనుకనే దానధర్మాలూ, పుణ్యకార్యాలూ చెయ్యాలని పెద్దలు చెబుతున్నారు. గురువులయందు భక్తి కలిగి శ్రద్ధతో వారి బోధలు వింటూ, వారిని సేవించుకోవాలి. ఎప్పుడూ సత్యమే పలకాలి. అసత్యభాషణానికి అవకాశం ఇవ్వకూడదు. ధనవంతులు దానధర్మాలతో త్యాగబుద్ధిని ఎలా అలవర్చు కుంటారో, అలానే బలపరాక్రమాలు కలవారు ఎదుటి వారిని హింసించడానికి దానిని వినియోగించరాదు. దుర్బలులకు సాయ పడడానికే వీరులు కృషిచెయ్యాలి. అన్ని దానాలకంటె శ్రేష్ఠమైనది అన్నదానం. అదే కదా ప్రాణానికి ఆధారం. అలానే జీవితంలో ప్రధానమైనది 'ధర్మమార్గాన నడవడం.' అంతకంటే ఏమీలేదు.

**నీతి: ప్రతిజీవి ధర్మంతో వివేకమార్గంలో నడవాలి.**

# క్విజ్ 20

01) మనకు శాశ్వతబంధం ఎవరితో ఉంటుంది? జ)..............

02) తిరుపతిక్షేత్రం ఏ విధమైన భేదం లేకుండినది? జ)..............

03) ఆహారాన్ని ఎవరు సృష్టించారు? జ)..............

04) దేవతలకు ఆహారం ఏమి? జ)..............

05) పితృదేవతలకు నెలకు ఎన్నిసార్లు ఆహారం లభిస్తుంది? జ)..............

06) గంగానదికి దక్షిణంలో ఉన్న నది? జ)..............

07) తీర్థాలలో సర్వశ్రేష్ఠమైన తీర్థం? జ)..............

08) 'లక్ష్మి' అంటే - జ)..............

09) మహాభారతం ఏ పర్వంలో లక్ష్మీదేవి ప్రస్తావన వస్తుంది? జ)..............

10) తిరుమలకు మరొకపేరు? జ)..............

11) తీర్థాలన్నింటిలోనికి తలమానికమైనది? జ)..............

12) శ్రీకృష్ణుడు 'అన్ని ధర్మాలకంటే మిన్న' అని చాటి చెప్పిన ధర్మం? జ)..............

13) రామానాయుని భార్య పేరు? జ)..............

14) తరిగొండ గ్రామంలో గల గుట్ట పేరు? జ)..............

15) తేరళున్దూర్ దివ్యదేశ మూలమూర్తిపేరు? జ)..............

16) స్థావరజంగాలు అనగా? జ)..............

17) అగస్త్యుని ఆశ్రమం ఎక్కడ ఉంది? జ)..............

18) గుర్రాల గురించి తెలియజేసే విద్య? జ)..............

19) శకునశాస్త్రాన్ని రచించినవారు? జ)..............

20) విశ్వానికి గణితశాస్త్రాన్ని తెలియజేసిన భారతీయప్రాచీన గణితగ్రంథం? జ)..............

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-03-2024.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .................. వయస్సు: ..........

పాఠశాల: .................. తరగతి: ..........

పేరు: ..................

చిరునామా: ..................

..................

..................

.................. పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ..................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
.............................................................. తేది : ..................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 98



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

## అడ్డం

1)శ్రీరాముని తండ్రి(5); 3)ఫాల్గుణశుద్ధ ఏకాదశి పేరు(4); 5)ఘటోత్కచుని మామగారు(3); 6)దశరథుని స్నేహితుడు.ఒక పక్షి(4); 7)కర్ణుని పెంచిన తల్లి(2) 8)అనలుడను వసువు భార్య(2); 9)పాండవాగ్రజుడు(4); 12)ఒక నాణెము పూర్వకాలంలో(2); 13)విశ్వకర్మ యొక్క కుమారుడు. సముద్రానికి వారధి కట్టాడు(3); 16)సుగ్రీవుని భార్య(2); 18)శ్రీరామునికి విష్ణుచాపం ఇచ్చిన మహర్షి(6); 19)కర్దమ ప్రజాపతి కూతురు(2); 22)హనుమంతుని చూసి సంతోషించిన నాగమాత(3); 23)పరశురాముడు క్షత్రియుల్ని సంహరించిన తర్వాత దీనిపై నివాసమున్నాడు(6)

## నిలువు

1)సుగ్రీవుని మేనమామ(5); 2)ఆగ్రీధ్రుని కుమారుడు(3); 3)ఊర్వశి యందు పురూరవునకు పుట్టిన కుమారుడు(3); 4)పంపానదీ తీర సమీపమున ఉన్న దేశము(3); 6)భీముని భార్య(4); 7)లంకాధిపతి(6); 10)నందిని మఱదియగు శతగోపుడను వాని పుత్రిక(2); 11)వానరుడు. సుగ్రీవుని సేనలోని ప్రముఖుడు(3); 14)ధర్ముడికి ధూమ్ర వల్ల జన్మించిన మొదటి వసువు(2); 15)మత్స్యదేశానికి మరొకపేరు(3); 17)వాలి కుమారుడు(4); 20)విభీషణుని భార్య(3); 21)హోళిపండుగలో ఒకరిపై ఒకరు దీనిని చల్లుకుంటారు(3).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

26-01-2024న తిరుపతి తి.తి.దే. పరిపాలనా భవన ప్రాంగణం మైదానంలో జరిగిన '**75వ గణతంత్ర వేడుక**'లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి గారు. ఈ కార్యక్రమంలో **జాతీయ పతాకాన్ని** ఎగుర వేసి ప్రసంగిస్తున్న తి.తి.దే. ఈ.ఓ. శ్రీ ఏ.వి.ధర్మారెడ్డిగారు, తి.తి.దే. జే.ఈ.ఓ. శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., అప్పటి జే.ఈ.ఓ. శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., సి.వి.ఎస్.ఓ. శ్రీ నరసింహ కిషోర్, ఐ.పి.ఎస్. గారలు మరియు ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.















SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-02-2024 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2024-2026 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" posting on 5th of Every Month.



శ్రీలక్ష్మీ జయంతి 25-3-2024